# బహుళ

## త్రైమాసిక అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక

2021 - నవంబర్ - 01

సంపుటి -1 సంచిక - 4 https://www.bahulabyjwalitha.com జూన్-ఆగష్టు 2022

ముఖచిత్ర కథనం

నిఖత్ జరీన్ - పేజ 13



# మారనున్న విద్యావ్యవస్థ

సేకరణ: డా: జి.కె.డి. ప్రసాద్,
ఆంధ్ర విశ్వవిద్యాలయం.

ఇక పై దేశంలో డిగ్రీలు పీజీ లు ఉండవు

UGC కొత్త మార్గదర్శకాలు

ఇప్పటికే దేశంలో కొత్త విద్యా వ్యవస్థ (New educational system) ఆవిష్కృతమైంది. విద్యా రంగంలో కీలక మార్పులు చేస్తూ డాక్టర్ కస్తూరి రంగన్ కమిటీ రూపొందించిన జాతీయ నూతన విద్యా విధానాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.

విద్యా రంగంలో మొత్తం 27 అంశాల్లో మార్పులు

చేయనున్నారు. ఇపుడు యూజీసీ (UGC) మరో అడుగు ముందుకేసింది. ఇప్పటివరకు ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్ విషయానికొస్తే టెన్త్ (Tenth), ఇంటర్ (Inter), డిగ్రీ (Degree), పీజీ (PG), పీజీ డిప్లొమా అంటూ సమాధానాలు వచ్చేవి. కానీ, రాబోయే రోజుల్లో అలా చెప్పే వీలు ఉండదు. లెవల్ 4 (Level 4), లెవల్ 5 (Level 5).. లెవల్ 6 అంటూ చెప్పాల్సి వస్తుంది. వివిధ విద్యార్హతలకు స్థాయిలు (లెవల్స్) నిర్ణయించే దిశగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నూతన విధానాన్ని ప్రతిపాదించింది. ఈ మేరకు నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషనల్ (National Higher Educational) క్వాలిఫికేషన్ ఫ్రేమ్వర్క్ ముసాయిదాను విడుదల చేసింది.

40 క్రెడిట్స్ సాధిస్తే సర్టిఫికెట్..

సాంకేతిక విద్య (Technical education), జనరల్ కోర్సులు, స్కిల్ డెవలప్మెంట్ కోర్సులకు విడివిడిగా లెవల్స్ నిర్ధారించనున్నట్టు యూజీసీ తెలిపింది. దీంతో ఏ విద్యార్థి అయినా విదేశాలకు వెళ్లినప్పుడు ఏ లెవల్ (Level) పూర్తిచేసింది చెప్తే సరిపోతుంది. ఈ ముసాయిదా (Framework) పై యూజీసీ రాష్ట్రాల అభిప్రాయాలను సైతం కోరింది. క్రెడిట్స్ (Credits)ను సైతం యూజీసీ ఖరారు చేసింది. 40 క్రెడిట్స్ సాధిస్తే సర్టిఫికెట్, 80 క్రెడిట్స్ సాధిస్తే డిప్లొమా, 120 క్రెడిట్స్ సాధిస్తే డిగ్రీని జారీచేయవచ్చని పేర్కొన్నది. విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేసేందుకు, సాంకేతిక నైపుణ్యాలను సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు యూజీసీ ఈ ఫ్రేమ్వర్క్ రూపొందించి, ఉన్నత విద్యను ఏడు స్థాయిలుగా యూజీసీ వర్గీకరించింది. గతంలో ఆరు స్థాయిలు ఉండగా, తాజాగా ఏడు స్థాయిలకు పెంచారు. గతంలో ఇప్పుడు సాధించాల్సిన క్రెడిట్స్ సంఖ్యలో మార్పులు చేయలేదు.

10+2 విధానానికి బదులు 5+3+3+4..

రెండేళ్ల కిందటే నూతన విద్యా విధానం (New education Policy) తీసుకొస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ కొత్త విద్యావిధానంలో విద్యను సరళతరంగా మార్చారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి పెద్దపీట వేస్తూ.. విద్యార్థులు తమకిష్టమైన కోర్సులను చదువుకునే వెసులుబాటు కల్పించారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు సిలబస్లో కోతపెట్టారు.

ప్రస్తుతమున్న 10+2 విధానానికి బదులు 5+3+3+4 విధానాన్ని అమలు చేయనున్నారు. ఇందులో 3 నుంచి 8 ఏళ్ల వరకు పిల్లలకు ఫౌండేషన్ స్టేజీ, 8 నుంచి 11 ఏళ్ల మధ్య వారు ప్రిపరేటరీ స్కూలింగ్, 11 నుంచి 14 ఏళ్ల వారు మిడిల్ స్కూల్, 14 నుంచి 18 ఏళ్ల వారు సెకండరీ స్థాయిలో ఉంటారు.

కొత్త జాతీయ విద్యా విధానం మేరకు విద్యార్థులకు ఐదో తరగతి వరకు మాతృ భాషలో బోధన సాగించాలి. విద్యార్థులపై భారం తగ్గించేలా బోర్డు పరీక్షల ప్రాధాన్యతను తగ్గించనున్నారు. ఆరో తరగతి నుంచి వృత్తి విద్యా కోర్సులు ఎంచుకునేందుకు వీలుకల్పిస్తారు.

నాలుగేళ్ల డిగ్రీ కోర్సు తర్వాత ఎం.ఫిల్ చేయకుండానే నేరుగా పీహెచ్డీలోకి ప్రవేశం కల్పిస్తారు. రెండేళ్ల తర్వాత డిగ్రీ మానేసిన వారికి డిప్లొమా ఇస్తారు. మధ్యలో చదువు మానేసినా మళ్లీ కొనసాగించుకునే అవకాశం కల్పిస్తారు. సైన్స్, గణితంలో విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు ప్రాథమిక స్థాయి నుంచే వారిని ప్రోత్సహిస్తారు. 6వ తరగతి నుంచి విద్యార్థులకు కోడింగ్, వృత్తి విద్యా కోర్సులను ప్రారంభిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలకు ఒకే రకమైన నిబంధనలు ఉంటాయి

# 'పొడిచే పొద్దు'కు ఆహ్వానం..



పరిగెత్తేవాడు ఆగేది ఆయాసం తీర్చుకోటానికి కాని ప్రకృతి సౌందర్యం ఆస్వాదించడానికి కాదు. మనం వర్తమానాన్ని మార్చలేము కాని భవిష్యత్తును మార్చుకోవచ్చు..

ఆ ప్రయత్నమే ఈ పత్రిక. ఏదో చెయ్యాలన్న ఆరాటం పిలిచినా పిలవకున్న నలుగురు కూడిన చోటికి పరిగెత్తించింది నన్ను ఆ నలుగురు ఎందుకు కూడారు తెలంగాణ కోసమా, కవిత్వం కోసమా, బహుజనవాదం కోసమా, స్త్రీవాదం కోసమా, కులం కోసమా ఆలోచించ లేదు. నలుగురు కలిసారంటే ఒక మంచి బలపడుద్దని ఆశతో వెళ్ళాను. కొన్ని సమూహాల వెనుక మరికొన్ని సమూహాల ముందు నడిచాను. ముందు నడుస్తున్నపుడు నా వెనుక కొమ్ములున్న గిత్తలు పొడిచినయి. నేను వెనక నడిచినపుడు ఎర్రి ఆవులు, ఎటకారపు ఎద్దులు కుమ్మినయి. పక్కనే కలిసి నడుస్తరనుకున్న స్త్రీలు చటుక్కున మాయమయిన్రు.

విద్యావంతుల వేదిక, విశ్వబ్రాహ్మణ సంఘం, మట్టిపూలు, రుంజ వంటి సమూహాలతో కలిసి పనిచేసినా, నాయకత్వం వహించినా చెయ్యవలసినంత చెయ్యలేక పోయామనే అసంతృప్తి మిగిలింది.

సింగిడి, తెరవె, సాహితీ ప్రస్థానం, బహుజన రచయితల వేదిక ఇంకా చాలా చాలా సంఘాలు, సమూహాలు ఎండమావిలాగా కళ్ళెదుటే ఉండి కనుచూపు దూరంలో ఉంచాయి. చాలా మంది లాగా నేను కూడా సామాజికంగా, సాహిత్యపరంగా ఒక విచిత్రమయిన పరిస్థితిని ఎదుర్కొంటున్నాను.

కట్టు కథలు చెప్పి బుట్టలో వేసేవారు. ఏకాలంలోనయినా కోకొల్లలుగా ఉంటారు. కట్టుకథలని తెలిసీ నమ్మినట్లు నటిస్తూ జీవితాలను వెళ్ళదీసే వారు కూడా అన్ని కాలాల్లో ఉంటారు. జరుగుతున్న విషయాలను స్పందిస్తూ సంఘర్షిస్తూ నిత్యం నలిగిపోతూ కవులు కళాకారులు సృజనకారులుంటారు. జరిగే అనర్థాలను చూడకుండా ఉండలేక, చూచి ఊరుకోలేక తమ అభిప్రాయాలతో ఏకీభవించే వారి సమీకరణ కోసం ప్రయత్నిస్తుంటారు.

ఆ ప్రయత్నమే చేయబోయి భంగపడి చెయ్యి కాల్చుకుని ఉఫ్ ఉఫ్ అని ఊదుకుంటూ కూర్చోలేక బహుళ వెలువరిస్తున్నాను, ఇందులో కూడా కలిసి పనిచేసే దిక్కార స్వరాలున్నయి. ఒక దృక్కోణం, ఒక ఎజెండా ఉన్నది. రక్త సంబంధం లేకపోయినా అవమానాలు తిరస్కారాలకు గురయిన వారందరికి ఒక ఏకసూత్రమున్నది. అది గుర్తు చెయ్యడమే నా ఉద్దేశం.

నేను గతంలో నిక్కచ్చిగా రాస్తున్న సమయంలో నేను పెట్టిన శీర్షికలను పత్రికలు మార్చి పెట్టడం కొందరికి ఇబ్బంది కలిగించింది. ఉదాహరణకు బహుజన కథా సదస్సులో పురుషాధిపత్యం' అని నేను రాస్తే దానికి దళిత అని చేర్చారు. దానితో దళిత సోదరులందరు కచ్చగట్టారు. ఒక యువకవ వివిధలో పేరు చూసుకోడానికి వ్యాసం రాశానన్నాడు.

బీసి రచయిత్రుల గురించి ఎవరు రాయడం లేదని వివరాలు సేకరించి 'బీసి రచయిత్రులు' అనే శీర్షికతో వ్యాసం రాస్తే "అస్తిత్వం మరిచిన బీసి రచయిత్రులు" అని మార్చారు. దానితో బీ.సి. సోదరీమణులందరూ కోపగించుకున్నారు. ఒకరిద్దరు ఫోన్ చేసి అడిగితే విషయం చెప్పాను అర్థం చేసుకున్నారు. కొందరు మూతులు బిగించారు.

పోతులూరి వీరబ్రహ్మంగారు గుళ్ళలోనే మిగిలిపోయాడెందుకు. ఆయన "కాలజ్ఞానం" మిగిలిన తత్వాలందించిన జ్ఞానమేమయ్యింది. మాన్యులు జ్యోతి బాపూలే సావిత్రీబాయిపూలే దంపతులను మనమెందుకు చిత్తశుద్ధితో అనుసరించలేకపోతున్నాం.

డా॥ బి.ఆర్. అంబేద్కర్ అందరికీ ఎందుకు అర్థం కావడం లేదు.? శూద్రులు అతిశూద్రులుగా విడదీయబడిన మూలవాసీల ఐక్యత రాజ్యాధికారానికి ఎప్పటికి చేరుకోగలదు...? ఆ నిర్వేదమే 'మల్లెసాల' శతాధిక చేతివృత్తి కథల సంకలనం, 'సంఘటిత' స్త్రీవాద కవితా సంకలనం చేసేలా పురికొల్పింది. మీ అందరి సమిష్టి కృషితో పూర్తయింది..

ఇప్పుడు ఏమిటి అంటే 2020లో ప్రకటించిన విధంగా 'పొడిచే పొద్దు' పూర్తిచేయాలి.

ముఖ్యంగా తెలంగాణ రచయిత్రులు బీ.సీ. రచయిత్రులు ఏమి రాస్తున్నారు ఏమి రాశారు రికార్డు చేయాలి. అందుకోసమే 'పొడిచే పొద్దు' సంకలనానికి బీసీ రచయిత్రులు అందరూ తమ స్వీయ పరిచయాలను పంపమని ఆహ్వానిస్తున్నాను.. పంపుతారు కదూ...

జ్వలిత ప్రధాన సంపాదకురాలు


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకురాలు**
జ్వలిత

**ప్రధాన సలహాదారులు**
డా. తిరునగరి దేవకీదేవి
అనిశెట్టి రజిత
డా. కొమర్రాజు రామలక్ష్మి

**సంపాదక వర్గం**
ఆచార్య సూర్య ధనుంజయ
జి. విజయలక్ష్మి
డా. షాజహానా
కొల్లాపురం విమల
డా. త్రివేణి
డా. నందిగామ నిర్మల కుమారి
నస్రీన్ ఖాన్
నాంపల్లి సుజాత
నిరుపమ
లావణ్య
డా. మారోజు దేవేంద్ర
రమాదేవి బాలబోయిన

**సాంకేతిక వర్గం**
చందన్ కలిత
టి. నరేష్ చైతన్య
కె. ప్రకాష్

**కార్యనిర్వాహక వర్గం**
జయింతి వాసరచెట్ల
సరోజన బోయిని
యడవల్లి శైలజ
సిస్టర్ అనసూయ
పోతన జ్యోతి


**బహుళ బహుజనస్త్రీలసమస్యలన్నింటినీ చర్చించే అవకాశం కల్పిస్తుంది. పత్రికలో ప్రచురించే రచనలతో సంపాదక వర్గం ఏకీభవించినట్టు కాదు.**


రచనలు పంప వలసిన చిరునామా :
జ్వలిత, సాహితీవనం, 15-21-130/2, బాలాజీనగర్, కూకట్పల్లి, హైదరాబాద్ - 500072, తెలంగాణ editorbahula@ gmail.com

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ముఖచిత్రం | | .................................................1 |
| 2. | సాహిత్య వ్యాసం | 'కాలం వెంట నడిచిన కథ' | డాక్టర్ నందిగామ నిర్మల ................5 |
| 3. | పీఠిక | 'చీకట్లో చిరుదివ్వెలు – దేవకీదేవి కథలు' | కొల్లాపురం విమల .......................8 |
| 4. | క్రీడావ్యాసం | నిఖత్ జరీన్ | డా. త్రివేణి.................................13 |
| 5. | కథ | 'నల్లమ్మ' | మణి వడ్లమాని ..........................15 |
| 6. | కవిత | 'పరదా' | పి సుష్మ..................................19 |
| 7. | కవిత | 'సంతకం అంటే' | నాంపల్లి సుజాత ........................20 |
| 8. | అనువాద సాహిత్యం | 'రసోత్కృష్టం' | నిగమ ....................................21 |
| 9. | కవిత | అమృత చినుకు | వి. పద్మ..................................27 |
| 10. | సమీక్ష | 'సామాజిక నేపథ్యం ఆమె కవిత్వం' | వాసరచెట్ల జయంతి ....................28 |
| 11. | కవిత | 'ఈడొచ్చిందా' | ఆవుల రేణుక ............................29 |
| 12. | సాహిత్య వ్యాసం | ఆధునిక భావావేశం చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ కవిత్వం | కొండపల్లి నీహారిణి.......................30 |
| 13. | కవిత | 'సాక్షి భూతం' | సాయిలు చారి ..........................33 |
| 14. | కథ | ఎన్ని మరణాలో అన్ని జననాలు | రమాదేవి బాలబోయిన.................34 |
| 15. | కవిత | 'ఆమె' | స్వప్న మేకల .............................37 |
| 16. | కథ | 'నడిమంత్రపు పొద్దు' | సరోజన బోయిని ........................38 |
| 17. | అనువాద సాహిత్యం | 'ఆంగ్ల రచయిత్రుల పై స్పాట్ లైట్'బెర్నాడీన్ ఎవరిస్టో' | నవత తిరునగరి .......................42 |
| 18. | సమీక్ష | 'సందేశాత్మక కథల సమాహారం' | సమ్మెట విజయ .........................43 |
| 19. | క్రీడావ్యాసం | 'మలిదశలో క్రీడలందించే ఆనందపు బోనస్ లు' | సుమతి చురకంటి .....................45 |
| 20. | వ్యాసం | 'బుద్ధిని ఉపయోగిస్తే..' | నాంపల్లి సుజాత .......................47 |
| 21. | కవిత | 'వెలుగు విరులు' | వకుళ వాసు ..............................48 |
| 22. | కథ | 'రేపెల్లిపోతున్నా' | యం.ఆర్. అరుణకుమారి.............49 |
| 23. | కవిత | 'గాయపడిన గుండెగీతం' | సుమన ప్రణవ్............................51 |
| 24. | కథానిక | 'పూలోం కా యాదోం మే..' | కంచెర్ల శ్రీనివాస్ .........................52 |
| 25. | కవిత | 'తను' | రామానుజం సుజాత ...................53 |
| 26. | కళలు | 'వంటింటి వస్తువులతో మహిళారూపాలు' | డా.కందేపి రాణీప్రసాద్ ................54 |
| 27. | కవిత | 'అవకాశవాదులు' | శ్రీదేవి సురేష్ కుసుమంచి .............55 |
| 28. | కథ | 'పెరటి గోడ' | విజయగోలి ...............................56 |
| 29. | కవిత | ఋణ బంధం | శాంతి కృష్ణ ...............................57 |
| 30. | కథ | 'సమయానుకూలం' | పి.ఎల్.ఎన్. మంగారత్నం.............58 |
| 31. | కవిత | 'అన్నదాత సుఖీభవ' | కవిత నాగులవంచ......................62 |
| 32. | కవిత | క్షమించండి | వల్లాల విజయలక్ష్మి .....................63 |
| 33. | కవిత | కూడికను | నస్రీన్ ఖాన్...............................64 |
| 34. | కవిత | సృష్టి కర్తకు మరో రూపం | ఆచంట సుధా కళ్యాణి ................65 |
| 35. | బాల బహుళ | | ...............................................66 |

సాహిత్య వ్యాసం

# కాలం వెంట నడిచిన కథ



డా. నందిగామ నిర్మలకుమారి

మనిషి తన తోటి సమాజంతో కొనసాగించిన తొట్టతొలి ఉద్విగ్న మానస సంభాషణమే ఆదిమ సాహిత్యరూపం అయి ఉండొచ్చు. ఆకలికోసం వేసిన కేకలు కావచ్చు, ఆలంబన కోసం చేసుకున్న భావనలు కావొచ్చు, శత్రు భయంనుండి పెట్టిన కేకలు కావొచ్చు ఇవన్నీ తొలి కావ్య వస్తు ప్రేరణలు. చీకటి గుహల్లో తాను బ్రతికిన ఆనవాళ్ళను ఏ

రాయితోనో, చెట్టు బెరడుతోనో గీసిన గీతలు ఆదిమ కావ్య మొదటి రూపం అయి ఉండొచ్చు. అలా తన జీవికలో బ్రతుకు పోరాటంలో శ్రమలో భాగం అయినప్పుడు చిందిన చెమట చుక్కలు ఆ కావ్యానికి తాళాలు అయి ఉండొచ్చు. ఆవిధంగా మొదట సైగలు తర్వాత రాతలు గీతలతో మొదలైన ఆదిమ కళ మనిషి తో బాటే పెనవేసుకొని దానిని ఒక రూపంగా స్థిరపరుచుకుంది. ఈ ప్రక్రియ ఏ ఒక్క యుగంలోనో జరిగి ఉండదు. కొన్ని వందల తరాలు వ్యాప్తి చెంది ఉంటాయి. ఇవన్నీ మనిషి వ్యక్తీకరణ మౌఖికం నుండి లేఖనం దిశగా కొనసాగిన ప్రాథమిక కొండగుర్తులు.

అసలు తొలి సాహిత్య రూపం ఏమిటి? అది మౌఖికమా లిఖితమా? సైగలు భాషగా గుహల్లో గీసుకున్న గీతలు రచనకు ఆదిమ రూపాలుగా స్థిరపడ్డాయి. స్థిరనివాసం లేని ఆకాలాన ప్రకృతి ప్రకోపానికి బయపడినప్పుడు స్థిరపడిన దైవం అతని జీవితాంతం వెంటాడింది. ఆదైవం అనేక రూపాలుగా విస్తరించింది. అలా విస్తరించిన ప్రక్రియనే వివిధ క్రతువులలో మంత్రాలు, శ్లోకాలుగా స్థిరపడినాయి. ఆ విధంగా తొలి సాహిత్య రూపం వేద వాఙ్మయమే. అవి పురాణాలు, ఇతిహాసాలు, చిందు యక్షగానాలు, కావ్యాలు, గల్పిక, నవల, కథ, కవిత్వం, నాటకం, నాటి నుండి నేటి దాకా మనిషి జీవితం తో పెనవేసుకొని కాలంతో నడుస్తూనే ఉంది.

తెలుగునాట “నీతి చంద్రిక”, “కాశీ మజిలీ కథలు” లాంటి రచనా ప్రక్రియలు ఉన్నప్పటికీ “బృహత్కథ”, “కథా సరిత్సాగరం” “గాథాసప్తశతి” వంటివి ప్రాచీన పాళీ, ప్రాకృత భాషలలో కథనాలు ఉన్నాయి. అయితే ఈ కథ అనే ప్రక్రియకు గోథె హాప్మన్ లాంటి వారు తమవయిన నిర్వచనాలు ఇచ్చినప్పటికీ అసలు కథ లక్ష్య, లక్షణ చర్చలు ప్రతి భాషలోనూ జరిగాయి. క్రీ.శ. ఏడవ శతాబ్దానికి పూర్వం తెలుగు భాష శాసన, తాళపత్ర గ్రంథాల లో ఆనవాల్ల మినహా మరే లిఖిత సాంప్రదాయమూ లేదు. అంత దాకా తెలుగు మూలాలు కన్నడ లిపిలో ప్రక్షిప్తాలుగా ఉండేవి. నన్నెచోడ, పాల్కురికి వేసిన తొలి తెలుగు కావ్య ఆనవాళ్ళు పది పన్నెండు శతాబ్దాల మధ్యనే కావ్యాలుగా మనకు మిగిలాయి. అలా తెలుగు కావ్యాలు ప్రబంధాలు, భక్తి కవిత్వం దాని కొనసాగింపుగా ఆధునిక కవిత్వం, కథానికలు బయలుదేరాయి. అలా పందొమ్మిదో శతాబ్ద ప్రారంభంలో అటు ఇటు పదేళ్ళలో తెలుగు కథానిక ఆనవాళ్ళు ఉన్నట్లు చరిత్రకారులు నిర్ధారించారు.

ఆక్రమంలో తెలుగు కథ మీద విస్తృతంగా చర్చ జరిగింది. మొదటి చర్చ తొలి కథ, కాలం లాంటి అంశాల చుట్టూ అనేక వాద వివాదాలు చోటు చేసుకున్నవి. ఆధునిక యంత్ర సామాగ్రి అందుకున్న సమాజాలు సాహిత్య ముద్రణలో ముందు ఉన్నాయి. అవి లేని సమాజాలు మౌఖిక కథలనే పరిగణలోకి తీసుకున్నారు. ప్రచురణ సమయం, ఆనాటి కథా కథన రీతి, ఎంచుకున్న అంశాల ప్రాదిపదికగా గురజాడ అప్పారావు రాసిన “దిద్దుబాటు” కథను తొలి ఆధునిక కథానికగా పరిశోధకులు నిర్ధారించారు. నాటి సామాజిక సాంస్కృతిక చైతన్యం ‘దిద్దుబాటు’ కథలో ఉన్నప్పటికి ఆచర్చ ఎంతోకాలం నిలబడలేకపోయింది. ఒక రకంగా తొలి కథానిక ‘దిద్దుబాటు’

అని స్థిరపరచిన చర్చను కదిలించే, ప్రశ్నించే సాహసం ఎవరూ చేయలేకపోయారు.

ప్రపంచ వ్యాప్తంగా జాతి, వర్ణ, లింగ, ప్రాంత అస్తిత్వ స్పృహతో సాహిత్యాన్ని పున:సమీక్ష చేసే ఆలోచనలు మొదలయినాయి. అమెరికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా మొదలైన నల్లజాతి పోరాటాలు. ఐరోపా కేంద్రంగా మొదలైన హక్కుల ఉద్యమాలు వాటితోపాటు జమిలిగా కొనసాగిన స్త్రీవాద ఉద్యమ చైతన్యం అనేక ప్రశ్నలు లేవనెత్తింది. సాహిత్యంలో రాజకీయాలలో, సాంస్కృతిక ఉద్యమాలలో ప్రాతినిధ్య సమస్య బలంగా ముందుకు వచ్చింది. ఆవిధంగా కులం, మతం, లింగ, ప్రాంతీయ స్పృహ సాహిత్య చర్చల్లో ఒక అనివార్యతను సృష్టించింది. ఆ అని వార్యత లోంచే పోతన స్థానికత మీద మరో దుమారం లేచింది. పోతన ఒంటిమిట్ట దగ్గర ఉన్న బమ్మెర అని అది కాదు వరంగల్ జిల్లా బమ్మెర గ్రామం పోతన నివాస స్థలంగా ముందుకు వచ్చిన క్రమంలోనే మలిదశ తెలంగాణ ఉద్యమం ఉదృతంగా ముందుకు వచ్చింది. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర నిలయ స్థాపనతో మొదలయిన తెలంగాణ సాహిత్య వికాసం సాహిత్య చరిత్రకు మొదటి మెట్టు నిర్మిస్తే, ప్రాంతీయ అభిజాత్యంతో ముదుంబై రాఘవాచార్యులు "తెలంగాణ లో కవులు పూజ్యము" అని చేసిన వివక్షా పూరితమైన ప్రకటనతో

మొదలయిన తెలంగాణ సాహిత్య పునర్నిర్మాణం, సాహిత్య చర్చల్లో తెలంగాణ సాహిత్యానికి జరిగిన వివక్ష లోంచే బయలుదేరిన "గోల్కొండ కవుల సంచిక", "పొక్కిలి", "ముంగిలి" లాంటి కవితా సంచికలు సాహిత్య ఆధిపత్య భావనలకు వ్యతిరేకంగా ప్రాంతీయ స్పృహతో ముందుకు వచ్చాయి. ఒక వైపు ప్రాంతీయ అస్తిత్వంతో తమవయిన వ్యథల వెలికితీత జరుగుతుండగా బండారు అచ్చమాంబ పేరు సాహిత్య చర్చల్లో ముందుకు వచ్చింది. 1874 కృష్ణా జిల్లా పెనుగంచి ప్రోలులో జన్మించిన ఆమె తమ్ముడు ప్రసిద్ధ చరిత్రకారుడు కొమ్మరాజు వెంకట లక్ష్మణరావు. ఆనాటికే బండారు అచ్చమాంబ సంస్కృత, మరాఠీ, గుజరాతీ భాషలు నేర్చుకున్న ఆమె 1902లో బందరులో 'బృందావన స్త్రీల సమాజం' స్థాపించారు. ఆనాటికి కోస్తా ప్రాంతంలో అది మొట్టమొదటి స్త్రీల సంస్థ. ఆమె తెలంగాణ కోడలుగా తన సాహిత్య ప్రస్థానాన్ని

హైదరాబాద్, నాగపూర్ కేంద్రంగా కొనసాగించింది. మొదటి సారిగా 1901 మే నెలలో 'తెలుగు జనానా' అనే పత్రికలో 'గుణవతియగు స్త్రీ' అనే కథను, అదే పత్రికలో 1901 సెప్టెంబర్ లో 'లలితాశారదలు', 1902 ఆగష్టులో 'సత్పాత్ర దానము'తో బాటు 1902నవంబర్ 'హిందూ సుందరి' పత్రికలో "ధన త్రయోదశి" అనే కథను ప్రచురించారు. ఇవి కాక ఇంకా కొన్ని కథలతో బాటు స్త్రీల జీవిత చరిత్రలను కూడా రాసిన ఆమెను తెలుగు సాహిత్య కారులు మరుగున పరిచారు. అచ్చమాంబ కథలు గురజాడ దిద్దుబాటు కన్నా ముందే ప్రచురణ పొందినవి అనే చర్చ సాహితీ ప్రపంచంలో ఒక దుమారమే లేపింది. మరుగున పడిన ఒక కథా రచయిత్రి గతం ఇది. ఆధిపత్య పురుష స్వభావంతో రాసిన వర్తమాన సాహిత్య చర్చలో కనుమరుగు అయిన ఒక స్త్రీ కథ వెనక కథ. ప్రాంతీయ అస్తిత్వ స్పృహ చేసిన స్వాభిమాన ప్రకటన మూలంగా వెలుగులోకి వచ్చిన తెలంగాణ కథ వెనక దాచేస్తే దాగని సత్యాలు ఎన్నో కొత్త సవాళ్ళను ముందుకు తెచ్చింది. 'దిద్దుబాటు' కథ తెలుగు నాట వందేళ్ళ కింద మొదలయినా దానికి ఇంకా వందేళ్ళ కిందనే మౌఖిక కథలు ఉండే అవకాశం ఉంది అని కథానిలయం పూనికతో మొదలయిన మేధో శ్రమ మరో వంద కథల వెలికితీతకు ఆవిష్కరణకు దోహదం చేసింది. తానా ప్రచురణల సౌజన్యంతో రెండేళ్ళ కింద వచ్చిన ఈ పుస్తకంలో దిద్దుబాటు కథకన్నా పూర్వం ప్రచురణ పొందిన పెద్దగా ప్రాచుర్యంలో లేని వ్యక్తుల కథలు వెలుగులోకి వచ్చాయి. సమగ్రమైన పరిశోధన లేకుండా భావోద్వేగాలతో చరిత్రను రాసినప్పుడు జరిగిన తప్పిదాలు ఇవి. అప్పటిదాకా దిద్దుబాటు కథ తెలుగు సమాజాన ప్రచురితం అయిన తొలి ఆధునిక కథానిక అనే చర్చను పూర్వపక్షం చేసింది బండారు అచ్చమాంబ కథా సంకలనం. దాని కొనసాగింపుగా వచ్చిన తానా ప్రచురించిన వంద కథలు. అతిమంగా ఈ తొంబై రెండు కథల కన్నా ముందు కథలు లేవని కాదు కానీ స్థల కాలాలకు అనుగుణంగా చరిత్ర రచన జరిగినప్పుడు జరిగే తప్పిదాలు ఇవి.

వర్తమానసామాజిక ఉద్యమాల వెలుగులో కథకు ఉన్న భిన్న అస్తిత్వాల నేపథ్యంలో కథల ప్రచురణ మొదలైనది. అభ్యుదయ రచయితల సంఘం, విప్లవ రచయితల సంఘం, జనసాహితి లాంటి ప్రజా సంఘాల సంస్థల మొదలు అనేక రాజకీయ పార్టీలు కూడా కవితా సంకలనాలను ప్రచురించారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో 'మహా సంకల్పం' పేరుతో వచ్చిన సంకలనం, ప్రజాశక్తి కథల సంకలనం, ప్రత్యేక తెలంగాణ స్ఫూర్తితో వచ్చిన 'తెలంగాణ కథ', విప్లవ రచయితల సంఘం 'విప్లవ కథ' తోబాటు అనేక

జిల్లాల రచయితల సంఘాలు తమ జిల్లా కథా రచయితల కథా సంకలనాలను విస్తృతంగా ప్రచురించాయి. వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అడ్లూరి అయోధ్య రామకవి కథా సంకలనం 'తెలంగాణ మంటల్లో' అనే కథా సంకలనాన్ని ప్రచురించినది.

'కథ' పేరుతో ప్రతి ఏటా వాసిరెడ్డి నవీన్ ప్రచురిస్తున్న 'కథ' గడిచిన రెండు దశాబ్దాలుగా నిరంతరంగా కొనసాగుతున్నప్పటికీ దానిలో ప్రాంతీయ వివక్ష మూలంగా తెలంగాణకు అన్యాయం జరిగింది అనే చర్చ ముందుకు వచ్చింది. ఆ వివక్షల వ్యతిరేకంగా తెలంగాణ సాహిత్యకారులు ముందుకు తెచ్చిన తొలి కథానిక చర్చ ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఆక్రమంలో వచ్చిందే బండారు అచ్చమాంబ 'ధన త్రయోదశి' మరి కొన్ని కథలు.

పందొమ్మిది వందల ఎనభైల తర్వాత రాష్ట్రంలో జరిగిన ఒక ఘోరవిపత్తు దళిత, బహుజన, విప్లవ శ్రేణుల్లో కుల చర్చ ఒక అని వార్యతను ముందుకు తెచ్చింది. వర్గ సంబంధాల ప్రాతిపదికగా జరుగుతున్న చర్చల్లో కుల ఆవశ్యకత, వివక్ష, తదితర అంశాలు ముందుకు వచ్చాయి. ఈ సందర్భం అటు వర్తమాన రాజకీయ పార్టీలలో ముఖ్యంగా విప్లవ సంఘాలలో కూడా కులం చర్చ ప్రధాన భూమిక అయ్యింది. భూమి ఇరుసుగా జరిగిన పోరాటాలు భూమి, వర్గ కేంద్రీకృత చర్చలు ఒక బలమైన ప్రాతినిధ్య చర్చను జీర్ణం చేసుకోలేకపోయింది. తద్వారా దేశవ్యాప్తంగా దళితుల మీద జరిగిన అనేక అత్యాచారాల గురించి చర్చ సాహిత్య రంగంలో ఒక చీలిక తీసుకొని వచ్చింది. 'చిక్కనవుతున్న పాట', 'పదునెక్కిన పాట' లాంటి అనేక దళిత సంఘీభావ కవిత్వ సంకలనాలు

వెలుగులోకి వచ్చాయి. విశాలాంధ్ర ప్రచురణల ద్వారా 'దళిత కథ' పేరుతో వచ్చిన సంకలనాలు, మరియు 'కథా వార్షిక', 'ప్రాతినిధ్య' పేరతో మరికొన్ని కథా సంకలనాలు తమవయిన ముద్రను వేసాయి.

కథ ఒక బలమైన సాహిత్య మాధ్యమం. వర్తమాన స్వాభిమాన అస్తిత్వ ఉద్యమాల నేపథ్యం సాహిత్యంలో అన్ని విభాగాల మీద పడినట్టే కథ మీద కూడా పనిచేసింది. శిల్పం, ఇతివృత్తం తదితర అంశాల మేలవింపుతో కథ మరింతగా పదునెక్కింది. కేవలం ఒక ప్రాంతానికి, భాషకి మాత్రమే పరిమితం కాకుండా వివిధ భాషలో వచ్చిన మేలిమి కథలను అనువాదం ద్వారా కథ సాహిత్య లోకంలో మకుటాయ మానంగా ఎదిగింది. దిద్దుబాటు కథను మొదటి ఆధునిక కథానికగా భావించినప్పటికి దాని కొనసాగింపుగా జాతీయ ఉద్యమ నేపథ్యం మొదలు అభ్యుదయ, ఆధునిక, అత్యాధునిక, విప్లవ, దళిత, బహుజన, మైనారిటీ, స్త్రీవాద, 'ప్రాంతీయ అస్తిత్వం ' లాంటి అనేక అస్థిత్వాలతో మమేకం అయిన కథ ఒక రకంగా గడిచిన వందేళ్ళ తెలుగు సమాజ వైయుక్తికమైన

భావ వ్యక్తీకరణకు అద్దంపట్టింది. గడిచిన నూటా ఇరవై ఏళ్ళలో సమాజం అనుభవించిన అన్ని కల్లోలాలను 'కథ' చిత్రిక పట్టింది.

దాని మొదలు ప్రేమకథలు, విరహకథలు, మైనారిటీ కథలు, ప్రాంతీయ అస్తిత్వ కథల కొనసాగింపుగా ఇటీవల మహ్మద్ ఖదీర్ బాబు 'ఉత్తమ తెలుగు వాన కథలు' పేరుతో వచ్చిన కథలు ఒక వినూత్నమైన ప్రయత్నం. ఈ సంకలనం పాలగుమ్మి పద్మరాజుతో మొదలై మహమ్మద్ ఖదీర్ బాబు దాకా కొనసాగింది. కథ చుట్టూ మరుగున పడిన చరిత్రను సామాజిక ఉద్యమాలు మరింత పదునెక్కేలా చేసాయి. ఈ విధంగా వివిధరాజకీయ అస్తిత్వాల మేలవింపుతో సామాజిక ఉద్యమాల నాడిని ఒక సిస్మోగ్రాఫ్ లా నమోదు చేసింది కథ. ఇది ఒక రకంగా తెలుగు నాట స్వాభిమాన ఉద్యమాల ఘర్షణ విజయం .

# చీకట్లో చిరుదివ్వెలు - దేవకీదేవి కథలు



కొల్లాపురం విమల
ముక్త: తెలంగాణ మహిళల అధ్యయనవేదిక

"A story can tell us truths that a newspaper can't." – Salman Rashdi

'కరోనా కాలం ముగిసింది. ఇక హాయిగా ఊపిరి తీసుకోవచ్చు' అనుకుంటూ ఒకింత ఊరట పొందుతున్న కాలమిది. ఐనా ఒకవైపు డబ్ల్యు.హెచ్.ఓ. 'ఫోర్త్వేవ్' హెచ్చరికలు ఉండనే ఉన్నై. ఇలాంటి సందర్భాన్నే ఎన్నో ఏళ్ళ కిందట 'కింగ్ లియర్' అనే నాటకంలో షేక్స్పియర్ 'ప్లేగులు ఇంకా గాల్లో వేలాడుతున్నై' అంటాడు. నిజానికి ప్రపంచం ఎన్నో 'గత్తర్ల'కాలం దాటింది. ఐనా ఇప్పటికీ పితృస్వామ్యం తన ధోరణులను మార్చుకున్న దాఖలాలు కనిపించవు. ప్రతిసారీ గత్తర్ల గురించీ, యుద్ధాల గురించీ వినగానే విస్తుపోవడం, ఆపై సామాన్యులైతే కుంగిపోవడం, కలిగినవాళ్ళైతే వేదాంతాన్ని వల్లించడం కన్పిస్తుంది. అధికారం కోసం 'పితృస్వామ్యధోరణులు'సృష్టించే విలయాలకు గత్తర్లూ–యుద్ధాలూ నిదర్శనాలు.

ఇలాంటి విపత్తుల కాలంలో ప్రాణం నిలబెట్టే వైద్యుల కంటే ఎక్కువ బాధ్యతను తమ భుజాలకెత్తుకునేవాళ్ళు కవులూ, రచయితలూ, కళాకారులు. రేపటి గురించిన భరోసా నందిస్తూనే గతాన్ని ఎక్స్రే తీసి వర్తమానానికి శస్త్రచికిత్స చేసేవాళ్ళు సృజనకారులే. ఒక్కసారి చూపు సారించి చూస్తే ఆధునిక ప్రపంచంలో కరోనా వంటి సందర్భాల్లో ఎందరో రచయితలు తమదైన రీతిలో తమ చుట్టున్నవారిని జాగృతం చేయడం చూడొచ్చు. అంతర్జాతీయంగానైతే హోమరు, షేక్స్పియర్ మొదలుకొని అల్బర్ట్కామూ, డేనియల్ డెఫో, థామస్మన్, గేబ్రియల్ గార్సియా మార్క్వెజ్, జోసే సరమాగో వరకు తమ కాలంలో ఎదురైన ప్లేగు విపత్తుల గురించి తమతమ రచనల్లో రికార్డు చేశారు. మానవజాతి ఉనికే ప్రమాదంలో పడిన అలాంటి చీకటిరోజుల్లో గాఢమైన ఉద్వేగాలతో స్పందించిన ఆ రచనలు ఈనాటికీ ప్రాసంగికతను కోల్పోని గొప్ప రచనలుగా ప్రపంచఖ్యాతి గడించినై. ఇక భారతీయ రచయితల్లో రవీంద్రనాథ్ ఠాగూర్, ప్రేమ్చంద్, తజిక శివశంకరపిళ్ళై, నిరాలా, యు.ఆర్. అనంతమూర్తి మొదలైనవాళ్ళు గత్తర్ల కాలాన్ని కవిత్వంగా, కథలుగా మలిచి అందించారు.

యు.ఆర్. అనంతమూర్తి 'సంస్కార' అనే కన్నడ నవలిక దక్షిణభారతదేశంలో ప్లేగు చుట్టుముట్టిన కాలంలో ఓ బ్రాహ్మణ అగ్రహారంలోని నైతికసంఘర్షణలను కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది. ఈ కథ సమాజంలో పాతుకుపోయిన ఛాందస భావజాల వైరస్కి ప్రతీకగా ప్లేగుని చూపుతూనే ఆనాడు ప్రబలిన ఆరోగ్యవిపత్తును మన దృష్టికి తెస్తుంది. చనిపోయిన ఒక వ్యక్తి 'దహనసంస్కారం' వాదోపవాదాలతో మొదలై వ్యక్తుల నైతిక సంస్కారాలను పరీక్షకు పెడుతుంది. ప్రపంచసాహిత్యంలోనే ఒక క్లాసిక్గా గుర్తింపు తెచ్చుకున్న ఈ నవలికను తెలుగు కవి పట్టాభి 'విప్లవకారిణి స్నేహలతా' పూనుకొని సినిమాగా తెరకెక్కించడం యాదృచ్ఛికం కాదు. 'రాజ్య దండన'కు గురైన స్నేహలతకు తెలుసు రాజకీయార్థిక నియంతృత్వధోరణులే జీవిత విధ్వంసాలు సృష్టించే ప్లేగులని.

ప్రాచీన తెలుగుసాహిత్యంలో సైతం గత్తర్లకాలం గురించిన ప్రస్తావన లున్నాయని డా॥ త్రివేణిగారు ఈ మధ్య ప్రస్తావించడం చూడొచ్చు. ఐతే పైన ప్రస్తావించుకున్న రచయితల్లో, కవుల్లో (ఒక్క సావిత్రీబాయిని మినహాయిస్తే) ఒక్క స్త్రీ అయినా కన్పించకపోవడానికి కారణమేంటి? అని

ప్రశ్నించుకుంటే ప్రస్తుత అనుభవంలోంచి నా మటుకు నాకు వెంటనే తోచే సమాధానం స్త్రీలకుండే 'చూసుకునే'బాధ్యతలు పురుషరచయితలకు ఉండవు కాబట్టి అనే. పిల్లల్నీ, వృద్ధుల్నీ, జబ్బుపడ్డ కుటుంబసభ్యుల్నీ సంరక్షించే గుర్తింపులేని బాధ్యతలు ఈనాటికీ ప్రపంచవ్యాప్తంగా స్త్రీలపైనే అధికం. ఫలితంగా మొద్దుబారుతున్న స్త్రీల మేధోసంపత్తి గురించిగానీ, కోల్పోతున్న స్వతంత్ర వ్యక్తిత్వాల గురించిగానీ బహిరంగ చర్చలు ఇప్పటికీ అప్రకటిత నిషేధంలోనే కొనసాగుతున్నై. పైగా వైరస్ బారిన స్త్రీల కంటే పురుషులే అధికంగా పడుతున్నారనే ఊదరగొట్టే ప్రకటనలు నిన్నటికి నిన్న మనం కూడా చూసినం. కానీ గర్భిణీస్త్రీలు, పాలిచ్చే తల్లులపై కరోనా ప్రభావాలు ఎలాంటివి? ఇంటిల్లిపాదినీ చూసుకునే పనిలో ఎంతమంది స్త్రీలు తమ ఆర్థిక ఆలంబనను పోగొట్టుకున్నారు? ఇంకెంతమంది ఎముకలు అరిగి మూలకు పడ్డారు? అసలు 'కరోనా'కల్లోలాన్ని జెండర్ దృక్పథంలో ఎంతవరకు విశ్లేషించారు? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకదు.

కార్పొరేట్ బళ్ళూ, ఆఫీసులు వంటి బడా సంస్థలన్నీ తామందించాల్సిన నిర్వహణా సేవలను స్త్రీల భుజాలపైకి బదిలీ చేసి చేతులు దులుపుకున్నాయి. పైగా ఇప్పుడు సగం కంపెనీలు నిర్వహణాభారం తగ్గుతుందని ఇదే అదనుగా అదే పరిస్థితిని కొనసాగిస్తామని ప్రకటించేసాయి. స్త్రీలు కుటుంబ 'లాక్డౌన్'లో మరింత నిర్బంధంలోకి వెళ్ళే రోజులున్నాయనడానికి ఇది సూచన.

సరిగ్గా ఇట్లాంటి గత్తరకాలమే దేవకీదేవిగారిని చేయి తిరిగిన కథయిత్రిగా మలిచిందని చెప్పడానికే ఇంత ఉపోద్ఘాతం ఇవ్వాల్సి వచ్చింది. ఎందుకంటే ఈ సంపుటిలోని ఎక్కువ కథలు కరోనా కాలంలోనే ప్రాణం పోసుకున్నాయి కాబట్టి. అంతేకాదు స్త్రీలు ప్రేమలేమితో ఇంటిపనిలో ఎట్లా నిర్బంధజీవితాలను వెళ్ళదీస్తున్నారో కళ్ళకు కట్టినట్లు చూపించే కథలుగా ఇవి ఇప్పుడు అందరూ అత్యవసరంగా ఆలోచించాల్సిన విషయాలను మన దృష్టికి తెస్తే, 'పిడికిటి ఇసుక' దేవకీదేవి వెలువరిస్తున్న తొలి కథాసంపుటి. అంతకుమునుపు ఆమె విలువైన పరిశోధక గ్రంథాలు వెలువరించిన విషయం తెలిసిందే. ఎన్నో వ్యాసాలూ, కవితలు సైతం వెలువరించారు. కాని 'కథయిత్రి'గా (సి. నారాయణరెడ్డిగారు తన మరణానికి ముందు తెలంగాణా కవయిత్రుల, రచయిత్రుల సదస్సులో నాకు సూచించిన మాట) ఆమె ఈ సంపుటి ద్వారానే మనకు పరిచయం అవుతున్నారు.

ఇందులో దాదాపు ఐదారుకు మించిన కథలు మనందరం ఎదుర్కొన్న / ఎదుర్కొంటోన్న కరోనా కాలాన్ని స్త్రీల దృక్పథంలోంచి రికార్డు చేసినవే. ముందే ప్రస్తావించినట్లు గత్తర్లు కావొచ్చు, యుద్ధాలు గావొచ్చు ఏ సంక్షోభంలోనైనా అందరి కంటే ఎక్కువ నష్టపోయేది స్త్రీలూ పిల్లలేనన్న విషయం చరిత్ర మాత్రమే కాదు, వర్తమానం కూడా చెబుతున్నది. ఏ సంక్షోభమైనా జండర్ న్యూట్రల్, క్లాస్ న్యూట్రల్ కాదని కోవిడ్ సందర్భమూ నిర్ధారించింది. మొత్తానికి మనందరం ప్రత్యక్ష సాక్షులుగా, బాధితులుగా చూసిన కోవిడ్ అనుభవం వందల ఏళ్ళనుంచీ ఏ మాత్రం మారని స్త్రీల దుస్థితిని నిరూపించింది. ఆ మాటకొస్తే సమాజంలోని కుల, మత, వర్గ, లింగ అసమానతలన్నిటినీ గత్తర్లకాలం స్పష్టంగా బహిర్గతం చేసింది.

ఈ విషయాలనన్నిటినీ దేవకీదేవి కథలు మన ముందుంచుతై. ఆలోచించమని సున్నితంగానే అయినా సూటిగానే చెబుతై. నిజానికి దేవకీదేవి వ్యక్తిత్వం కూడా అదే. తన భావాలను / అభిప్రాయాలను సూటిగా చెప్పడం, అన్యాయాలను ప్రశ్నించడం ఆమె స్వభావం. సరళత్వం, నిక్కచ్చి నిర్ణయాలు తీసుకునే ధీరత్వం ఆమె రచనల్లోనూ, జీవితంలోనూ కన్పిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే నాకంటే ముందుతరంలో పుట్టినా నా తర్వాతి తరపు చైతన్యాన్ని అందిపుచ్చుకున్న చైతన్యశీలి దేవకీదేవి. నాతో సహా నా తరంలో నాకు తెలిసిన తెలంగాణా రచయిత్రుల్లో చాలామంది తమ తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్ళిళ్ళు చేసుకున్నవారే. కానీ అందుకు భిన్నంగా దేవకి ఆ తరంలోనే తన సహచరుణ్ణి తానే ఎంచుకొని ఏ ఆడంబరాలూ లేకుండా పెళ్ళిచేసుకోవడమే గాకుండా హక్కుల ఉద్యమాల్లో జంటగా సమాజ శ్రేయస్సు కోసం శ్రమించడమే ఆమె చైతన్యానికి దాఖలా. సావిత్రీబాయి వంటి సంస్కర్తలు చర్చకు తెచ్చిన ఏ ఆడంబరాలూ లేని జీవితాన్ని నమ్మి ఆచరించిన ప్రగతిశీలవాది దేవకీదేవి. POW వ్యవస్థాపక సభ్యురాలు కూడా.

అంతకుమించి తెలంగాణా ఉద్యమస్ఫూర్తిని

చిన్నవయసులోనే అందుకొని పెద్దపనులను తలకెత్తుకున్న ఉద్యమకారిణి. అదే ఆమె ఉద్యమకార్యాచరణలకు నాంది అయింది. అందుకే మూఢవిశ్వాసాలకు లోనైన వెనుకబడిన మనస్తత్వాలను ఆసరాగా తీసుకొని అంతర్గత వలసవాదం తెలంగాణాను ఎట్లా తన వలస కేంద్రంగా మలుచుకున్నదో వివరించే 'మనేలుతో మన కన్నే పొడిచిండు'అన్న ఈ సంపుటిలోని కథ దేవకి రాసిన మొదటి కథ (2011) ఐంది.

'Hope is the alchemy that turns the life/ world around' అన్నట్లు కొత్తభవిష్యత్తు / తెలంగాణకై ఆమె ఆరాటం చుట్టున్నవారికి స్ఫూర్తిగా నిలిచింది. 1969ల నాటి ఉద్యమకాలంలో ఓ పోలీసు అధికారి గల్లాపట్టి కలెబడిన 'సివంగి'లా గర్జించిన యోధురాలిగా ఆమె ఎందరికో ఉద్యమపాఠాలు నేర్పింది. ఆ తరపు వరంగల్వాసులు ఆమెను 'వీరనారి'గా పిలుచుకునేవారనీ, ఆమె ఉపన్యాసాలు వినడానికి యువత ఉవ్విళ్ళూరేవారనీ ఎన్. వేణుగోపాల్గారి మాటల్లో తెలుస్తుంది. నాకు మటుకు మలిదశ తెలంగాణా ఉద్యమమే ఆమెను పరిచయం చేసింది. తొలిరోజే 'మంగళసూత్రాలకు' మారుగా యూనివర్సిటీలో తాను సాధించిన 'గోల్డ్మెడల్'ని తన అస్థిత్వ ప్రకటనగా ధరిస్తున్నదని తెలిసిన క్షణంలోనే మా స్నేహం మొదలైంది. ఇక మలిదశ ఉద్యమకాలంలో 'జంటకవుల'వలె కలిసి పనిచేసినం. చెట్టాపట్టాలేసుకొని ముండ్లకంచెలు దూకినం, జైళ్ళకి వెళ్ళినం. ఒకనొక సందర్భంలో లగడపాటిని చెప్పుదెబ్బలతో సత్కరించాలనుకొని మారు వేషాలతో మాటువేసినట్టు కూడా గుర్తు. ఆలోచనలకూ, ఆచరణకూ మధ్య సమన్వయం సాధించిన అచ్చమైన ఉద్యమకారిణి దేవకీదేవి అని చెప్పడానికే ఈ విషయాలు ప్రస్తావించాల్సి వచ్చింది. మొత్తానికి ఈ నేపథ్యమే ఆమెను రచనా వ్యాసంగంలోనూ పరిణతి సాధించేట్టు చేసింది. అందుకు ఈ సంపుటిలోని కథలే నిదర్శనం.

తన అనుభవంలోకి వచ్చిన విషయాలను, సంఘటనలను మాత్రమే గీటురాయిగా తీసుకొని స్పందించడం ఈ కథలన్నిట్లోను కన్పిస్తుంది. అదే ఈ కథల ప్రత్యేకత. ఆ మాటకొస్తే ఏ రచనకైనా రచయిత అనుభవాలే ఇరుసు కదా అనొచ్చు. ఐతే ఊహాకల్పనలు (ఇమాజినేషన్స్) జోడిరచి సంక్లిష్టమైన వాస్తవికతను కథరూపంలో మలిచి చూపడం కూడా కద్దు. కానీ దేవకీదేవి తన అనుభవానికి రాని వాస్తవికతకు తన కథల్లో చోటివ్వదు. అట్లా అని ఆత్మకథాత్మక కథలు అనొచ్చు. పాత్రలన్నీ నిజజీవితంలో ఆమెకు తెలిసిన, ఆమెతో మసిలినవాళ్ళుగా కన్పిస్తారు. తాను అనుభవించిన వాస్తవికతను ఉన్నదున్నట్లుగా చెప్పే కథనశిల్పం దేవకీదేవి ఎంచుకున్నారు. అదే ఈ కథలకి నిజాయితీతో కూడిన స్వరాన్ని ఇవ్వడం చూడొచ్చు. అంటే ఊహాశబలత కంటే కూడా ఏ డాంబికాలకు పోని అణకువ ఈ కథలకు సహజత్వాన్నీ, సరళస్వభావాన్నీ చేకూర్చింది.

అట్లే వాస్తవికతను చెప్పేవే అయినా పరిష్కారాలవైపు, ప్రశ్నలవైపు పాఠకులను నడిపించడం కూడా ఈ కథల ప్రత్యేకత. మచ్చుకి 'బాధ్యులెవరు?', 'పిడికెటి ఇసుక' వంటి కథలు చూడండి. మన చుట్టూ మనం చూస్తున్న జీవితమే ` ఒంటరితనం, పరాధీనత, మాయమైతున్న ఆత్మీయతలు అన్నీ తోడై ఒక ఒంటరి స్త్రీ జీవితానికి ముగింపు రచించినై. ఇందుకు 'బాధ్యులెవరు?' అన్న ప్రశ్నతో కథ ముగుస్తుంది. ఇక ఆ ప్రశ్న యే ఒక్క ఒంటరితల్లి దుఃఖమో కాదు, సమాజానిది అన్న నిర్ధారణకు రావడానికి పాఠకులకు ఎక్కువ సమయమేం పట్టదు. సరిగ్గా ఇలాంటి సందర్భాన్నే ప్లేగు పెచ్చరిల్లిన కాలంలో అల్బర్ట్ కాము 'Empathy is a pre-reqyisite for a healthy society and empathy demands community' అంటాడు. భిన్న స్థలకాలాల్లో ఉన్నప్పటికీ రచయితల మనోనేత్రానికి కన్పించిన సూక్ష్మవిషయాలు ఎంత అపురూపమైన నిర్ధారణలో చెప్పడానికి ఇది ఓ చిన్న ఉదాహరణ అనొచ్చు.

ఈ కథలకున్న మరో ప్రత్యేకత మధ్యతరగతి స్త్రీల కోణంలోంచి వాస్తవికతను అంచనా కట్టడం, స్త్రీల దృక్పథాలను స్పష్టంగా చేరవేయడం. 'ఫెమినిస్టు కథలు' అన్న టాగ్లైన్ లేకుండా ఈ సంకలనంలోని కొన్ని కథలు పాఠకులను ఫెమినిస్టు దృక్పథం వైపు నడిపిస్తై అనే నా భావన. మచ్చుకి 'బహుముఖాల కరోనా', 'పొరలు', 'మోడల్ ఆంటీ', 'శృతి మించితే' వంటి కథలు చదవండి. నిజానికి సమాజంలో నాటుకుపోయిన ఎన్నో రకాల వివక్షలను బట్టబయలు చేసేందుకు కరోనా

'లిట్మస్ టెస్ట్'లాగా పనిచేసింది. వివక్షలకు లోనైన ఆయా సమూహాలపైన 'హింసా' పద్ధతులు ఎట్లా సందర్భాన్ని బట్టి కొత్త ముసుగులో కొనసాగుతాయో ఈ కథలు మన దృష్టికి తెస్తై. ఉదాహరణకి శీర్షిక సూచించినట్లుగనే 'బహుముఖాల కరోనా' అనే కథ కరోనా సమయంలో స్పష్టంగా బైటపడిన జెండర్, వర్గ అసమానతలను చూపిస్తుంది. స్త్రీలందరూ వివక్షల్లో మగ్గడాన్నీ, ఇంటిపనుల్లో కట్టుబానిసలుగా బైటిపనుల్లో షాడో వర్కర్స్గా మిగిలిపోవడాన్ని చూపిస్తూనే ఆర్థిక అసమానతలు స్త్రీలపై మోపే అదనపు హింసను చందన`చంద్రమ్మల విషాదాంత గాథ ద్వారా వివరిస్తుంది.

కథలో కథగా వాస్తవాలను వివరించే కథనశిల్పం దేవకీదేవి కథల్లో సాధారణంగా కన్పించే లక్షణం. వర్తమానంలోంచి గతంలోకి, గతంనుంచి వర్తమానానికి పాఠకులను నడిపించే పాత్రోచిత సంభాషణల వలన అమ్మలు చెప్పే కథనపద్ధతిని గుర్తుచేస్తై. శిల్పపరంగా ఇది దేవకీదేవికే సొంతమైన ఒరవడి అనిపిస్తుంది. మొత్తానికి కోవిడ్`19 కాలంలో స్త్రీల ఇక్కట్లను ప్రతిఫలించే కథలే ఈ సంకలనంలో ఎక్కువ ఉన్నట్టు కన్పిస్తై. నిజానికి 90ల నుంచి సరళీకృత ఆర్థికవిధానాల పేరున మన ప్రాంతాల్లోకి, జీవితాల్లోకి చొచ్చుకువచ్చిన గ్లోబల్ ఆర్థిక నమూనాలోనే ఇప్పటి మన ఆర్థిక, ఆరోగ్యవిపత్తుల మూలాలున్నై గనుక కోవిడ్–19 కాదు, కోవిడ్–90 అని పేర్కొనడం సముచితమని నా సొంత అభిప్రాయం.

ఇదిట్లుంచితే కరోనా సంక్షోభంవల్ల స్త్రీల పరిస్థితి 99 నుంచి 136 సంవత్సరాలు వెనక్కి నెట్టబడిందని ఈ మధ్య వచ్చిన ఒక పరిశోధన చెబుతోంది. అంటే కరోనా కాలం స్త్రీల జీవితాలపై ఎంత తీవ్రప్రభావం చూపిందో అర్థమౌతుంది. ప్రభుత్వం చేసిన అకస్మాత్ 'లాక్డౌన్'ప్రకటన ఉద్యోగభద్రత లేని అన్ఆర్గనైజ్డ్ సెక్టార్లో పనిచేస్తున్న స్త్రీ పురుషులందర్నీ రోడ్డున పడేసింది. లక్షలాదిమంది వలసకార్మికులు తమ ఊళ్ళకి చేసిన 'లాంగ్మార్చ్'కి మనమంతా ప్రత్యక్షసాక్షులం. ఈ క్రమంలో 510 మిలియన్లమంది స్త్రీలు ఉపాధులు కోల్పోయారని ఒక అంచనా. ఐనా స్త్రీల సంరక్షణ మూలంగానే చాలా కుటుంబాల మనుగడ సాధ్యమైందని రిపోర్టులు చెబుతున్నై. ఒకవైపు ఉపాధి పోయి డొమెస్టిక్ వర్క్ చేసే పనిమనుషుల కుటుంబాలు అల్లల్లాడుతుంటే, మరోవైపు ఇంటిపని సవరించే భారమంతా మీదపడిన మధ్యతరగతి స్త్రీలు ఊపిరి పీల్చే సమయం కూడా లేక కుటుంబ లాక్డౌన్లో వెంటిలేటర్ బతుకులీడ్వడం మొదలైంది. ఉపాధి లేమి మధ్యతరగతికి సైతం విస్తరించింది. ప్రైవేటు బళ్ళూ, ఆఫీసుల్లో పనిచేసే టీచర్లూ, జర్నలిస్టులూ వంటి ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు సైతం ఉద్యోగాలు కోల్పోయారు. ఉపాధిలేమి, పెరిగిన ధరలూ తోడై స్త్రీలపై పితృస్వామిక దౌష్ట్యాలకు బలం పెంచింది. లిక్కర్ షాపులు తెరవడం, భార్యలను కొట్టడానికి సామాజిక ఆమోదం ఇంకా కొనసాగుతుండడంతో స్త్రీలపై గృహహింస తారస్థాయికి చేరిందని ఉమెన్స్ కమీషన్ నిర్ధారించింది. 'స్టే హోమ్, స్టే సేఫ్' అన్న నినాదం స్త్రీల విషయంలో పనిచేయదనీ, ఇల్లే ఒక 'బ్లాక్ హోల్'లాగా తయారయిన పరిస్థితులను వేలాదిమంది స్త్రీలు చవిచూసారనీ కమిటీ నిర్ధారించింది.

ఒక తరానికి తరమే బాలికలు విద్యకు దూరమైంద్రు. బాల్యవివాహాల్లో చిక్కుకున్నరు. ఇక హ్యూమన్ ట్రాఫికింగ్, అత్యాచారాలు సరేసరి, 41 శాతానికి పెరిగినై. ఇంతటి స్త్రీల జీవితవిధ్వంసాలను లెక్కల్లో కాకుండా మనసుభాషతో చాలా సరళంగా మనకు చేరవేసిన కథలు ఈ సంకలనంలో కన్పిస్తై. 'స్త్రీలను పనిముట్టుగా తప్పితే చూడలేని సామాజికవ్యవస్థను కట్టడి చేయాలంటే చిన్న చిన్న సాహసాలతో, షాక్ ట్రీట్మెంట్ ఇవ్వాలనీ, అందుకు స్త్రీలకు చైతన్యం అవసరమనే భావనను చేరవేస్తై మరికొన్ని కథలు. అన్నిటికీ మించి స్త్రీ పురుషుల మధ్య సంబంధాల్లో ఆత్మీయతలకూ, హక్కులకూ మధ్య గుర్తించాల్సిన సున్నితమైన రేఖను చెబ్తూనే స్త్రీలకూ, స్త్రీలకూ మధ్య ఉన్న 'సిస్టర్హుడ్'ని గుర్తుచేస్తై. మొత్తంగా 'లవ్లెస్ సొసైటీ ఈజ్ ఎ డెడ్ సొసైటీ' అన్న కామూ మాటలను ప్రతిధ్వనిస్తై.

ఇక కరోనా సమయంలో ముస్లిం జీవితాలపై పెరిగిన నిఘా, పుకార్లు, అపనమ్మకం, హింస గురించిన ఎరుకను అందించే కథ 'పొరలు'. ప్రాణాలను హరించేది కేవలం కోవిడ్ వైరస్ మాత్రమే కాదు, విద్వేష భావజాలం కూడా అని చెప్పే కథ ఇది. మౌఢ్యపు 'పొరలు' కమ్మిన మనువాద పితృస్వామ్యం 'సామాజిక సంబంధాలను, కార్యకలాపాలను కట్టడీ చేసే

అధికారాన్ని యధేచ్ఛగా వాడింది కానీ సామాన్యుల ఉసురు తీసే వ్యాపారదుర్మార్గాలకు అడ్డుకట్ట వేయలేకపోయింది' అంటూ చెప్పే ఈ కథ మర్కజ్–తబ్లీగ్–జమాతే అంటూ సమూహాల మధ్య విద్వేషపు వైరస్ను స్ప్రెడ్ చేసేందుకు జరిపిన ప్రయత్నాలను పాఠకులకి గుర్తుచేస్తుంది.

ఇలాంటిదే 'ఎవుసం' అన్న కథ. కరోనా వంటి కల్లోల కాలాల్లో ప్రభుత్వాల నియంతృత్వ ధోరణి ఎలా పెచ్చరిల్లుతుందో ప్రపంచవ్యాప్తంగానే గాకుండా దేశవ్యాప్తంగా జరిగిన సంఘటనలు చెబుతున్నై. అట్లా కోవిడ్ కాలంలోనే రైతు వ్యతిరేక 'నల్లచట్టాల' అమలుకు ప్రభుత్వం పూనుకున్న సందర్భాన్నీ, ఆ చట్టాలలోని లొసుగుల్నీ అందరికీ అర్థమయ్యేట్టు చెప్పిన కథ 'ఎవుసం'. ఒక పేదతల్లి ప్లాస్టిక్ కవర్ల పెట్టుకొచ్చిన గుడ్డు తీసి పొట్టు వొలిసి కొడుకు ముందు పెట్టి తినిపించడం అన్న వర్ణన ఒక ఛాయాచిత్రం వలె తల్లిప్రేమలోని ఆర్తిని పాఠకులకి చూపిస్తుంది.

ఇక అధ్యాపకురాలిగా రచయిత్రి తన అనుభవాలను చిన్న చిన్న సంఘటనల కేంద్రంగా చెప్పడమే గాకుండా పోటీయుగంలో మానవత్వం మిస్సయిన చదువులు తరానికి తరాన్నే 'విముఖతా ధోరణుల్లోకి' ఎట్లా నెట్టేస్తున్నాయో చెప్పే 'కెరీర్' కథా; లక్ష్యం కన్నా ఆరాటాలు, ఆర్భాటాలే అధికమైన సామాజిక పోకడలనూ, పెళ్ళీ–పేరంటాల పేరుతో చేసే హంగామాలనూ వివరించే 'అతిథిదేవోభవ'; రక్షకభటులే భక్షకభటులై ముద్దాయిలను నేరస్తులుగా ప్రకటించడంలోనే మానవహక్కుల అతిక్రమణను చెప్పే 'నేరము`శిక్ష'; బ్రాహ్మణీయ పితృస్వామ్యం వితంతుస్త్రీపై మోపిన హింసను సవాలు చేసే 'గోడదెబ్బ–చెంపదెబ్బ' వంటి కథల్లోని గాఢత పాఠకులను ఆలోచించేట్టు చేస్తై అనడంలో సందేహం లేదు.

ఇక పౌరవిధులనూ, వెల్ఫేర్ భావనలనూ సూచించే కొన్ని కథలు కొంత బలహీనంగా ఉన్నప్పటికీ మిగిలిన కథల్లోని వాస్తవికతా, గాఢతా ఆ లోటును పూరిస్తాయనే నా భావన. ''మీరు పెట్టే చీర, సారెల్లో నా మొగుడు చచ్చాడన్న వార్తను తీసుకురాకండి''అంటూ బ్రాహ్మణీయ పితృస్వామిక మూలభావనలను దిమ్మతిరిగేట్టు సవాలు చేసిన ఫస్ట్ పర్సన్ నేరేషన్స్ చదువరులను తప్పకుండా ఆలోచించేట్టు చేస్తై.

మొత్తంమీద ఆగకుండా చదివించే కథనశిల్పం, పాత్రోచిన భాషా ఈ రచనకు మంచి చేర్పులు. నా మటుకు నాకు 'జత్నంగా', 'తొర్లించు' వంటి మరికొన్ని కొత్త తెలంగాణా పదాలు పరిచయమైనై. అట్లే 'ఉడికేదాక ఉన్న ఓపిక, ఉమ్మగిలేదాక ఉండాలి' వంటి సామెతలు కూడా తెలిసినై. మొత్తంమీద 'అడగంది అమ్మైనా అన్నం పెట్టదు. మన వ్యవస్థ ఒక మూసలో నడుస్తోంది. కానీ మనం / స్త్రీలం ఆ మూసలోనే బతకడం లేదు. ఇంటికే పరిమితం గాకుండా మనమూ ఉద్యోగాలు చేస్తున్నం, పిల్లల చదువులనూ చూసుకుంటున్నం. యజమానులుగా మగ మహారాజుల మూక ఆర్థిక ఆలంబనను పొందుతున్నది కదా! అలాంటప్పుడు ఇంటిశ్రమలో వాళ్ళకి బాధ్యత లేదా?'' అంటూ నిద్ర నటిస్తున్న మగ'మహారాజు' లను ఛళ్ళున ప్రశ్నిస్తున్న కథలివి. 'భూమ్మీద గత్తర్లూ ఉన్నాయి, బాధితులూ ఉన్నారు.' చదవండి ` మీరే నిర్ణయించుకోండి మీరు ఎటువైపో!

చివరగా కోవిడ్ స్త్రీల జీవితాలపై సృష్టించిన విలయాన్ని జెండర్ కోణం లోంచి విశ్లేషించి భవిష్యత్తును సరిదిద్దాల్సి ఉంది. అందుకు ఇలాంటి సాహిత్యం దారులు వేస్తుంది. చీకట్లో చిరుదీపాన్ని వెలిగించడం వంటిదీ కృషి. ఈ క్రమంలో స్త్రీల అనుభవాలను 'జ్వలిత ప్రచురణలు', 'అక్షరాయాన్', 'రుద్రమ ప్రచురణలు' రికార్డు చేయడం ఎంతైనా అభినందనీయం. ఈ కల్లోల కాలంలో సైతం ఉమన్ వారియర్గానే గాకుండా కోవిడ్ వారియర్గా కూడా తన ఈ కృషిని అజేయంగా కొనసాగిస్తున్నందుకు దేవకీదేవిగారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్న.

మరొక్క మాట – వాస్తవాలను తొట్రుపడకుండా చెప్పే నిబద్ధతా, పరిమితు లను సైతం పంచుకునే నిజాయితీ ఉన్న దేవకిగారు తన 'ఆత్మకథ' రాస్తే ఎందరికో స్ఫూర్తినిచ్చినవారైతారని నా భావన. కొన్నేళ్ళనుంచే ఈ విషయమై ఆమెను అడుగుతూనే ఉన్న. ఇప్పటికైనా ఆమె ఈ పనికి పూనుకుంటారనీ, తొందర్లో ఆమె ఆత్మకథ మన ముందుకి వస్తుందనీ ఆశిస్తూ... నాకీ అవకాశం ఇచ్చిన దేవకీదేవిగారికి ధన్యవాదాలతో...

క్రీడావ్యాసం

# నిఖత్ జరీన్:
# (భారతీయ మహిళా బాక్సర్)



**డా. త్రివేణి**



2022 మే 19న ఇస్తాంబుల్‌లో జరిగిన ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ (2022 Women's World Championship)లో నిఖత్ జరీన్ స్వర్ణపతకం గెలిచింది. 52 కిలోల విభాగంలో ఫైనల్‌లో జుటామస్ జిట్‌పాంగ్ (థాయ్‌లాండ్)పై 5-0 తేడాతో అద్భుత విజయం సాధించింది. 73 దేశాల నుంచి దాదాపు 310 మంది మహిళా బాక్సర్ పాల్గొన్న ఈ పోటీల్లో భారత తరపున నిఖత్ జరీన్ సత్తా చాటింది. టర్కీ గడ్డపై మువ్వన్నెల జెండా రెపరపలాడించింది. ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తొలి తెలుగు అమ్మాయిగా రికార్డు నమోదు చేసింది. బాక్సింగ్ లో పతకం గెలుచుకున్న ఐదో భారత క్రీడాకారిణిగా నిఖత్ జరీన్ గుర్తింపు సాధించింది. మేరీకోమ్, సరితా దేవి, జెన్నీ ఆర్‌ఎల్, లేఖ కేసీ గతంలో పతకాలు గెలిచినవారిలో ఉన్నారు.

నిఖత్ జరీన్ 14 జూన్ 1996న తెలంగాణలోని నిజామాబాద్‌లో ఎండి జమీల్ అహ్మద్, పర్వీన్ సుల్తానా దంపతులకు జన్మించింది. ఆమె కేవలం 13 సంవత్సరాల వయసులో బాక్సింగ్ ప్రారంభించింది. ఆమె బాక్సింగ్ ప్రయాణానికి తండ్రి పూర్తి మద్దతు ఇచ్చాడు. జరీన్ తరచుగా బాక్సర్ మేరీ కోమ్ ను తన స్ఫూర్తి ప్రదాతగా భావించేది.

హైదరాబాద్‌లోని ఏవీ డిగ్రీ కాలేజీలో డిగ్రీ చదువుతున్న సమయంలో జలంధర్‌లో జరిగిన అఖిల భారత అంతర విశ్వవిద్యాలయ పోటీల్లో ఆమె బెస్ట్ బాక్సర్ ఛాంపియన్ షిప్ సాధించింది.



2009లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐవీ రావు ఆధ్వర్యంలో శిక్షణ పొందటానికి జరీన్‌ను విశాఖపట్నంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో చేర్చుకుంది.

ఒక సంవత్సరం తరువాత ఆమె 2010లో ఈ రోడ్‌లో జరిగిన నేషనల్స్‌లో ఆమెను 'గోల్డెన్ బెస్ట్ బాక్సర్' గా' ప్రకటించారు.

2010లో నేషనల్ సబ్ జూనియర్ మీట్‌లో జరీన్ తొలి బంగారు పతకాన్ని గెలుచుకుంది.

2011 టర్కీలో జరిగిన మహిళల జూనియర్, యూత్ వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో, ఫ్లై వెయిట్ విభాగంలో ఆమె తొలి అంతర్జాతీయ బంగారు పతకాన్ని సాధించచింది. జరీన్ టర్కిష్ బాక్సర్ ఉల్కు డెమిర్‌తో పోరాడి మూడు రౌండ్ల తరువాత 27:16 తేడాతో ఆమెపై గెలిచింది.

2011లో అంటాల్యాలో జరిగిన AIBA ఉమెన్స్ యూత్ & జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె బంగారు పతకాన్ని సాధించింది.

2013 ఉమెన్స్ జూనియర్ & యూత్ వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె రజత పతకం సాధించింది.

2014 లో సెర్బియాలోని నోవి సాడ్‌లో జరిగిన మూడవ నేషన్స్ కప్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో ఆమె బంగారు పతకం సాధించారు. జరీన్ 51 కిలోల విభాగంలో రష్యాకు చెందిన పాల్ట్సేవా ఎకాటెరినాను ఓడించింది.

2015లో అస్సాంలో జరిగిన 16వ సీనియర్ ఉమెన్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో జరీన్ బంగారు పతకం సాధించింది.

2019లో బ్యాంకాక్ లో జరిగిన థాయిలాండ్ ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్

టోర్నమెంట్‌లో రజతం సాధించడం ద్వారా మరో అంతర్జాతీయ పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది.

బల్గేరియాలోని సోఫియాలో జరిగిన 2019 స్ట్రాండ్జా మెమోరియల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో 51 కిలోల విభాగంలో ఫిలిపినో ఐరిష్ మాగ్నోను ఓడించి జరీన్ బంగారు పతకాన్ని సాధించింది.

2019 సంవత్సరం జూనియర్ నేషనల్స్‌లో జరీన్ స్వర్ణం సాధించి 'ఉత్తమ బాక్సర్‌గా' ఎంపికయ్యాంది.

టోక్యోలో జరిగిన ఒలంపిక్స్‌కు మేరీ కోమ్‌ను ఎంపిక చేసినప్పుడు, తనను ఎంపిక చేయకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ మేరీ కోమ్‌తో తనకు పోటీ పెట్టాలని డిమాండ్ చేస్తూ సంచలనం సృష్టించింది. అయితే మేరీతో జరిగిన బౌట్‌లో ఆమె ఓటమి పాలయ్యారు.

2020లో జరీన్‌కు ఎలక్ట్రిక్ స్కూటర్, పదివేల రూపాయల నగదు బహుమతిని, అవార్డును క్రీడా మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నుంచి అందుకుంది.

2022 ఫిబ్రవరిలో బల్గేరియాలోని సోఫియా వేదికగా జరిగిన 73 వ స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నమెంట్ లో 52 కేజీల విభాగంలో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. జూనియర్ స్థాయిలో ఆమెకు రెండో స్ట్రాంజా టోర్నమెంట్ పతకం కావడం గమనార్హం.

★ ★ ★

యువ బాక్సర్ జరీన్ విజయం సాధించడంపై మోడీ ట్వీట్ చేస్తూ... మన బాక్సర్లు మనల్ని గర్వించేట్లు చేశారు. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్ లో బంగారు పతాకం సాధించిన నిఖత్ జరీన్ కు అభినందనలు. కాంస్య పతకాలు సాధించిన మనీషా, పర్వీన్ హుడాకు కూడా అభినందనలు తెలిపారు.

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్ స్వర్ణం సాధించిన యువ బాక్సర్ నిఖత్ జరీన్ కు తెలంగాణ గవర్నర్ తమిలిసై సౌందర రాజన్ అభినందనలు తెలిపారు. నిఖత్ జరీన్ ను చూసి తెలంగాణ గర్విస్తోందన్నారు.

యువ బాక్సర్ జరీన్ కు ముఖ్యమంత్రి కె సి ఆర్ శుభాకాంక్షలు తెలిపారు. జరీన్ విశ్వ విజేతగా నిలవడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. యువ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకుప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

ప్రపంచ చాంపియన్ షిప్ లో స్వర్ణం సాధించిన నిఖత్ జరీన్ ను తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు అభినందించారు. పురుషాధిక్యం ఉన్న క్రీడలో ఎన్నో ఇబ్బందులను తట్టుకొని నిజామాబాద్ బిడ్డ నిఖత్ జరీన్ తనకంటూ గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఆమె ప్రయాణం అందరికీ స్ఫూర్తి దాయకమని కొనియాడారు. నిఖత్ విజయం పట్ల గర్విస్తున్నట్లు ట్వీట్ చేశారు.

జరీన్ గెలుపు తెలంగాణ, నిజామాబాద్ జిల్లాకు గర్వకారణమని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో జరీన్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జరీన్ కు లక్ష రూపాయల ప్రోత్సాహకం ప్రకటించారు. ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందేలా కరువ తీసుకుంటానని అన్నారు.

మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం ఎల్ ఆర్ ఐ టి) కాలేజీలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి ఎం ఎల్ ఆర్ ఐ టి ఛైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి నిఖత్ జరీన్ కు నాలుగు లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన నిఖత్ ప్రపంచ చాంపియన్ గా నిలవడం మామూలు విషయం కాదన్నారు. ఇప్పటికే ప్రకటించిన విధంగా పారిస్ ఒలింపిక్స్ వరకు నిఖత్ కు ప్రతి నెల 20 వేల రూపాయల నగదు అందిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ టైటిల్ దక్కించుకున్న నిఖత్ జరీన్ కు సుచిత్రా అకాడమీ 10 లక్షల నగదు ప్రోత్సాహాన్ని అందించింది. అకాడమీ ప్రతినిధులు ప్రవీణ్ రాజు, ప్రదీప్ రాజు జరీన్ కు చెక్కు అందించారు. ప్రపంచ చాంపియన్ గా గెలవడంలో కోచ్ ప్రదీప్ రాజు ఎంతో కృషి ఉందని ఆమె పేర్కొన్నారు.

నిఖత్ జరీన్ విజయం పట్ల తెలంగాణ రాష్ట్ర మంత్రులు హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్, బి జె పి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

★ ★ ★

నిఖత్ జరీన్‌కు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్‌లో భాగమైన వెల్స్‌పన్ గ్రూప్ పూర్తి సహాయ సహకారలను అందిస్తోంది. తన జన్మస్థలం నిజామాబాద్, తెలంగాణకు అధికారిక రాయబారిగా నియమితులయింది.



కథ

# నల్లమ్మ



- మణి వడ్లమాని

సమయం రాత్రి పన్నెండు గంటల పదిహేను నిముషాలు

అక్కడకి కొంచెం దూరము లో ఉన్న బల్ల మీద కూర్చుంది .

"అబ్బబ్బ యెంత రంజుం గుందిరా" .

"ఎవరి గురుంచి "

"ఇది చూడు". అర్ధనగ్నం గా కూర్చున్న సినీతార బొమ్మను చూపిస్తూ అన్నాడు.

"ఏమన్నా అంటే తిడతారు ,ఆయనేవడో చెప్పినట్లు ఎవరికైన పుడుతుందిరా సెగ" కళ్ళనిండా కోరికతో ఆ బొమ్మని చేతులతో తడిమేస్తూ అన్నాడు .

కొంచెం సేపు ఇద్దరు ఆ బొమ్మని చూస్తూ రెండు మాములు మాటల మధ్య ఆరు బూతులు వాడుతూ మాట్లాడుకుంటున్నారు.

"'తాగుపోతు చచ్చినాళ్ళు. వీళ్ళకి చావేప్పుడుస్తాదో. చచ్చిన శవాలని కాదు, ఈ నా కొడుకిలిని ఇక్కడే కసకసా.. పరపరా కోసేయాలి" .

నిశబ్దంగా ఉన్న ఆ వాతావరణం లో ....అడుగుల శబ్దం వినిపించింది. డిమ్ గా ఉన్న లైట్ వెలుగు లో ఎవరో తెలియలేదు. కొంచెము ముందుకు వంగోని చూసింది రుక్కమ్మ

అరుంధతి వస్తోంది. ఎత్తుగా ,బలంగా ,ఉన్న ఆమెని చూసిన సైదులు ,రంగా కూడా చిన్నగా విజిల్ వేసారు.

"అబ్బ నువ్వుచ్చావే ఈ మార్చురీ కే కళ వచ్చింది". అని ఒకరు,

"ఎప్పుడూ ఉనిఫోరం లోనే కనిపిస్తావేంటి అరూ".... అని గారంగా ఇంకొకడు అనంగానే

ఒక్క కసురు కసిరి " ఏంటి రా అరూ..., ఒళ్ళు ఎలా ఉంది రా ....ఛీ .. సిగ్గు లేని జన్మా పైగా పెళ్ళాన్ని పిలిచినట్టు పిలుస్తున్నావు. ఒక్కటిచ్చానంటే చచ్చి ఊరుకుంటావు" అంది

"పోనీ అలా కానివ్వవే నీ చేయి అయినా తగులుతుంది"

"ఛీ ఛీ . నీ తో మాటలు పెంచటం ఏంటి" అనుకుంటూ వాళ్ళని దాటి ముందుకు వెళ్లి రుక్కమ్మ ని పలకరించింది.

"ఎంటక్కా ఇంకా కూర్చున్నావు, డ్యూటీ అవలేదా పద పోదాం"

"కొత్తగా వచ్చిన డాక్టరమ్మ కొంచెము సేపు ఉండమంది. ఎవరి దో శవాన్నితెస్తారుట"

"అదే ఆ రేప్ కేసు అమ్మాయి ది పాపమే బాధేస్తోంది .కుక్కల్లా నలుగురు మీద పడి చేసారంట అక్కడ పోలీసోళ్ళు మాట్లాడుకుంటుంటే విన్నాను."

"అదే బాధేసింది. నేనూ విన్నాను.... మాయదారి సచ్చినాళ్ళకి, పోయేకాలం వచ్చింది. మనుషులు కాదే జంతువులు, అవునూ... వాళ్ళిద్దరూ తో నీకు గొడవెందుకు?"

"గొడవ కాదక్కా ,ఆ ఎధవలు అడ్డమైన కూత కుస్తున్నారు పైగా డ్యూటీ లో ఉండి తాగి వాగుతారు. ఎన్ని సార్లు కంప్లైంట్ ఇచ్చిన బుద్ధి రాదు చచ్చినాళ్ళకి అందుకే గట్టిగ చెప్పి వచ్చాను.అసలే ఓ పక్క పాపం ఆ రేప్ కేసు గురించి విన్నాక మనసంతా పాడయింది."

"ఇది ఎప్పటి నుంచో జరగుతున్న భాగోతమే నే, పెద్ద సార్ల కి చెప్పిన ఒక రెండు రోజులు బానే ఉంటారు. తరువాత మాములే"

ఇద్దరూ కాసేపు మౌనంగా ఉన్నారు.

"అక్కా ! నీకు తెలుసు కదా మా ఇంట్లో సంగతి "

"అవును"

"అసలు ఈ కరోనా భయం తో బతుకు నరకంగా మారింది. అక్కా! అప్పుడు లాక్ డౌన్ టైం లో పనిపోయింది.

ఇప్పుటి వరకు మరో పని ఏదీ దొరకలేదు. పోద్దస్తామాను తాగేసి అరుస్తాడు.అందుకే ఎగేస్త్రా పని చేయాలనీ డిసైడ్ అయ్యా అదే ఓ పెద్ద ఆమెని చూసుకోవడానికి అటెండ్ ట్ కావాలంట పొద్దున్న ఫోన్ చేసి చెబుతాన్నన్నాడు. బాబు. సరే లే అక్కా ఈ ముచ్చట్లు ఎపుడూ ఉండేవే . నే పోతున్నా", అంటూ వెళ్ళిపోయింది.

"సరే జాగ్రత్తగా ఉండు "

ఆమె వెళ్ళిన దిక్కే చూస్తూ పాపం చిన్నతనం లోనే బోలెడు కష్టాలు అనుకుంటూ ఆలోచనలో కి జారిపోయింది రుక్కమ్మ.

★ ★ ★

ట్రింగ్ ట్రింగ్ .. సెల్ ఫోన్ మోగుతోంది . ఈ రింగ్ టోన్ వస్తే ఎక్కడనుంచి వచ్చిందో తెలుసు అందుకే వెంటనే ఎత్తింది.

అవతల మాటలాడిన వాళ్ళకి బదులుగా "అన్నా, నీకు తెలుసు కదా నా కష్టం , పైగా రోజుకి రెండు సార్లు వెళ్ళాలి రెండు గంటలు ఉండాలి అంటున్నావు. నీ కమీషన్ పోను నాకు మిగిలేది కూడా చూసి మాట్లాడి పెట్టు...పిల్లలు చదువులు ,అమ్మ ఆపరేషన్ , మందుల ఖర్చులు... అన్నిటికంటే నా మొగుడు సంగతి తెలుసుగా తాగడానికే సరిపోదు యెంత డబ్బు తెచ్చినా ''

అవతలి నుంచి చెప్పిన మాటలకి సంతోషంగా తలూపుతూ 'థాంక్స్ అన్నా! నీ మేలు ఎప్పటికి మర్చిపోలేను. మంచిగా చూసుకుంటా ,మరి ఆమె కి బిడ్డలు ... ఓహ్ ఇద్దరు కొడుకులా.. అవునా..సరే సరే .. నే చూస్తా లే అన్నా."అంటూ రెండు మూడు సార్లు చెప్పి ఫోన్ పెట్టేస్తూ లోపల బెడ్ రూమ్ వైపు తొంగి చూసి నిట్టూరుస్తూ కిచెన్ లోకి వెళ్ళింది అరుందతి

"ఏందే ఎక్కడకి పోతున్నావు"

"కొత్తగా ఇంకో చోట పనిలో చేరాను"

"పైసలు బానే వస్తాయా"

( వీడు పైసా సంపాదించేది లేదు గాని ఆ రాలు బానే కావాలి)

"ఆ అన్న చూసుకుంటాడు"

''సరేలే ''

అమ్మయ్య ,అనుకుంటూ పరుగు పరుగున బస్సు స్టాప్ కి వెళ్ళింది. పెద్ద దూరం లేదు తను వెళ్ళే ప్లేస్ ,ఒక్క టైం జాగ్రత్తగా చూసుకుంటే సరిపోతోంది అనుకుంది. ఇంతలో తానూ దిగాల్సిన స్టాప్ వచ్చేసింది. మెయిన్ రోడ్ దిగి పక్కనే ఉన్న గల్లి లోంచి చివరి వరకు పోయి టర్న్ తీసుకోగానే హాస్పిటల్ . అక్కడకి వెళ్లేసరికి అప్పటికే బాలు ,శివ వచ్చేసి ఉన్నారు.

"రా రా" అంటూ అక్కడ నించొని ఉన్న భార్యభర్తల దగ్గరకు తీసుకొని వెళ్ళాడు

"మేడం నేను చెప్పిన ఆమె వచ్చింది".

ఆ మేడం తలెత్తి చూసి అబ్బో బానే దిట్టంగా ఉంది అనుకుంటూ "ఇదిగో బాగా చూసుకోవాలి. అంటే కాదు రోజు బయట నుంచి వస్తావు మాస్క్ అదీ పెట్టుకోవాలి అని గట్టిగ చెప్పింది.

మళ్ళీ అంతలోనే వెనక్కి వచ్చి అవునూ డబల్ వాక్సిన్ అయిందా ,ఏదీ సర్టిఫికేట్ చూపించు అనడిగింది. బాబు వచ్చి ఆ భయం లేదమ్మా రెండు డోస్ లు వేయించుకుంది. ఇదిగో అని చూపించాడు.

'ఆ సరే సరే " అంటూ అక్కడ నుంచి కదిలింది, వెనకాలే భర్త కూడా వెళుతూ "అమ్మని జాగ్రత్తగా చూసుకో ఇదిగో మా ఫోన్ నంబర్స్ అర్జెంటు అయితే ఫోన్ చెయ్యి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

★ ★ ★

"ఈ రోజు ఎట్లుంది." అరుంధతి పలకరింపు

ఏదో చప్పుడైనట్టు చూసింది. తప్ప ఆమె ప్రశ్న వినపడలేదు.

"వచ్చావా" ఆనంద పు తెర దగ్గుతో కమ్మేసింది.

ఉన్నటుండి ..మంచంమీద పడుకున్న నల్లమ్మ గట్టిగ అరచింది. ఏదో .. అంటోంది .. అర్ధం కాలేదు.. ఆ చూపులో ఏదో చెప్పాలనే తపన కనిపించింది.

"...." మాట ముద్దగా వచ్చినా పదం స్పష్టంగా వినిపించింది .

అరుంధతి దగ్గరగా వెళ్ళింది.

మళ్ళీ పలవరింత...

అది .. నిజమా ! ...పరాకు మాటలా ఆలోచనలో పడిపోయింది.

పడుకున్న అస్థిపంజరం లా ఉంది.

ఎవరూ చెప్పకపోయినా ఎన్నో చూసిన అనుభవం ఉన్న అరుంధతికి మటుకు అర్ధమయిపోయింది. నల్లమ్మ ఈ లోకం లో కొద్ది రోజులు ఉండే అతిధి మాత్రమె అని

★ ★ ★

రెండు రోజులు గడిచిపోయాయి

అరుంధతిని చూసినప్పుడల్లా. ఆ కళ్ళలో ఏదో అంతుచిక్కని భావం. దగ్గరకు పిలిచి చెప్పిన మాటలలో కొన్నింటికి అర్ధం ఉండేవి కావు.కొన్ని మటుకు ఎప్పటివో చెబుతూ ఉండేది.. అదీ స్పష్టంగా ఉండేది కాదు.

ఒకటి మటుకు ప్రస్ఫుటంగా తెలుస్తోంది.

నల్లమ్మ జీవితం లో ఏదో దారుణమయిన సంఘటన జరిగిందిఅనిపించింది.దాన్ని తనతో పంచుకోవాలని అనుకుంటోంది.

ఏమయుంటుందో? ఎలా తెలుస్తుంది.... అప్రయత్నంగా టీవీ పెట్టింది.

దేశవ్యాప్తంగా అందరిని కలచివేసిన ఒక రేప్ దుర్ఘటన గురించి చర్చా కార్యక్రమం వస్తోంది.

ఎందుకో అప్రయత్నంగా ఆ ఛానల్ మార్చి భక్తి ప్రోగ్రాం పెట్టింది.

అని ఒక్కో అక్షరం తడబడుతూ ముద్దగా అంటోంది . . "మాట్లాడాలి అందరూ మాట్లాడాలి .. నోళ్ళు నొక్కద్దు. బయటకు రావాలి" అని గట్టిగా అరిచింది. నల్లమ్మ

ఆ అరుపుకి కోపానికి ఒక్క సారి ఉలిక్కిపడింది అరుంధతి. "అమ్మో! ఈమెకి తెలివి వచ్చినట్లుందే" అనుకుంటూ దగ్గరగా వెళ్ళింది.

ఏదేదో మాట్లాడుతోంది.ఆ మాటలికి అర్ధం ఎంటి? తనకు తెలియకుండా మస్తిష్కపు పొరల వెనకాల దాగిన రహస్యాన్ని బయట పెడుతోండా

నిజంగా నల్లమ్మకు ఏదైనా జరిగిందా? మనసులో జరిగే మధనం ఏమిటో అడిగితే చెప్పగలుగుతుందా ? మరణపు అంచులలో ఉన్న ఆ మనిషి లో ఎన్ని సంద్రాలు పొంగుతున్నాయో ? లోలోపల ఆ మనస్సు యెంత ఘోషిస్తోందో ? అన్నీ ప్రశ్నార్ధకాలే.

మరో రెండు రోజులు గడిచాయి.

నల్లమ్మ ఆరోగ్యం ఇంకా దిగజారింది. అసలు కళ్ళు కూడా విప్పే స్థితి లో లేదు. ఆ ప్రాణం ఉన్నా లేనట్లే ఉంది.

ఆరోజు ఎప్పటిలాగే వచ్చింది. నిస్తేజంగా ఉన్న ఆ కళ్ళలో..ఆరాటం ..ఆత్రత.... అరుంధతి ఎటు వెళితే అటు వైపు తల తిప్పటం గొంతు దాటి బయటకు రాని మాట, ఆర్తనాదం లాంటి మూలుగు గ మారింది. ...

దగ్గరగా వెళ్లి "మామ్మా ఎట్లున్నావు" అని పలకరించింది. తన పిలుపు వినిపించిందో లేదో తెలియదు. ఆ కళ్ళు మూసుకునే ఉన్నాయి.

నల్లమ్మ చేతిలో అరుంధతి చెయ్యి గట్టిగా ... కొంచెం సేపటికి చెయ్యి బిగుసుకుపోతోంది. ఏదో అనుమానం వచ్చి పైన మానిటర్ వైపు చూసింది. అక్కడ రీడింగ్ ఏది కనిపించటం లేదు. వెంటనే డ్యూటీ నర్సు ని పిలిచింది. ఆమె పల్స్ చెక్ చేసి డాక్టర్ ని పిలవడానికి వెళ్ళింది. వెంటనే వచ్చి పల్స్ చూసి చెప్పేసాడు.

అప్పటికే నల్లమ్మ జీవితము ముగిసిపోయింది.

★ ★ ★

చిన్న వయసులో అతి క్రూరంగా తన శరీరాన్ని ముట్టుకొని మీద పడి నోరు మూసి రాక్షసుడి లా, కొన్ని రోజులు వరుసగా అత్యాచారం చేసిన వ్యక్తి... అందవిహీనంగా ఉన్నా కోరికతీర్చుకోవడానికి తన శరీరం అవయవాలు పనికొచ్చాయి.

కాని పెళ్ళిచేసుకో మంటే "ఛీ ఛీ దాన్ని పెళ్లి చేసుకోవడమా" అన్నారన్న సంగతి ఎలా మర్చిపోతుంది. పైగా అతనికి అప్పటికే మేనరికం నిశ్చయ మయింది.

అయినా ఆడదాన్ని చూస్తే కోరికను అదుపు లో పెట్టుకోలేని పెద్ద మనిషి. తన జీవితాన్ని నాశనం చేసాడు. ఆ అవమానం ,బాధ ఈ కట్టె కాలిపోయినా కూడా అవి మటుకు మానవు.

రాత్రి అయితే కోరికని తీర్చుకునే తన శరీరపు అందం పెళ్ళికి పనికి రాలేదు.

కానీ ఊరి పెద్దల బలవంతం తో జరిగింది.

నిజమే! పెళ్లి అతనితో నే అయింది.

అప్పటికి చాల మంది కాకిముక్కుకి దొండపండు అని హేళన చేసేవారు.

"అబ్బో అందం లేదు గానీ ఈ అమ్మాయికి జాణతనం

బానే ఉంది . అందుకే ఈ వైభవం అంతా అనుభవిస్తోంది" అని భర్తకు తప్పిపోయిన మరదలు మండిపాటు.

ఆవిడ జీవితాన్ని తనేదో దోచేసుకున్నట్లు.

అసలు విషయానికొస్తే ఎవరు ఎవరిని దోచుకున్నట్లు.

బలహీనుడు ని బలవంతుడు తొక్కేసినట్లు, డబ్బు, అందం, అండ, ఆధారం లేని ఆడవాళ్లంటే మగవాళ్ళకి యెంత చులకన

నిప్పుని దాచుకున్న కొలిమిలా ఉన్న నాకు

బలవంతం జరిగిన తరువాత అతని తోనే పెళ్ళయి న భార్య మనస్థితి ఎలా ఉంటుంది.

ఆరోజు నాకు భయం వద్దు వద్దన్నా కనికరించనివాడు

మొరపెట్టుకున్నా మాట్లాడొద్దు అని నోరు మూసేసేన వాడు... , కాళ్ళు పట్టుకొని ప్రాధేయపడ్డా ఒప్పుకోనివాడు .... పెద్దల బలవంతానా మొగుడయ్యాడు

ఆ సంఘటనకు ,పెళ్ళికి మధ్య ఎన్ని అవమానాలు? ఎన్ని తిరస్కారాలు అనుభవించాను కడుపున పడిన బిడ్డతో పెళ్లి జరిగిన నాకు కాలంతో సహా ఈ జీవితంలో అన్నీ మారతాయనీ తెలుసుకుని రాజీ పడిపోయాను.

జీవితం నడిచిపోయింది. పిల్లల తల్లినయ్యాను. కాలం ఆగదు. ఒక సూత్రం తో ముడివేయటం వల్ల ఏర్పడిన దగ్గరి తనము, అలాగే వయసులో ఉన్నప్పుడు ఉండే కొన్ని దేహధర్మాల మూలంగా సంసారం చేసాము తప్ప లోతుగా వెళ్లి ఆలోచిస్తే అందులో ప్రేమ లేదు అవసరం మాత్రమే!

బాధ్యత,సంఘం,భయం ఈ మూడు మేజర్ రోల్ ప్లే చేసాయి.

ఆయన లో ఎప్పుడూ ఒక గమ్మత్తయిన భావం కనిపించేది నేను కాబట్టి నిన్ను పెళ్లి చేసుకున్నాను సుమా అని, అది తనకు మాత్రమె తెలుసు. అవును... ఒక్క తనకు మాత్రమె తెలుసు

ప్రేమ, స్నేహం లేని బంధం యెంత నరకం

ఆస్తి అంతస్తు సంఘము లో పరువు అన్నీఇచ్చారు. కానీ తనను అనుభవించిన ఆ రోజు ని తిరిగి తెచ్చి ఇవ్వగలడా, ఆ బాధను భయాన్ని,కోపం,అసహాయతను పోగొట్టగలడా?

అయితే కొన్ని రోజులుగ మీ టూ బాధితుల గురించి టీవీలు ద్వారా చూసివాళ్ళ అనుభవాలు వింటూ

నాది కూడా అలాంటి కథే కదా అనిపించింది..

ఇన్నేళ్ళుగా మనసులో దాచుకున్న,లోలోపల గుండె పొరలలో అతుక్కుని ఉన్న బాధ, ప్రతిరోజూ ఎంతో మంది స్త్రీలు ఈ మగ మృగాల విషపు కోరలకు బలవుతున్నారు. మేమున్నామని ఒక్కళ్ళు కూడా ఎందుకు భరోసా ఇవ్వరు?. ఈ జంతువుల విచ్చలవిడితనాన్ని ఎన్నాళ్ళు ,...ఎన్నేళ్ళు ..... భరించాలనే ప్రశ్న...?

మీ కథ వ్యధ, బాధ ఎవరికయినా చెప్పండి. అరవండి. లేదా వ్రాయండి. గట్టిగా చెప్పుకోలేకపోతే రహస్యం గా నైనా గుసగుసగా అయినా చెప్పండి.కొందరు మనుష్యులు అర్థం చేసుకోలేరు. కొందరు ఛీ ఛీ అని పూర్తిగా తిరస్కరిస్తారు.కానీ చాలా మంది మీరు చెప్పిందుకు హర్షిస్తారు, కృతజ్ఞతలు తెలుపుతారు. ఆపైన అద్భుతం జరుగుతుంది. ఒక్కొక్కటిగా స్వరాలు మొదలవుతాయి

గుసగుసలాడుతూ, Me too అంటూ. ...నల్లమ్మ శవం ఘోషిస్తోంది.. అయితే జీవం లేని ఆ హృదయపు ఆ ఘోష ఎవరికయినా వినిపిస్తుందా ? ..ఏమో ..

★ ★ ★

ఎక్కడో పుట్టి ,మరో చోట జీవితమంతా ప్రవహిస్తూ చివరిగా తన కళ్ళముందు చనిపోయిన నల్లమ్మ ని చూస్తూ ఉండిపోయింది.

అచేతనంగా ఉన్న నల్లమ్మ శరీరాన్ని చూస్తూ పేరు సువర్ణ సుందరిట, వాళ్ళ మాటలలో తెలిసింది.అంత చక్కని పేరున్న ఆమెని ... తన ...శరీరపు రంగు తో పిలవడం మనుష్యులలో ఉండే శాడిజానికి పరాకాష్ట .

కొంత సేపు గడిచాకా ఆమె తరపు వాళ్ళు వచ్చిచివరి సారిగా చూసుకుని వెళ్లారు. ఇక ఫార్మాలిటీస్ అన్ని ముగించుకుని తీసుకెళ్ళడమే అని మాట్లాడుకుంటున్నారు..

ఆయా వచ్చి ఆక్సిజెన్ మాస్క్ యూరిన్ బాగ్ తీసేసింది. చేతులు, మొహం, కళ్ళు అన్ని,టపటపా సర్ది మొహం మీద పడుతున్న జుట్టు ని వెనక్కి చేతులతో గట్టిగ తోసింది.

"అయ్యో నెమ్మదిగా!"

"ప్రాణం లేదుగా నొప్పి తెలియదులే" అని నవ్వింది.

అరుంధతి చూపులు చప్పున నల్లమ్మ దేహాన్ని చూసాయి.

కవిత

# పరదా



- పి. సుష్మ
మొబైల్ : 9959705519

మా మాటలకు నిబంధనలుంటాయి
మా నవ్వులకు నిషేధాలుంటాయి
మాకు సంప్రదాయాల సంకెళ్లుంటాయి
పనిగట్టుకొని మాకు తెలియకుండానే మాపై పరిశోధనలు
జరుగుతూ ఉంటాయి
ఒక్కోసారి ఏ ప్రమేయం లేకుండానే బాధితులమవుతూ
ఉంటాం
అపార్థాల ఆలోచనల్లోనూ
అనుమానపు చూపుల్లోనూ తప్పుపడుతూ
వ్యక్తిత్వాల మీద నిందలు శిలాశాసనాలై కూర్చుంటాయి
మేము వేసుకునే బట్టల మీద నానారకాల బుద్ధిహీన
మరకలుంటాయి
మేము వేసుకునే వేషాల మీద వేలకొలది వ్యక్తిత్వాల
తాలుకా వ్యర్థాలుంటాయి
మేము మాట్లాడే భాష మీద ముసుగు దొంగల
బూతుపురాణం ఉంటుంది
అనాది నుండి ఆధునికం దాకా
మా ఉనికి కోసం ఊపిరాడనితనాన్ని ఉద్యమంగా పీలుస్తూ
ఉంటాం
బయటైనా, లోపలైనా అడుగడుగున
అసమానతల అడ్డుగోడలను చీలుస్తూ పాదముద్రలను
అచ్చులుగా మిగులుస్తూ ఉంటాము
సమాజంలోని సమానతల కొలతల్లో
మేమింకా సగభాగంలోనే సర్దుబాటుతనాన్ని అలవాటుగా
చేసుకుంటున్నవాళ్ళం
నిమిషానికో నిర్బంధం నిర్వచనమై రాజ్యాంగం
నిర్మితమవుతుంటే
కళ్ళు మూసుకొని నిశ్శబ్దంగా నిలబడలేను
అమ్మతనాల మాటేమో కాని
అసలు అస్తిత్వం గుర్తించనప్పుడు ప్రశ్నించకుండా
ఉండలేను
ఈ స్వాతంత్ర్య స్వరాజ్య సంగ్రామంలో స్వేచ్ఛగా ఎగిరే
అవకాశం నాకు లేదా ?
ఈ ప్రజాస్వామ్యలోని సమానత్వపు హక్కులు నాకు కాదా ?
వెర్రి ఆచారాల వ్యవహారాల్లో ఇంకెన్నాళ్లు మాకి సంకెళ్ళు ?
ఆకాశంలోని అర్ధభాగం మాటలో మా వాటా ఎంత ?
ఇక చాలు
బుర్ఖాల కహానిలొద్దు
ముసుగు చాటు ముచ్చట్లొద్దు
కాసింత ఊపిరాడే ఓ మాట కావాలి
మమల్ని మాలా బ్రతకనిచ్చే కాస్త స్వేచ్ఛ కావాలి

కవిత

# సంతకమంటే..!



నాంపల్లి సుజాత
మొబైల్ : 9848059893

పేరేదైనా కానీ
కదిపి కుదిపి సాగదీసి
కుప్పపోసే అక్షరాల చిక్కుముడే సంతకం
ఒక్క ఉదుటున
కలాన్నురికించి పూయించిన
ఉద్ధరాశి పువ్వే సంతకం

అది నీకూ నీ ఆమోదానికి సంజ్ఞారూపం.
నీకు నువ్వే చెక్కుకున్న
అక్షర శిల్పం
వేలిముద్ర వలయాలూ
వైవిధ్యమయిన సంతకమే
దాన్ని చిన్నచూపు చూస్తారు గానీ
అంతకన్నావిశ్వసనీయమైన దస్తఖత్
ఇంకేదీ లేదు

ముప్పైఏళ్ల నాటి నా సంతకం
రూపురేఖలు మారాయట
నా చెమట చుక్కలతో పోగేసుకున్న సొమ్మే
అయినా అది చెల్లని చెక్కంటూ
గిరాటేశారు బ్యాంకధికారులు
పిల్లల నోటు పుస్తకాల్లో అరిగీ అరిగీ
గంధపుచెక్కలా
మరో రూపానికి మారినట్టుంది
ఓ సారెళ్లి నన్ను నేను
రుజువు చేసుకోవాలిట వాళ్లముందు

లియోనార్డో సిగ్నేచర్ వల్లే
అలనాటి మోనాలిసా
చుక్కల్లో కెక్కి విఖ్యాతి గాంచింది
సంతకమంటే పొడిపొడి అక్షరాల కూర్పు కాదు
లెక్కించనలవికాని శ్రమసౌందర్యం

హాజరు పట్టీలోని
మా సంతకాల పేజీని  ఓ సారి చూడాలి
అచ్చంగా అది కోడి గెలికిన జాలారే..!
ఏ గ్రహాంతర వాసుల
భాషనో  తెచ్చి నిక్షిప్తం చేసినట్టుంటుంది

సెలబ్రిటీల స్వీయదస్తూరిని
ఆటోగ్రాఫ్ అంటాం
సేకరించడం గొప్ప కాదు గానీ
ఇచ్చేందుకు ఎదగాలి ఓ శిఖరంలా ..!

కొన్ని సంతకాలూ పైకి కనబడవు,
వాటి పరిమళాన్ని బట్టి పసిగట్టవచ్చు
కుక్కపిల్లా సబ్బుబిళ్ళ
అగ్గిపుల్లా అన్నా,
మనసు గతి ఇంతే మనిషి బ్రతుకింతే నన్నా..
ఆ పదధ్వనుల పల్లవి ననుసరించే
ఏ కలం కురిపించిన చిరుజల్లులో
పసిగడతామ్..!
ఇంత కన్నా సిగ్నేచర్ ఇంకేముంటుందనీ
అదికదా అసలు సంతకం..!!

# రసోత్కృష్టం

నిగమ

యుద్ధం ఒక దీర్ఘగాయం. ఎవరు ఎన్ని కారణాలు చెప్పినా యుద్ధం చేసిన గాయాల వల్ల మనుషుల జీవితాలు ఛిద్రమవుతాయి. ఎంతోమంది స్త్రీలు భర్తలను కోల్పోతారు తల్లిదండ్రులు తమ బిడ్డలు కోల్పోతారు. ఎంతోమంది పిల్లలు తమ తండ్రిని కోల్పోతారు. శారీరక అవకరాలతో భారమైన జీవితం గడపాల్సి వస్తుంది.ఎంతోమంది నిరాశ్రయులై ఆకలికి అలమటించిపోతారు. అయినా యుద్ధాలు వస్తూనే వుంటాయి. చరిత్ర యెన్ని పాఠాలు చెప్పినా గుణపాఠంగా తీసుకోలేక యుద్ధానికి కాలుదువ్వే దేశాలెన్నో!

రష్యా – ఉక్రెయిన్ ల మధ్య యుద్ధం మొదలవగానే ఎప్పుడో చదివిన ఈ కథ గుర్తుకువచ్చింది. ఈ కథ కూడా రష్యన్ యుద్ధ నేపథ్యంతో వ్రాయబడింది. రచయిత ఈ కథను మాస్కో రేడియోలో ప్రప్రథమంగా వినిపించారు. తర్వాత అచ్చులో వెలువడింది.

అలక్జీయ్ తోల్‌స్టాయ్ "రష్యన్ కేరెక్టర్ " కథను పరిచయం చేయబోతున్నాను. "ఇవాన్ సుదారేవ్ కథలు' శీర్షికతో రాయబడ్డ ఏడు కథలలో ఇది ఆఖరి కథ. ప్రారంభంలో కథగా మొదలై రచయిత "కథ లోపల కథ" సాంకేతికతను ఉపయోగించి ఏడు కథలు చెపుతాడు.అందులో అతని స్నేహితుడు , ఒక తోటి సైనికుడు, రష్యన్ యోధుని గురించి పాఠకుడికి చెప్పడమే ఈ కథ. యుద్ధం పంతొమ్మిది వందల నలభై ప్రారంభంలో జరిగినప్పటికీ, కథానాయకుడి యొక్క సాహసోపేతమైన దోపిడీలపై ఆక్రమణలపై దృష్టి కేంద్రీకరించబడదు, కానీ తీవ్రంగా గాయపడిన తర్వాత అతనికి ఏమి జరిగింది అని చెప్పడమే ఈ కథ. మానవుడు కష్టసమయాల్లో కూడా తన వ్యక్తిత్వాన్ని మంచితనాన్ని ఎలా నిలబెట్టుకోవాలనుకున్నాడో తెలియజేసే కథ. అలాగే ఉన్నతమైన ఇద్దరు స్త్రీమూర్తులు ఎంత స్థూల సూక్ష్మగ్రాహ్యులై తమ హృదయంతో తనవారిని ఏ రూపంలో వున్నా గుర్తించగలరని హృద్యంగా చెప్పినకథ.

లెఫ్టినెంట్ యెగర్ డ్రోమోవ్ గొప్ప ధైర్యశాలి. యుద్ధంలో ఆరితేరిన వీరుడు. కుర్క్స్ యుద్ధం చవరిదశలో విపరీతంగా గాయపడి అతికష్టంపై ప్రాణాలతో బయటపడి ముఖాకృతి కోల్పోయి కొన్ని సర్జరీల తర్వాత సరికొత్త మనిషి రూపంలో అద్దంలో తన రూపు చూసుకుని ఇంకెప్పుడూ అద్దం చూడకూడదనుకుని నిశ్చయించుకుంటాడు. యదాప్రకారం యుద్ధంలో పాల్గొనడానికి అనుమతిని పొందుతాడు. అతనికి ఇరవై రోజుల సెలవు లభిస్తుంది. సెలవుల్లో అతను తల్లిదండ్రులను చూడడానికి యింటికి వెళ్తాడు. తల్లిదండ్రులను చూసిరమ్మని తన క్షేమ సమాచారములు తెలుపమని యెగోర్ తనను పంపాడని లెఫ్టినెంట్ గ్రోమొవ్ గా తనను పరిచయం చేసుకుని రాత్రి ఆ ఇంట బసచేస్తాడు. తల్లి వచ్చింది కొడుకేనని గ్రహిస్తూంది. కాబోయే భార్య కూడా అతనిని గుర్తిస్తుంది. యెగోర్ కూడా ఎక్కువ నటించడం చేతకాక అక్కడినుండి వెళ్లిపోతాడు. .. తర్వాత ఏం జరిగిందో చదివితే హృదయం చెమ్మగిల్లుతుంది. మనిషి బాహ్యసౌందర్యం కన్నా హృదయసౌందర్యం గొప్పది. తల్లి హృదయం బిడ్డను ఏ రూపంలో వున్నా గుర్తించగలదు. అలాగే ప్రేమించిన స్త్రీ హృదయానికి బాహ్యసౌందర్యంతో పనిలేదు. యెగోర్ మానసిక సౌందర్యాన్ని వ్యక్తిత్వాన్ని ఎరిగిన కాత్యా యెగోర్ ఏ రూపంలో వున్నా అతనే తన భర్త అని నిశ్చయించుకుంటుంది. "నా జీవితమంతా నీతోనే కలిసివుంటాను నేను నిజంగా నిన్ను ప్రేమిస్తాను. నా సమస్త హృదయంతోనూ ప్రేమిస్తాను. నన్ను కాదనకు" అంటుంది. కథ చదివిన పాఠకుడి మనసులో భావాతీతమైన ఉద్వేగం అలముకుని హృదయం విప్పారుతుంది.ఓహ్ ఎంత గొప్ప కథను చదివాం అన్న భావన నిండిపోతుందంటే అతిశయోక్తి కాదు.

ఈ కథ రాసిన రచయిత యొక్క పని ఒక వ్యక్తి ఎంత శక్తివంతంగా మరియు అద్భుతంగా ఉంటాడో చూపించడం. అందుకే ఈ కథ పేరు '' వ్యక్తిత్వం" ఎంత హృదయ సౌందర్యం తో మనిషి మనగల్గితే అంత జీవన సౌందర్యాన్ని సొంతం

చేసుకుని మనుగడ సాగించగలడని చెప్పడమే రచయిత పని. అక్షరాలలో ఒదిగిన శక్తివంతమైన భావం పాఠకుడి హృదిని తాకుతుంది.

ఈ కథను తెలుగులో" రష్యన్ స్వభావం" పేరుతో కొసరాజు లక్ష్మినారాయణ, "వ్యక్తిత్వం" పేరుతో రా.రా (రాచమల్లు రామచంద్రారెడ్డి) అనువదించారు.

నేను ఈ కథను మొదట ఆంగ్లంలో చదివాను. తెలుగు అనువాదం కోసం చాలా వెతికాను. మిత్రుడు అనిల్ బత్తుల ను అడిగితే వారు వెతికి ఈ కథను అందించారు. వారికి ధన్యవాదాలు చెబుతూ... ఈ కథను చదువుకుందాం.

# రష్యన్ వ్యక్తిత్వం

## మూలం : అలెక్జీయ్ తోల్ స్తోయ్ అనువాదం : రాచమల్లు రామచంద్రారెడ్డి

రష్యన్ వ్యక్తిత్వం : నేను చెప్పబోయే చిన్న కథకు యీ శీర్షిక మరీ ఘనంగా వున్న మాట నిజమే. అయినా తప్పదు మరి నేను చెప్పబోయేది రష్యన్ వ్యక్తిత్వం గురించే గదా!

అవును రష్యన్ వ్యక్తిత్వం వర్ణించండి మీకు చేతనైతే, లెక్కలేనన్ని వీర కృత్యాలను గురించి చెప్పగలను. కానీ ఎన్నో వుండగా వాటిలో దేన్ని ఎన్నుకోడం ? అదృష్టవశాత్తు ఒక మిత్రుడు తన జీవితంలోని ఒక ఘటన చెప్పి నా సమస్య తీర్చాడు. అతను నిరాడంబరమైన మామూలు మనిషి. సరాతోవ్ ప్రాంతంలో ఓల్గా తీరంలోని ఒక గ్రామంలో సమిష్టి క్షేత్ర రైతు అతను. అతని కండలు తిరిగిన దృఢ శరీరమూ, అందమైన రూపమూ అసాధారణమైనవి. యుద్ధకాలంలో తన టాంకు లోనుండి మూత తెరచుకొని బయటికి వచ్చినపుడు ముల్లోకాలనూ జయించడానికి అవతరించిన వీరాధివీరునిలా కనిపించే అతని వైపు యెవరైనా గుడ్లప్పగించి చూడక తప్పదు. అతను టాంకు మీదనుండి నేలమీదికి దూకి, శిరస్త్రాణం వూడదీసి, చెమటతో తడిసిన జుట్టుకు కాస్త గాలి తగలనిచ్చి, చింపిరి గుడ్డతో ముఖం తుడుచుకొని – తరువాత, మెల్లగా యీ ప్రపంచంలో ఇంకా జీవిస్తున్నందుకా అన్నట్లు ఆనందం పట్టలేక చిక్కగ చిరునవ్వు నవ్వేవాడు.

మనిషి యుద్ధ రంగంలో వుండి, నిత్యం మృత్యువుతో ముఖాముఖి అవు తున్నప్పుడు, అతను మామూలు మనిషిగా వుండలేడు. పండుటాకులు రాలిపోయినట్లు అతనిలో పేరుకున్న చెత్తా చెదారం అంతా రాలిపోయి, నిజమైన సారం యేదో అది మిగులుతుంది. కొందరిలో యీ సారం మరింత గట్టిదిగా వుండవచ్చు. కొన్ని లోపాలు వున్న వాళ్ళు కూడా వాటిని వదిలించుకోడానికి తీవ్రంగా కృషి చేస్తారు ఎందుకంటే, ప్రతి ఒక్కడూ యుద్ధ రంగంలో తాను ప్రతి ఒక్కరికీ ఆప్తుడుగా, విశ్వసనీయుడు గా వుండాలని కోరుకుంటాడు.

కానీ, నా మిత్రుడు యెగర్ డ్రోమొవ్ యుద్ధానికి ముందు కూడా నియమబద్ధ మైన మనిషి. తల్లి మరియా పొలికార్పొన్నా అన్నా, తండ్రియెగర్ కోవిచ్ అన్నా అతనికి అపారమైన అధిక గౌరవం. "మా నాన్న ఆత్మగౌరవం గల మనిషి. ఆయన్ను చూస్తే యెవరి కైనా మొదట కనిపించేదీ అదే, నీవు ప్రపంచంలో యెన్నో విషయాలు చూస్తావు బాబూ, విదేశాలకు కూడా పోతావు. కానీ, నీవు రష్యన్ వనే గర్వం అన్నా మాత్రం వదలిపెట్టకు" అనేవాడాయన.

ఆ వూళ్ళోనే ఉన్న ఒక అమ్మాయిని తాను పెళ్ళిచేసుకోవాలనుకున్నాడు యెగర్. యుద్ధరంగంలోని సైనికులు తమ ప్రియురాండ్రను గురించీ, భార్యలను గురించి చెప్పి బోలెడు మాట్లాడుతారు. ముఖ్యంగా యుద్ధరంగం ప్రశాంతంగా వుండి, చలి కాలంలో అందరూ భోంచేసి కందకంలో చలిమంట చుట్టూకూర్చొని వున్నప్పుడు. ఆ మాటలు వింటే, ఒకోసారి చెవులు విచ్చుకు పోతాయి. ఎవరో ఒకరు మొదలు పెడతారు, "ప్రేమంటే యేమిటి?" అంటూ. ?

"గౌరవమున్నప్పుడు ప్రేమ పుడుతుంది" అంటాడు ఒకడు.

"అదంతా వట్టిది. ప్రేమనేది అలవాటు. మనకు భార్యమీద ప్రేమంటూ కలగదు. తల్లిమీదా, తండ్రిమీదా కలుగుతుంది, చివరకు జంతువులమీద కూడా కలుగుతుంది" అంటాడు మరొకడు.

ఇంకొకడు "ఛీఛీ, అదంతా చెత్త ! మనిషికి ప్రేమంటూ కలిగితే నిలువునా వూగిపోతాడు. సీసాడు సారాయి తాగినంత కైపులో వుంటాడు," అంటూ ఉపన్యాసం లంకించుకుంటాడు.

ఇలా గంటా రెండు గంటలు సాగిన తర్వాత సార్జంట్ మేజర్ తన అధికార కంఠంతో సమస్యను చులాగ్గా తేల్చేస్తాడు.

ఇలాంటి చర్చల్లో పాల్గొనడానికి యెగర్ డ్రోమొవ్ బిడియపడతాడు. అందువల్ల అతను తన ప్రేయసిని గురించి సూచనగా మాత్రమే నాతో ఒక మాట అన్నాడు. ఆమె

చాలామంచి అమ్మాయి. తన కోసం ఆమె ఆగుతా నన్నదంటే, తాను తిరిగి వెళ్ళినప్పుడు ఒక కాలు లేకుండా వెళ్ళినాసరే, ఆమె తన కోసం అక్కడ వుంటుందనే అర్థం. ఇదీ అతను చెప్పింది.

తన యుద్ధచర్యలను గురించి కూడా అతను యెక్కు వ గా మాట్లాడేవాడు కాదు. "అవన్నీ జ్ఞాపకం చేసుకోవడం యెందుకు ?" అంటూ అతను ముఖం చెవులు చిట్లించి గట్టిగా సిగరెట్ దమ్ము లాగే వాడు. అతను తన టాంకితో చేసిన సాహస కృత్యాలను గురించి సిబ్బంది ద్వారానే విన్నాము. మరీ సాహసోపేతమైన ఒక కథ డ్రైవర్ చువిల్యోవ్ చెప్పాడు.

"సరిగ్గా మలుపు తిరగగానే యెదురుగా గుట్టమీద కనిపించింది యేమిటనుకున్నారు! 'శత్రు టాంకి!' అని కేక వేశాను. 'దానిమీదికి పద' అని ఆయన బిగ్గరగా అరిచాడు. అలాగే నేను మా టాంకిని నడిపించాను. అక్కడ వున్న కొద్దిపాటి చెట్లను మాటుచేసుకుంటూ ముందుకు సాగాము. శత్రుటాంకి తన శతఘ్నిని మా మీదికి గురి పెట్టడానికి గుడ్డివానిలాగా తారాడింది. అది ఒక గుండు పేల్చింది, కానీ గురి తప్పింది. ఇంతలో మా లెఫ్టినెంట్ ప్రేల్చిన గుండు దాని డొక్కలో తగి లింది. ఓ యేమి దెబ్బలే! రెండో గుండు దగ్రెటకు తగిలింది. శత్రు టాంకి మోర పైకెత్తి వెనక్కి ఒరిగింది. గుండుతో మూడవ దాని నవరంధ్రాల గుండా పొగ రాసాగింది. మంటలు సుమారు మూడువందల అడుగులు పైకిలేచాయి. వెనుక ద్వారంగుండా సిబ్బంది బయటికి వచ్చారు. ఇవాన్ లాల్షిన్ తన మర తుపాకీతో వాళ్ళను ఊచకోత కోసే శాడు.ఇక రోడ్డుమీద మాకు అడ్డం లేదు. అయిదు నిమిషాల్లో సుడిగాలిలా వెళ్ళి ఊరిమీద పడ్డాం. బలే తమాషాలే ! నాజీలు దిక్కుదిక్కులకూ పరుగెత్తారు. నేలంతా బురదగదూ, అందుకని చాలామంది బూట్లు వదిలి ఎగురుతూ గెంతుతూ ధాన్యాగారం వైపు పరుగు తీశారు. "ధాన్యాగారం ప్రేల్చేయండి!" అని మా కామ్రేడ్ లెఫ్టినెంట్ ఉత్తరువు యిచ్చాడు. మా శతఘ్నిని వెనక నుండి ముందుకు తిప్పి ఫటాఫట్ ప్రేల్చేశాం. దంతెలు, దూలాలు, ఇటుకలు, కొయ్య పలకలు అన్నీ కుప్ప కూలిపోయాయి. అటక మీది కెక్కిన నాజీలు కూడా కూలి పోయారు. ఇంకా యేమైనా మిగిలివుంటే సాపు చేయడానికి నేను టాంకిని లోనికి పోనిచ్చాను. మిగిలిన నాజీలు చేతులు పైకెత్తేశారు.

అలా పోరాడాడు లెఫ్టినెంట్ యెగర్ ద్రోమొవ్. చివరకొకనాడు అతని అదృష్టం వక్రించింది.కుర్స్క యుద్ధపు చివరిదశలో, జర్మన్లు వెనుకంజ వేసే రోజుల్లో, ఒక గుట్ట మీద గోధుమ పొలంలో వున్న ద్రోమొవ్ టాంకికి షెల్ దెబ్బ తగిలింది. సిబ్బందిలో యిద్దరు వెంటనే చచ్చిపోయారు. రెండవ షెల్ తో టాంకి అంటుకుంది. ముందరి ద్వారం బయటికి వచ్చిన డ్రైవర్ చువిల్యోవ్ టాంకిమీదికి యెక్కి, లెఫ్టినెంట్ ను బయటికి లాగగలిగాడు. అప్పటికే అతనికి స్పృహ తప్పింది. బట్టలు అంటుకున్నాయి. చువిల్యోవ్ అతన్ని పక్కకు లాగిన మరుక్షణంలోనే మరొక గుండు వచ్చి మా టాంకిని బదాబదలు చేసింది. అయినా అతను లెఫ్టినెంటు తలమీదా, బట్టలమీదా మట్టి చల్లి మంటలు ఆర్పివేశాడు. తరువాత అతన్ని మెల్లమెల్లగా ప్రథమ చికిత్సా కేంద్రానికి యీడ్చుకపోయాడు. "ఆయన గుండె కొట్టుకోవడం నాకు వినిపించింది గనుక అలా యీడ్చుకపోయాను" అని " చువిల్యోవ్ తరువాత చెప్పాడు.



యెగర్ ద్రోమొవ్ బతికాడు. అతని కళ్ళు పోలేదు కానీ, ముఖమంతా ఎంతగా కాలిపోయిందంటే, అక్కడక్కడా యెముకలు బయటపడ్డాయి. ఆస్పత్రిలో యెనిమిది నెలలు వున్నాడు. ప్లాస్టిక్ సర్జరీతో అతనికి ముక్కూ, చెవులూ, పెదవులూ, కనురెప్పలూ పెట్టారు. ఎనిమిది నెలల తరువాత కట్లు విప్పి నప్పుడు అతను అద్దంలో ముఖం చూసు కున్నాడు. తనదేనా ఆ ముఖం?

అతనికి ఆద్దం అందించిన నర్సు పక్కకు తిరిగి యేడ్చింది. కానీ అతను అద్దం ఆమె చేతికిచ్చేసి "ఇంతకంటే ఘోరమైనవి చూశాను నేను ఫరవాలేదులే" అన్నాడు.

అతను మళ్ళీ అద్దం కావాలని అడగలేదు. కానీ, తన ముఖం తానే చేతులతో తడుముకునేవాడు. దానికి అలవాటు పడటానికి ప్రయత్నిస్తున్నట్లు. వైద్య బృందం అతన్ని యుద్ధేతరమైన కొలువుకు యోగ్యుడుగా ప్రకటించింది. కానీ, అతను నేరుగా తన జనరల్ వద్దకు వెళ్ళి, తనను మళ్ళీ తన రెజిమెంటుకు పంపించండని కోరాడు. "నీవు యుద్ధానికి అసమర్థుడివి కదా" అన్నాడు జనరల్. "కాదు. నేను విరూపినయ్యాను అంతే. ఫరవాలేదు. త్వరలో మునుపటిలాగే యుద్ధం చేయగలను" అన్నాడు అతను.

జనరల్ తనతో మాట్లాడేటప్పుడు తన ముఖంవైపు చూడకుండా చూపులు పక్కకు తిప్పుకోవడం యెగర్ గమనించినప్పుడు, అతని నోరు అనబడే రంధ్రం మీద వికట దరహాసం వెలిసింది. పూర్తిగా కోలుకోడానికి అతనికి ఇరవై రోజుల సెలవు యిచ్చారు. సెలవుల్లో అతను తల్లిదండ్రులను చూడడానికి యింటికి వెళ్లాడు.

రైలు స్టేషన్ నుండి స్వగ్రామానికి పోడానికి గుర్రపు బండి ఉంటుందని అతను అనుకున్నాడు. కానీ లేదు. ఆ పదిమైళ్లూ అతను నడచి వెళ్ళాడు. నేల యింకా మంచుతో నిండివుంది. అంతా చిత్తడి. ఎక్కడా జనసంచారం లేదు. ఈదర గాలి యీడ్చి కొడుతూ,చలి కోటు సందుల గుండా లోపలికి దూరుతూ, చెవులలో హోరు పెడుతున్నది. అతను గ్రామం సమీపించేటప్పటికి చీకటి పడుతున్నది. ఊరబావి మొత్తం గాలికి కీచుకోచుమంటున్నది. వీధివెంబడి పోతే ఆరవ యిల్లు తనది. హఠాత్తుగా అతను ఆగి, జేబులలో చేతులు పెట్టుకొని, తల పంకించాడు. తల వాకిలివద్దకు పోకుండా అతను యింటిచుట్టూ తిరిగి, మోకాళ్ళ లోతువున్న మంచులో తొక్కుకుంటూ వెనక్కి వెళ్ళి, కిటికీ దగ్గర వంగి, లోపల వున్న తల్లిని చూశాడు. కిరసనాయిల్ దీపపు మసక వెలుతురులో ఆమె టేబుల్ మీద రాత్రి భోజనానికి ఏర్పాట్లు చేస్తున్నది. ఆమె మునుపటిలాగే తలకు నల్లని శాలువ కట్టుకుంది, మునుపటిలాగే లాగే ప్రశాంతంగా, తొందరపాటు లేకుండా, దయగా కనిపించింది. కానీ, ఆమెకు మరింత వయసు పెరిగింది. భుజాలు పలుచబడ్డాయి. అయ్యో, ఈ సంగతి నించి తెలిస్తే రోజూ జాబు రాసేవాణ్ణిగదా, నాలుగు మాటలైనా రాసేవాణ్ణి గదా ! అనుకున్నాడు అతను. ఆమె భోజనం సిద్ధం చేసింది – గిన్నెలో పాలూ, కాస్త బ్రెడ్డూ, రెండు గరిటెలూ, ఉప్పుడబ్బీ, తరువాత ఆమె టేబుల్ వద్ద నిలబడి చిక్కి శల్యమైన చేతులు రొమ్మున కట్టుకొని, ఆలోచనలో మునిగి పోయింది. యెగర్ ద్రోమొవ్ కిటికీ గుండా ఆమెను గమనిస్తూ, ఆమెను యింకా బెదరగొట్ట కూడదనీ, అమాయక మైన

ఆ చిన్న ముఖాన్ని నిస్పృహతో మాడ్చి వేయకూడదని నిశ్చయించుకున్నాడు.

అతను ఉన్న చోటు నుండి ముందు వైపుకు తిరిగివచ్చి గేటు తెరుచుకొని లోగిట్లోకి వచ్చి, అతను తలుపు తట్టాడు. "యెవరు?" అని ప్రశ్నించిన తల్లి గొంతు అతనికి వినబడింది. "లెఫ్టినెంట్ గ్రోమొవ్", అని అతను జవాబు చెప్పాడు.

గుండె దడదడ లాడడంతో అతను తల ద్వారబంధానికి ఆనుకోవలసి వచ్చింది. లేదులే, తల్లి తన గొంతు గుర్తుపట్టలేదు. తనకే అది మొదటిసారి వింటున్నట్లు అనిపించింది. తన గొంతు మొద్దుగా రాచినట్లు వుంది. "యేం కావాలి, బాబూ ?" ఆమె అడిగింది. "మీ అబ్బాయి సీనియర్ లెఫ్టినెంట్ ద్రోమొవ్ వద్ద నుండి వర్తమానం తెచ్చాను, మరియా పొలికార్పొనా.

ఆమె తలుపు తెరచి, ఒక్క అంగలో అతన్ని సమీపించి, అతని చేతులు పుచ్చుకుంది.

"మా యెగర్ బతికే వున్నాడా ? బాగున్నాడా ? లోపలికి రా, బాబూ, లోపలికి రా. ."

యెగర్ ద్రోమొవ్ టేబుల్ దగ్గర బెంచీమీద కూర్చున్నాడు తాను పసి వాడుగా వున్నప్పుడు యెక్కడ కూర్చుంటే తల్లి తన ఉంగరాల జుట్టు నిమురుతూ "తిను బంగారూ, అంతా తినెయ్" అంటూ తనను బుజ్జగించేదో అక్కడే కూర్చున్నాడు.

అతను ఆమె కుమారుని గురించి, అంటే తనను గురించే చెప్పసాగాడు. అతని తిండి తీర్థాల గురించీ, అతను సుఖంగా, కులాసాగా వుండడం గురించీ, యిబ్బంది లేమీ లేకపోవడం గురించీ అతను చెప్పాడు. టాంకి యుద్ధాలను గురించి ఒకటి రెండు మాటలు మాత్రమే చెప్పాడు.

"అయితే మరి, యుద్ధమంటే భయంకరంగా వుండదూ?" ఆమె అడ్డు ప్రశ్న వేసింది. ఆమె అతని ముఖంపై చూసినట్లే వుంది గానీ, చూపులు యెక్కడనో వున్నాయి.

"అవునమ్మా, భయంకరంగానే వుంటుంది. కానీ, అలవాటు పడిపోతాం"

అతని తండ్రి యెగర్ యెగరోవిచ్ వచ్చాడు. ఆయనకు కూడా వయసు పెరిగింది గడ్డంసగం నెరసింది. ఆయన అతిథిని చూసి, ఫెల్టు బూట్లకు అంటుకున్న మంచును గడప

దగ్గర వదలించుకొని, మెడచుట్టూ వున్న మఫ్లర్ నిదానంగా తొలగించి, చలికోటు విప్పిటేబుల్ దగ్గరకు వచ్చి కరచాలనం చేశాడు. తండ్రి చేయి, ఆన్యాయమెరగని విశాలమైన ఆ చేయి, యెగర్కు బాగా పరిచితమే. ఆయన ప్రశ్నలేమీ అడగలేదు —— రొమ్మున వరుసగా అన్ని పతకాలు గల ఆ వ్యక్తి అక్కడికి యెందుకు వచ్చిందీ తెలుస్తూనే వుంది కూర్చొని అరమోడ్పు కన్నులతో విన సాగాడు.

లెఫ్టినెంట్ ద్రోమొవ్ తాను మరొకరైనట్లు నటిస్తూ తనను గురించే మాట్లా డడం కొనసాగే కొద్దీ, అతను ఆ నటనను వదలేయడం అంతకంతకూ అసాధ్యమయింది. అతను లేచినిలబడి "అమ్మా, నాన్నా, నేను యెంత విరూపి నైనా నన్ను గుర్తుపట్టలేరా ?" అని అడగడం అసాధ్యమయింది. స్వగృహంలోని భోజనాల టేబుల్ దగ్గర అతనికి సంతో షమూ, కలిగింది, బాధా కలిగింది.

"సరే, భోంచేద్దాం. అతిథికి వడ్డించు" అంటూ తండ్రి లేచి, చిన్న అలమార తెరచాడు. చేపల కొక్కేలు గల అగ్గి పెట్టె అక్కడే వుంది. ముక్క బోయిన టీపాట్ కూడా వుంది. అన్నీ యెగర్కు గుర్తే. యెప్పటి లాగే అలమార యెందు బ్రెడ్డు వాసనా, ఉల్లిపాయల వాసనా వేస్తున్నది. తండ్రి వోద్కాసీసా బయటికి తీశాడు. అందులో కొద్దిగా మాత్రమే వోద్కావుంది. అంతకుమించి తాను యెక్కడా సంపాయించలేనందుకు ఆయన నిట్టూర్చాడు. గతంలో లాగే అందరూ భోజనానికి కూర్చున్నారు. తాను గరిటె పట్టుకున్న కుడి చేతి యొక్క ప్రతి కదలికనూ తల్లి గమనిస్తున్నదని లెఫ్టినెంట్ ద్రోమొవ్ కొద్ది సేపు తర్వాత గుర్తించాడు. అతనికి నవ్వు వచ్చింది. తల్లి కన్ను లెత్తింది. ఆమె ముఖం బాధతో పణకింది.

వాళ్లు యేవేవో మాట్లాడారు. వచ్చే వసంతం ఏలా వుండబోయేదీ, రైతులు సకాలంలో విత్తనం వేసుకోగలుగుతారా లేదా అనేదీ మాట్లాడారు. వేసవికల్లా యుద్ధం ముగియ వచ్చునని తండ్రి అన్నాడు.

"ఈ వేసవిలో యుద్ధం ముగుస్తుందని యెందు కనుకుంటున్నారు"?, అని కొడుకు అడిగాడు.

"ప్రజల కోపం మిన్ను ముట్టింది, వాళ్ళు నరకం అనుభవించారు. వాళ్ళ నిక ఏ శక్తీ ఆపలేదు. కనుక ఫాసిస్టులకు చావు మూడింది. అంటున్నాను"

తల్లి అడిగింది: "యెగర్ యింటికి వచ్చి మమ్మల్ని చూడడానికి యెప్పుడు సెలవు యిస్తారో మీరు చెప్పనేలేదు. అబ్బాయిని చూసి మూడేళ్ళయింది. బాగా పెద్దవాడయివుంటాడనుకుంటాను. మీసాలు పెరిగి వుంటాయి. ప్రతిరోజూ మృత్యువుకు అంత దగ్గరగా వుండడం వల్ల గొంతు బాగా కరుకుదేలివుంటుంది."

"అవును అతను తిరిగివస్తే మీరు గుర్తు పట్టలేక పోవచ్చు," అన్నాడతడు. అతనికి పడక ఏర్పాటు చేశారు. అక్కడి ప్రతి ఇటుకా, కొయ్య మొద్దుల గోడలోని ప్రతి సందూ, ఇంటి కప్పు మీది ప్రతి అంగుళమూ అతనికి గుర్తే. ఆదంతా గొర్రె చర్మం వాసనా, బ్రెడ్డు 'వాసనా వేస్తున్నది. మరణ సమయంలో కూడా మరచిపోలేనట్టి సొంత ఇంటి సౌఖ్యపు వాసన అది. మార్చి గాలి చూరు కింద గీ పెడుతున్నది. కొయ్య దడికి ఆవల తండ్రి మెత్తగా గుర్రు పెడుతున్నాడు. కానీ, తల్లి తన మంచం మీద నిట్టూరుస్తూ పొర్లుతున్నది. ఆమెకు నిద్ర పట్టలేదు. తనేమో చేతుల్లో ముఖం పెట్టుకొని నిశ్చలంగా పడుకున్నాడు. ఆమె తనను ఎలా గుర్తు పట్టలేకపోయిందా అని అతను ఆలో చిస్తున్నాడు.

ఉదయం పొయ్యిలో కట్టెల చిట పటలతో అతనికి మెలకువ వచ్చింది. తల్లి నిశ్శబ్దంగా పొయ్యి అంటిస్తున్నది. అతని మేజోళ్లు ఆమె వుతికి తాటి మీద ఆరవేసింది. అతని బూట్లు శుభ్రంగా తుడిచి వాకిటి పంచన పెట్టింది.

"ధాన్యం అప్పలు ఇష్టమేనా బాబూ!" ఆమె అడిగింది. అతను వెంటనే జవాబు చెప్పలేదు. ప్రక్క దిగి, మిలటరీ చొక్కా తొడుక్కొని, బెల్టు బిగించుకొని, వుత్త కాళ్ళతో బెంచీ మీద కూర్చున్నాడు.

"ఈ వూళ్లో కాత్యా మల్మిషేవా అనే అమ్మాయి వుందా? అంద్రేయ్ మల్మి షేవ్ కూతురు."

"ఆమె నిరుడు కోర్సు పూర్తిచేసి, ఇప్పుడు ఇక్కడే బడిలో పంతులమ్మగా పనిచేస్తున్నది. ఆమెను చూడాల్నా?'

"మీ అబ్బాయి ఆమెకు తన శుభాకాంక్షలు తప్పక అందజేయనున్నాడు"

కాత్యా కొరకు తల్లి పొరుగింటి పిల్లను పంపింది. లెఫ్టినెంటు బూట్లు తగిలించుకునే లోపలే కాత్యా మల్మిషేవా ప్రత్యక్షమయింది. విశాలమైన ఆమె ధూసర నేత్రాలు ఆశ్చర్యంతో మరింత విశాలమై మిల మిల లాడుతున్నాయి. సంతోషంతో ఆమె బుగ్గలు ఎరు పెక్కాయి. తల మీది శాలువ ఆమె భుజాల మీదికి లాక్కున్నప్పుడు అతను బాధతో మూల్గినంత పని చేశాడు. ఆ వెచ్చని మెత్తని వెంట్రుకలు ముద్దు పెట్టు కోగలిగితే '

ఆమెను తాను ఇలాగే మనసులో చిత్రించుకున్నాడు — నవనవోన్మేషంగా, కుసుమ సుకుమారంగా, కరుణార్ద్రంగా,

అందంగా, ఎంత అందమంటే, ఆమె ఇంట్లో అడుగు పెట్టగానే ఇల్లంతా బంగారంలా మెరిసింది.

"యెగిర్ నాకు శుభాకాంక్షలు పంపాడా?" ఆ క్షణంలో అతను వెలు తురుకు వీపు మళ్ళించి నిలుచున్నాడు. మాట్లాడడం సాధ్యంకాక అతను అవునని తల ఆడించాడు " రేయింబగలూ అతని కోసం కాచుకొని వున్నా నని చెప్పండి." ఆమె మరింత దగ్గరికి వచ్చింది. ఆమె కన్నులూ, అతని కన్నులూ కలుసు కున్నాయి.

ఆమె అడుగు వెనక్కి వేసింది. గుండె మీద ఎవరో బలంగా గుద్దినట్లు ఆమె భయపడిపోయింది. దానితో అతను నిశ్చయానికి వచ్చాడు, అక్కడ ఇహ ఒక్క రోజు కూడా ఆగకూడదని, తల్లి పాలు కలిపి ధాన్యం అప్పలు చేసింది. తను మళ్ళీ లెఫ్టినెంట్ దోమొవ్ను గురించి, అతని సాహస కృత్యాలను గురించి, మాట్లాడాడు. కరకుగా కాత్యా వైపు కన్నెత్తి చూడకుండా మాట్లాడాడు. తన విరూపితనపు ప్రతిబింబం ఆమె మధురమైన ముఖంలో తనకు కనిపించకూడదనే ఉద్దేశంతో. తండ్రి సమష్టి క్షేత్రానికి వెళ్ళి గుర్రాన్ని తెస్తానని అన్నాడు. కానీ, తను స్టేషన్ కు నడిచే వెళ్ళాడు. జరిగినదానితో అతను నిలువునా కుంగి పోయాడు. దారిలో అప్పుడప్పుడు ఆగి, చేతులతో ముఖం కప్పుకొని "ఇప్పుడేం చేయాలి నేను?" అని బాధతో మూలిగాడు.

అతను తిరిగి తన రెజిమెంటులో కలిశాడు. అక్కడ మిత్రులు యిచ్చిన స్వాగతంతో అంత వరకు అతన్ని నిద్రకూ తిండికీ దూరం చేసిన హృదయ భారం తొలగిపోయింది. తనకు కలిగిన దౌర్భాగ్యాన్ని తల్లికి యింకా కొంతకాలం దాకా తెలియజేయవలసిన అవసరం లేదని అతను నిశ్చయించు కున్నాడు. ఇక కాత్యా, ఆమెను తన గుండెలో నుండి పెకలించిపారవేయాలి.

సుమారు రెండు వారాల తర్వాత తల్లి వద్ద నుండి అతనికి ఉత్తరం వచ్చింది "బాబూ, నీకు జాబు రాయలంటే నాకు భయమౌతున్నది; ఎందుకంటే, నాకు యేమీ పాలుపోవడం లేదు. ఒక మనిషి మన యింటికి వచ్చాడు, నీ వద్ద నుండి వచ్చానని చెప్పాడు. అతను చాలా మంచివాడు, కానీ ముఖం మరీ విరూపం చెందింది. అతను యిక్కడ కొన్నాళ్లు వుండడానికి వచ్చాడు, కానీ హఠాత్తుగా మనసు మార్చుకొని వెళ్లి పోయాడు. బాబూ, అప్పటి నుండి నాకు కంటిమీద కునుకు లేదంటే నమ్ము. ఆ మనిషి నీవే అని నాకు అనిపిస్తున్నది మీ నాన్నేమో నన్ను కేకలు వేస్తున్నాడు. "నీకు మతి చెడింది, ముసలి పీనుగా. అతను మన అబ్బాయే అయితే ఆ విషయం మనతో చెప్పడంటావా ? మన అబ్బాయే అయితే, మరొకనిలా యెందుకు నటించాలి ? అలాంటి ముఖం వున్నందుకు యెవరైనా గర్వించాలి ?" ఇలా అంటూ మీ నాన్న నా మనసు మార్చడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ, నా మాతృ హృదయానికి తెలుసు అతను నీవే! నీవే అతను అని మనసు ఘోషిస్తున్నది. ఆ మనిషి మన ఇంట్లో ప్రక్క మీద పడుకొని నిద్రపోయాడు. నేను అతని చలి కోటు దులపడానికి పెరట్లోకి తీసుకపోయాను. దాన్ని గుండెలకు హత్తుకొని యేడ్చాను. ఎందుకంటే అతను నీవే అని నాకు తెలుసు గనుక. బాబూ, యెగర్, భగవంతుని మీద ఆన, నాకు జాబు రాయి. ఏమి జరిగిందో నిజం చెప్పు. లేక, నాకు నిజంగా తల కాయ చెడిందా ?"

యెగర్ ద్రోమొవ్ యీ జాబు నాకు చూపించాడు. తన కథ చెప్తూ అతను కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. నేను అతనితో అన్నాను..

"నీవు మూర్ఖునివోయ్, వట్టి మూర్ఖునివి. మీ అమ్మకు జాబు రాసి క్షమాపణ కోరుకో. ఆమెను పిచ్చిదాన్ని చేయవద్దు. నీ ముఖం యెలా వున్నా ఆమెకు లెక్కలేదు. ఇప్పుడున్న ముఖంతో నిన్ను ఆమె యింకా యెక్కు వగా కూడా ప్రేమిస్తుంది."



ఆ దినమే అతను ఉత్తరం రాశాడు, "ప్రియమైన అమ్మా, నాన్నా నన్ను క్షమించండి. మిమ్మల్ని చూడడానికి వచ్చింది నేనే, మీ కొడుకునే..." అలా అతను నాలుగు పుటలు రాశాడు. తీరిక వుందే యింకా యిరవై పుటలురా సేవాడే.

కొన్నిరోజులు గడిచాక ఒకనాడు మేమిద్దరమూ ఒకచోట వుండగా, ఒక సైనికుడు పరుగెత్తుకుంటూ వచ్చి, "మీ కోసం యెవరో వచ్చారు. కెప్టెన్ ద్రోమొవ్," అని చెప్పాడు. ఆ సైనికుడు కెప్టెన్ ఎదుట సైనికుడు నుంచోవలసిన విధంగానే కచ్చితంగా నిలుచున్నాడు గానీ, అపురూపమైన శుభవార్త మోసుక వచ్చిన వింత కళ యేదో అతని ముఖంలో తాండవిస్తున్నది.

నేనూ, ద్రోమొవ్ కలిసి మా గదికి వెళ్ళాం. అతను కాస్త అస్తిమితంగా వున్నాడని నాకు అర్థమౌతూనే వుంది. అతను దగ్గుతూ, కేకరిస్తూ వున్నాడు. టాంకి సైనికుడయితే కావచ్చు గానీ, అతను కూడా మనిషే కదా అని నేను అనుకున్నా ను. అతను నాకంటే ముందు గదిలోకి వెళ్లాడు. అతని కంఠం నాకు "అమ్మా, నేనే " వినిపించింది.

ఒక ముసలి స్త్రీ అతన్ని రొమ్ముకు అంటగరచుకోవడం చూశాను. చుట్టూ కలయజూసినప్పుడు గదిలో మరొక స్త్రీ కనిపించించి, ప్రపంచంలో అందకత్తెలు చాలామందే వుంటారు. కానీ, యింత అందగత్తెను నేను యెప్పుడూ చూడలేదు.

అతను తల్లి కౌగిలినుండి విడిపించుకొని, ఆ యువతి వైపు తిరిగాడు. నేను ముందే చెప్పినట్లు ఆ సమయంలో అతను తన శరీర సౌష్టవం మూలంగా ప్రపంచాన్ని జయించడానికి అవతరించిన వీరాధి వీరునిలా కనిపించాడు. "కాత్యా! నీవెందుకు వచ్చావ్? నీవు కాచుకుంటానన్నది యీ మనిషి కోసం కాదు, మరొక మనిషి కోసం."

ఇహ అక్కడ వుండడం నాకు మనస్కరించలేదు, నేను బయటికి వెళ్ళే లోపలే ఆమె మాటలు నాకు వినిపిం చాయి.

"యెగర్, నా జీవితమంతా నీతోనే కలిసివుంటాను నేను నిజంగా నిన్ను ప్రేమిస్తాను. నా సమస్త హృదయంతోనూ ప్రేమిస్తాను. నన్ను కాదనకు."

రష్యన్ వ్యక్తిత్వ మందే అదీ! ఒకరు సాదామనిషి లాగా కనిపించ వచ్చు. కానీ, కష్టసమయం వచ్చినపుడు ఆ మనిషికి అతిలోకమైన శక్తి వస్తుంది. అదే మానవ హృదయపు మహా సౌందర్యం.

కవిత

# అమృత చినుకు



వి. పద్మ
మొబైల్ : 9951445867

అమ్మ
ప్రేమ అనంతం
ఆ నింగి నేలనంటటమే
కాదు, ఆకాశమంత
ఉన్నతమై నిలిచింది.

ఆ సంద్రం
లోతెంతో తెలియనట్టే,
అమ్మ మనస్సు కొలవలేం.
నిండిన చీకట్లను చిదమలేం... l
ఐనా ఆశ్రయమిస్తుంది.

అమ్మ
ఎదలో అగాధలెన్నో.. !
అంతులేని కన్నీరెంతో
ఐనా తన బిడ్డల్ని
ఒడ్డుకు చేర్చి ఓదారుస్తుంది.

అమ్మ
కన్నీటి సంద్రాన
తన ఆశలు ఆవిరి చేసి,
మేఘపు ఒడిలో నింపుకొని
అమృత చినుకై వర్షిస్తుంది.
ఆయుష్షునిచ్చి ఆశీర్వదిస్తుంది.

సమీక్ష

# సామాజిక నేపథ్యం ఆమె కవిత్వం




వాసరచెట్ల జయంతి

ఫోన్ : 9985525355


వచన కవిత్వం ఎలా రాయాలి అనే ప్రశ్న కు అనేక విధాలుగా సమాధానాలు వస్తాయి. నిర్థిష్టంగా కవిత ఇలాగే ఉండాలి అనే నియమాలు వచన కవిత్వానికి ఉండవనే చెప్పవచ్చు. "శక్తివంతమైనభావాలఆకస్మికప్రయాణం"(విలియంవుడ్స్‌వర్త్) "ఆధునిక కవిత్వం ఒక వ్యక్తి మరో వ్యక్తి తో ఆత్మీయంగా చేసే సంభాషణ లాగా ఉండాలి "(డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి) మనం చూసే దృష్టిని బట్టి ప్రపంచం కనిపిస్తుంది. ప్రపంచమంతా మనదే అనుకున్నప్పుడు అందులోని ప్రతి అంశం పట్ల హృదయం స్పందిస్తుంది. అలాంటి బంధనాల తాలూకు అక్షరాలు కవితా ప్రవాహమై "సరిత్సాగరం" గా 2019లో వెలువరించారు సరితా నరేష్ . ఇందులో 56 కవితలున్నాయి మొదటి కవిత" మా అమ్మ "చివరి కవిత "చివరాఖరికి"

కాకుల లోకపు కారుకూతలు విన్నా వినట్లే నటిస్తూ / పురుషాధిక్యత కొంగు చాటు బిడ్డగా /కాలంతో నడుస్తున్న కష్టాల గడ్డ ఆమె (మహిళా ఉద్యోగి )స్త్రీలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ముందుకెళ్తున్న బాధ్యతల బంధనాలు ,ప్రేమ ఆప్యాయతల నడుమ సంకెళ్లు వేసి కదలనీయకుండా చేస్తాయి. మహిళలు వారి కాళ్ళపై వారు నిలబడాలంటే ఎన్నో అవస్థలు ఎదుర్కొని తను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి. అలాంటి సమయంలో వ్యతిరేకత తో పాటు హృదయాన్ని గాయపరిచే చేష్టలు కూడా ఎదురవుతాయి. వాటిని తప్పించుకుని నిత్యం ఒక పోరాటం గా బ్రతుకు సాగిస్తోంది మహిళ. కుటుంబ బాధ్యతలు కర్తవ్య నిర్వహణ ల మధ్య అలుపెరుగని ఆమె ప్రయాణం నిర్విరామంగా సాగుతుంది. (మహిళా ఉద్యోగి)అనే కవితలో మహిళ యొక్క శ్రమను అక్షరీకరించిన తీరు బాగుంది.

పెద్ద బాడిసె పట్టి పెద్ద పేగే మడత పడి/ ప్రాణం మీదకి వచ్చినా/ మా కడుపు నింపడానికి కన్నీళ్లు దిగమింగి /మా కోసం కొలిమి మంటల సెగల్లో/ చెమటను ఆరబెట్టుకునే వాడు( మా నాన్న ) కులవృత్తి ని నమ్ముకున్న సగటు మనిషి తన జీవితంలో సాధించినది ఏంటో తన తండ్రి ని ఉదహరిస్తూ రాసిన కవిత ఇది నాన్న ఎవరికైనా నాన్నే బిడ్డల భావి భవిష్యత్తు కోసం నిత్యం తాను కొవ్వొత్తై వెలుగులు పంచే దీపం. తన తండ్రి బిడ్డలకోసం పడే శ్రమను చూసి తన ఆవేదనను తెలిపేందుకు తండ్రి జీవితాన్ని చిత్రించిన తీరు ఆకట్టుకుంది.

ముట్టు రాదని చెప్పే మైల రక్తం కాదది/ ఆయువిచ్చి ప్రాణ ప్రతిష్ట చేయు /పరమ పావన సంజీవనీ తైలమది/ మన దేహపు చిత్రానికి రూపు నిచ్చే / అమూల్యమైన మైల రక్తమది (మైల రక్తం) నెలసరి సమయంలో ఆ నాలుగు రోజులూ స్త్రీ పడే వేదనను అక్షరీకరించిన తీరు ఎంతో ఆవేదన వ్యక్తం చేస్తూ ఆ సమయంలో అన్ని శుభకార్యాలకు దూరంగా ఉంచి వెలివేసినట్లు చూడడం ఎంత ఇబ్బంది కలిగిస్తుందనేది చెప్తూ ఉద్యోగాలు చేస్తూ తమ బాధ్యతలను నిర్వహించే మహిళలు ఆ సమయంలో పడే యాతన ను అక్షరీకరించిన తీరులో ఆధునికత తొంగిచూస్తుంది.

ఎందుకలా కూర్చున్న చోటే /కలలు కుప్ప పోసుకుంటావు/ నిల్చున్న చోటే నిన్ను నీవు/ ఆకాశానికి ఎత్తుకుంటావు/ పగటి కలలు కంటూనే /కాలమంతా

వృధా చేసుకుంటావు /(పగటి కలలు)అనే కవితలో ఆలోచిస్తూ కూర్చుని ఊహల్లో బ్రతక రాదని గమ్యం చేరాలంటే అడుగు ముందుకు వేయాలని స్ఫూర్తిదాయకమైన కవితను అందించారు.

నన్ను ఆకర్షించిన మరో కవిత "జేబు" ఒక చిన్న వస్తువులు తీసుకుని దానిని అన్ని కోణాల్లో చూపించి అక్షరీకరించిన తీరు అభినందనీయం. జేబు రూపాయల కట్ట నే కాదు పాపాలను మోస్తుందంటారు సరిత. పచ్చ పచ్చ గా ఉన్నప్పుడే అందరూ దగ్గర చేరి ఆదరణ చూపిస్తారని అందువల్ల ముప్పు కూడా అంతే ఉందని వాస్తవాన్ని కచ్చితంగా చెప్పారు.

ఆ ఇంట్లో రాత్రైతే చాలు /అతడు ఉరుములవుతాడు /ఆమె వణికే మెరుగవుతుంది/ ఇంకేముంది /మొదలాయె పిడుగుల జడి (ప్రతి రాత్రి కాళ రాత్రే) అందరూ ప్రశాంతంగా నిద్రపోయే సమయంలో ఆ ఇంట్లో మాత్రం జాగారం చేస్తారని చెప్పే తీరులో ఒక దృశ్యాన్ని కళ్ళముందు చిత్రించారు .ఆమెను అతను కొట్టడాన్ని "పిడుగుల జడి" అనడం, ఏడవడాన్ని "శోక తటాకంలో ఈదుతున్నారు"అనడం ఒక క్రొత్త ఎక్స్ ప్రెషన్ .మనం మరి విధంగా కూడా అనుకోవచ్చు పేద కుటుంబాల్లోని మహిళ తన భర్త తాగుడుకు బానిసై కుటుంబ బాధ్యతలను చూడకుండా అతని నిస్సహాయ తను కుటుంబం పై ఇలా ప్రదర్శించడం చేతకాని వ్యక్తిత్వాన్ని చూపుతుంది. ఇలా సరిత్సాగరం కవితా సంపుటి లోని కవితలన్నీ భిన్న వస్తువులతో తనదైన ప్రత్యేక శైలిలో రాశారు సరిత .వృత్తిరీత్యా ఉపాధ్యాయిని అయినందువల్ల తీసుకున్న వస్తువును కవితగా మార్చే సమయం లో ఆ వస్తువు కు పూర్తిగా న్యాయం చేశారు.సరిత్సాగరం కవిత్వం చదువుతూ ఉంటే ఆత్మీయంగా ఆమెతో సంభాషిస్తున్నట్లు గా అనిపిస్తుంది. ఇంకా మున్ముందు మరెన్నో మంచి రచనలు ఆమెనుండి రావాలని ఆకాంక్షిస్తూ సరితకు శుభాకాంక్షలు.

**కవిత**

# ఈడొచ్చిందా




- ఆవుల రేణుక

మొబైల్ : 9398268976


గీయల్ల నా పెండ్లి సూపులు
పొద్దు కొరకు సూసే....
పొద్దుతిరుగుడు పువ్వోలే
అమ్మా నాయిన....
పెండ్లోల్ల కొరకు సూస్తుండ్రు...
మస్తు మురుస్తుండ్రు
గప్పుడు దెల్సింది...
నేను పెద్దగయిన్నని...
పెండ్లీడు ఒచ్చిందని
కానీ...
ఆరం దినాలకిందొచ్చిన పెండ్లోల్లు
సిన్న పిల్లనన్నరు
మరీ.... గప్పుడు రాని ఈడు
తాడిసెట్టోలే....
గింత జల్దీ....
నాలుగేండ్లెట్ల వెరిగినయి!
ఓ....గిప్పుడెరుకైంది...
గదీ నాకు గాదు...
ఆదారం కారట్ల
నేను ఇంట్ల బరుగైన
అమ్మా నాయిన ...
దింపుకోవాలనుకునే బరుగు
గందుకే...గింత జల్దీ ఈడొచ్చింది
ఎన్ని శెట్టాలొచ్చినా...
ఏంజేసినా...
గిట్లనే...
ఆడివిల్లలు అన్నాలం అయితుండ్రు
అయితనే వుంటరు.

సాహిత్య వ్యాసం

# ఆధునిక భావావేశం చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ కవిత్వం



- డా॥ కొండపల్లి నీహారిణి

కవులేకాలంలో పుడితే ఏంటి ? వాళ్ళు రాసే కవితలుః, రచనలన్నీ ఏం చెబుతున్నాయి అనేది ముఖ్యం. కాలంతో పాటు నడుస్తూ సమాజ గతంగా ఆదర్శ భావజాలంతో సాగాలి. సమస్యలను చూపాలి, సమస్య పరిష్కారమూ సూచించాలి. సమాజ గొలుసులను తెగ్గొడుతూ సాగే సాహిత్యాన్ని ఎవరూ మనస్ఫూర్తిగా ఆహ్వానించరు, ఒప్పుకోరు ఎందుకంటే ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఓ చోట ప్రతి వ్యక్తి అన్నీ , మంచీ చెడుల ను చవి చూస్తారు కాబట్టి. కలిసి బాటలు వేసే నడకను విడగొడుతూ రాయడంకన్న మిన్నకుండడం మంచిది . కాని కొందరుంటారు! వాళ్ళు కవిత్వం రాయడం అనేది ఒక బాధ్యత గా తీసుకొని రాస్తారు . కవికి వేరే సమాజమేదో వేరుగా ఉండదు .ఇది వాళ్ళ కవితలలో బాగా తెలుస్తుంది . అటువంటి వాళ్ళు అరుదుగా ఉంటారు.

వాళ్ళ దృష్టి కోణం గొప్పగా ఉంటుంది. చక్రవర్తుల లక్ష్మీ నరసమ్మ గారు ఈ కోవలోకే వచ్చే కవయిత్రి. సంప్రదాయ కవిత్వం లోనూ ఆధునిక విప్లవ భావాలను ప్రస్ఫుటించిన వీరు తెలంగాణ ముద్దుబిడ్డ. ఎంత గొప్పగా ఉందో వీరి కవిత్వం తెరచి చూస్తే , తరచి చూస్తే తెలుస్తుంది. కొందరు చైతన్య రహితంగా స్త్రీల పట్ల చులకన భావం తో మాట్లాడుతూ వాళ్ళ అస్తిత్వం పై దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తారు. అటువంటి ప్రవృత్తులకు వీరి కవిత్వం ఓ చెంపపెట్టు–

"ఆమె ,
కాదు కేవలం ఒక భామ
ఈ తరం సత్యభామ
ఆమె కాదు కేవలం అభిసారిక
ఆమె ఈ విశ్వ నాటక ప్రథమ భూమిక
లేవామెకు కులుకులు
లేవామెకు అలకలు
లేవామెకు సపత్నీ మత్సరాలు
లేనే లేవామెకు కోపగృహాలు
కానీ ఆమె ధరించిందొక కవితా ధనస్సు
చీల్చి వేస్తున్నది , జీవన విషాద తమస్సు " అంటూ కణకణ మండే నిప్పుకణికల్ని గళంలో గరళం దాచుకుని భావావేశంతో కవిత్వాన్ని సంధించింది. లక్ష్మీనరసమ్మ గారు ఈ కవితను 1980లోనే రాశారు. తాము చూసిన దృశ్యాలను తమకు తెలిసిన విషయాలను , , స్వీయ అనుభవాలను పురాణగాథల నాయికల ప్రతీకలతో పరోక్షంగా చూపిస్తూ రాసిన ఈ కవిత తరతరాల స్త్రీజాతి బ్రతుకు ను చిత్రిక పడుతున్నది.

కట్టుకున్నవాడో , అతని తల్లిదండ్రులో అవమానపరుస్తూ ,హింసిస్తే ఇదిగో ఇట్లా కవితా ధనస్సును ఎత్తినట్టు ఆలోచనా ధనస్సును ఎక్కు పెట్టాలి.

ఈ జీవితం ఎడారి పుష్పం కాకూడదు, వాళ్ల అందరితో కలిసి జీవించేందుకు మంచితనాన్ని ఒక బాణం గా చేసి ఓర్పును ఒక ధనస్సు గా చేసి ప్రయత్నించాలి . ఎన్నో ప్రయత్నాలు చేసినాగాని మార్పుల లో మార్పు లే లేకుంటే పెద్దల సహకారాలు సలహాలు తీసుకోవాలి. అప్పటికి అట్లాగే ఉంటే, వాళ్లకు దూరంగా ఉండే ప్రయత్నమైనా చేయాలే గాని తమ జీవితాన్నే అంతం చేసుకోకూడదు.

చక్రవర్తుల లక్ష్మీ నర్సమ్మగారి జీవితం ఇందుకు ఆదర్శం . కష్టాలను ఎదుర్కొని తగిన నిర్ణయం తీసుకున్నారు కాబట్టే ఇప్పటికీ వారి ఈ 80 వ దశకం లోనూ అద్భుతమైన రచనలు చేస్తున్నారు . తమకు ఇష్టదైవమైన భద్రాద్రి రామునికి సేవలూ చేస్తున్నారు.

తమ పదహారేళ్ల ప్రాయం లో తల్లిగారింటికి వచ్చినప్పుడు ఆమె ఒంటరి మనస్సుకు , తల్లిదండ్రులైన నరసమాంబ , కొడిచేటి రాఘవాచార్యులుగార్లు బాసటగా నిలిచారు.

లక్ష్మీ నర్సమ్మ గారు ఇల్లందుల , కొత్తగూడెం లలో చదువుకున్నారు . సెకండరీ గ్రేడ్ బేసిక్ ట్రైనింగ్ అనే రెండేళ్ల కోర్సు 1962 , 64 లలో పూర్తిచేశారు. ఇక్కడే వీరు జీవితాన్ని నేర్చుకున్నారు . దానితో పాటే ప్రపంచ జ్ఞానాన్ని అందిపుచ్చుకున్నారు. భారతదేశాన్ని కాపాడుకోగలగడం ఎట్లా? ఏమి జరుగుతున్నదీ తెలుసుకున్నారు. అప్పుడే చైనాతో యుద్ధం అయితే అవసరార్థం వీళ్లను బార్డర్ కు పంపిస్తారని కట్లు ఎట్లాకట్టాలో అత్యవసర సేవలు ఎట్లా చేయాలో శిక్షణ ఇచ్చారు. ఆ స్థితి రాలేదు కానీ , ఎలాంటి పరిస్థితుసనైనా తమ అదుపులోకి తెచ్చుకునే నైపుణ్యాన్ని సాధించుకున్నారు. ఇక వెనుదిరిగ లేదు . బాగా చదువుకున్నారు , డిగ్రీలు సాధించారు.

1964లో 'భద్రగిరి 'అనే నవలను రాశారు లక్ష్మి నర్సమ్మ గారు. దీనికి దాశరథి గారు ముందు మాట రాశారు. ఆనాటి కృష్ణా పత్రిక , గోలకొండ పత్రికలో లక్ష్మీ నరసమ్మ గారి వ్యాసాలు వచ్చేవి . దాదాపు ఓ పది సంవత్సరాలు పత్రిక వ్యాసంగంలో ఉన్నారు. మొల్ల, తరిగొండ వెంగమాంబ ల స్థాయిలో వీరి కవిత్వం ఉన్నదని పేరుపొందారు.

'సోమనాథ విజయం 'అనే ఆధునిక చంపూ కావ్యాన్ని, 'రామదాసు 'పద్య కావ్యాన్ని రాశారు.

"భద్రాద్రి ముంగిట వర కల్పవల్లి రాముని పాదాల పాద్యాల వెల్లీ

నా కవిత వై పొంగవే

గోదారి తల్లి " అంటూ భద్రాచల క్షేత్రం పై రాసారు. గోదావరి గలగలల లాగే ఇప్పటి వరకు వీరి కవిత్వ రచనా ప్రవాహం సాగుతూనే ఉన్నది.

"ఈ కారు చీకట్లను /నీ చేతి చిరుదీపం జయిస్తుంది/ మానవతా శీత శీకరాల /జల్లుల లో నీ మనో భూమి తడిసి ఆత్మవిశ్వాసం మొలకెత్తుతుంది/ మొగ్గలా నీ అజ్ఞానం నిద్దుర విజ్ఞానపు వెలుగు కోసం/ గుండెలు విప్పుతుంది / వేకువ వస్తుంది అప్పుడు ఒకే జాతి ఒకే నీతి నిలుస్తుందని ఆశ ఉంది"

అంటూ ఆశావహంగా వ్రాసిన తీరు ఆలోచనాత్మకంగా ఉన్నది. వీరి అనుభవాలను చరవాణిలో నాతో పంచుకున్నారు! , వీరు కాలేజీలో ఉద్యోగం చేస్తున్నప్పటి విషయాలన్నీ చెప్పారు.,

"సమతాభిరామం' కవితా సంపుటిలో ఆధ్యాత్మిక భావనతో వ్రాశాను, సామాజికాంశాలది కాదు అన్నారు. అంటే," రామ స్పృహే సామాజిక సృహ ఇంకేముంటుంది అమ్మా ఇంతకన్నా అని అన్నాను.

"ఆధ్యాత్మికత లేని సామాజికత ఉండదు" అని అన్నారు

వారి కళాశాల ప్రిన్సిపాల్ సామల సదాశివ గారానాడు.

లక్ష్మీ నరసమ్మ గారు మూడవ తరగతిలో ఉన్నప్పుడే 'మహాత్మాగాంధీ ఇక లేడు ,అనే గేయం లో గాంధీ తాత ను గురించి రాశాను అని అంటే విని ఆశ్చర్యపోవడం నా వంతయింది.

వీరికి మన దేశ రాజకీయాల పైన ప్రపంచ విషయాల పైన మంచి అవగాహన ఉన్నది. 'మతం మత్తులో' అనే కవితలో "పంచ నది వీచికలు / విపంచికలై/ ప్రపంచశాంతి వినిపించిన చోట/ మతం మత్తు మానవతను ఉరితీసింది/ ఆది గ్రంథం అవతరించి/ అమృత చషకమై/....ఇట్లా సాగిన ఈ కవిత "శాంతిని తరిమి వేసింది " అనే వాక్యం తో ముగించారు. ఈ కవిత పంజాబ్ వార్తను విని రాసిన కవిత.'వసంత మూర్తి ' కవిత లో

"నిరుపేద దోసిళ్ల నింపి కన్నీళ్లతో

కడగెనీ కాళ్ళొక్క కన్నె పడుచు

జాలి చూపుల పూలు జోలి నిండుగా దెచ్చి

పూజింప పిలిచెనో పూలపిల్ల

కరిగిన స్వప్నాల కల్హార మధువుల నారబోసె నొక అభాగ్య యువతి

కడుపులో బడబాగ్ని కర్పూర కళిక గా అందించెనొక్క

క్షుదార్త హృదయ" అంటూ ఉగాది పచ్చడి లో మానవాభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ వీరు "ఒక వసంతాగమన వేళలో .....", "రమ్ము వేంచేయుమఖిల విశ్వముపైకి హర్ష మొలికింప నూతన వర్ష మూర్తి"అని రాస్తారు. నిరుపేద కన్నెపిల్ల వైపునుంచి, జాలి చూపుల పూలు తెచ్చిన పూల పిల్ల వైపు నుంచి, కరిగిన స్వప్నాల కల్హార మధువులారబోసిన అభాగ్య యువతి వైపు నుంచి కొత్త సంవత్సరానికి విన్నపాలు చేయడం గమనిస్తాం.ఇది కవిత్వం అంటే ! ఇది సామాజిక దృక్కోణం అంటే!

వీరు రాసిన 'శతక శంఖారావం' ను 'స్త్రీ మనోహర శతకం' అంటూ పది వారాలు ఈ .టీ.వీ. లో జొన్నవిత్తుల రామలింగేశ్వర శాస్త్రి చెప్పడం వీరి భావాలు ఎంత ఉన్నతంగా ఉన్నవో తెలుస్తుంది. లక్ష్మీ నరసింహ గారు 'సుందరకాండ' ను రాస్తున్నారు. ఇది ద్విపద కావ్యం. ఆధునిక కాలంలో ఇంత వరకు ఇలా రాలేదు. ద్విపద తేలికగా హృదయాల్లోకి చేరుతుంది. అందులోనూ మంజరీ ద్విపద కు యతులు, ప్రాసలు వంటి నియమాలు లేకుండా గాన యోగ్యంగా ఉంటుంది. ఆనాడు గోన బుద్ధారెడ్డి 'రంగనాథ రామాయణం' తాళ్ళపాక తిమ్మక్క 'సుభద్రా కళ్యాణం' గమనిస్తాం.

'కన్యా మేధం 'కవితలో ఛందోబద్ధం గా రాసినా సామాజిక స్పృహతో,

"ఎవ్వతెవీవు చెల్లి, సెలయేటిని బాసిన తమ్మి పువ్వుటుల్
ఇవ్విధి వాడిపోయితివి, యెవ్వరు మాట సూటిపోటి కాల్
రువ్వినవారు, కాపురము లో నుంచి నిప్పులు బోసినారు, వారెవ్వరో కాదు ఈ మనుషులే వరకట్న పిశాచుల కారణాలేమిటో చెబుతారు

వారి కళాశాల ప్రిన్సిపాల్ సామల సదాశివ గారానాడు.

లక్ష్మీ నరసమ్మ గారు మూడవ తరగతిలో ఉన్నప్పుడే 'మహాత్మాగాంధీ ఇక లేడు, అనే గేయంలో గాంధీ తాత ను గురించి రాశాను అని అంటే విని ఆశ్చర్యపోవడం నా వంతయింది.

వీరికి మన దేశ రాజకీయాల పైన ప్రపంచ విషయాల పైన మంచి అవగాహన ఉన్నది. 'మతం మత్తులో' అనే కవితలో "పంచ నది వీచికలు / విపంచికలై / ప్రపంచశాంతి వినిపించిన చోట / మతం మత్తు మానవతను ఉరితీసింది / ఆది గ్రంథం అవతరించి / అమృత చషకమై /....ఇట్లా సాగిన ఈ కవిత "శాంతిని తరిమి వేసింది " అనే వాక్యం తో ముగించారు. ఈ కవిత పంజాబ్ వార్తను విని రాసిన కవిత.'వసంత మూర్తి ' కవిత లో

"నిరుపేద దోసిళ్ల నింపి కన్నీళ్లతో
కడగెనీ కాళ్ళొక్క కన్నె పడుచు
జాలి చూపుల పూలు జోలి నిండుగా దెచ్చి
పూజింప పిలిచెనో పూలపిల్ల

కరిగిన స్వప్నాల కల్హార మధువుల నారబోసె నొక అభాగ్య యువతి కడుపులో బడబాగ్ని కర్పూర కళిక గా అందించెనొక్క క్షుదార్త హృదయ" అంటూ ఉగాది పచ్చడి లో మానవాభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ వీరు "ఒక వసంతాగమన వేళలో .....", "రమ్ము వేంచేయుమఖిల విశ్వముపైకి హర్ష మొలికింప నూతన వర్ష మూర్తి"అని రాస్తారు. నిరుపేద కన్నెపిల్లల వైపునుంచి , జాలి చూపుల పూలు తెచ్చిన పూల పిల్ల వైపు నుంచి, కరిగిన స్వప్నాల కల్హార మధువులారబోసిన అభాగ్య యువతి వైపు నుంచి కొత్త సంవత్సరానికి విన్నపాలు చేయడం గమనిస్తాం.ఇది కవిత్వం అంటే ! ఇది సామాజిక దృక్కోణం అంటే!

వీరు రాసిన 'శతక శంఖారావం' ను ' స్త్రీ మనోహర శతకం ' అంటూ పది వారాలు ఈ .టీ.వీ. లో జొన్నవిత్తుల రామలింగేశ్వర శాస్త్రి చెప్పడం వీరి భావాలు ఎంత ఉన్నతంగా ఉన్నవో తెలుస్తుంది. లక్ష్మీ నరసింహ గారు 'సుందరకాండ' ను రాస్తున్నారు . ఇది ద్విపద కావ్యం. ఆధునిక కాలంలో ఇంత వరకు ఇలా రాలేదు . ద్విపద తేలికగా హృదయాల్లోకి చేరుతుంది . అందులోనూ మంజరీ ద్విపద కు యతులు , ప్రాసలు వంటి నియమాలు లేకుండా గాన యోగ్యంగా ఉంటుంది. ఆనాడు గోన బుద్ధారెడ్డి 'రంగనాథ రామాయణం ' తాళ్ళపాక తిమ్మక్క 'సుభద్రా కళ్యాణం ' గమనిస్తాం.

'కన్యా మేధం 'కవితలో ఛందోబద్ధం గా రాసినా సామాజిక స్పృహతో,

"ఎవ్వతెవీవు చెల్లి , సెలయేటిని బాసిన తమ్మి పువ్వుటుల్

ఇవ్విధి వాడిపోయితివి, యెవ్వరు మాట సూటిపోటి కాల్ రువ్వినవారు, కాపురము లో నుంచి నిప్పులు బోసినారు, వారెవ్వరో కాదు ఈ మనుషులే వరకట్న పిశాచుల కారణాలేమిటో చెబుతారు

వివాదాలు విషాద గీతాలై , వివాహ సంబంధాన్ని ఎట్లా విఘాతం చేస్తారో లక్ష్మీ నరసమ్మ గారు తమ కవిత్వం ద్వారా చెప్తూనే..

" ఓ మానవభ్యదయ మూర్తి సుకీర్తీ ! ఓ భారత ధర్మ వీర

ఓయీ ! వీర విద్యార్థి ! లేవోయి ! దీక్ష బూనవోయీ! కట్నంముట్టనను చూపు!" అంటూ అబ్బాయిలకు కూడా పిలుపునిచ్చారు .1980లలో ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి ప్రసారమైన కవిత!

చక్రవర్తుల లక్ష్మీ నరసింహ గారికి బెంగళూర్ ఇంటర్నేషనల్ కాలేజ్ వారు డాక్టర్ ఇచ్చారు. 'భద్రగిరి నానీలు ' అనేవి 120 నానీలు రాసారు. " సంప్రదాయ కవిత్వం వదిలి పెట్టని కవులు రాయడం గర్వకారణం " అన్నారు డాక్టర్ ఎన్. గోపి గారు.

దాదాపు 23 పుస్తకాలు రాసిన లక్ష్మీ నరసమ్మ గారు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.' ఆడపిల్ల' అనే కవితను తెలంగాణ ప్రభుత్వం , వెన్నెల 3 లో తరగతి వారికి పాఠ్య పుస్తకం లో పెట్టారు.

"జీవితపు సాన మీద అరిగిపోతున్న /పరిమళాలు వెదజల్లే/ మంచి గంధపు చెక్క" అంటూ వీరు రాసిన కవితను పద్యాంజలి లో విద్యార్థులకు అందివ్వడం ముదావహమైన విషయం. ఆడవాళ్లకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను స్పృశిస్తూ సామాజిక స్పృహ తో రాస్తూ చక్రవర్తుల లక్ష్మీ నర్సమ్మ గారు యువకలాలతో పోటీ పడ్తూ రాస్తున్నారు. కవిత్వ వారధి అవుతున్నారు. వారికి అభినందనలు తెలియజేస్తున్నాను.

**కవిత**

# సాక్షీభూతం

**వడ్ల సాయిలు చారి**
**మొబైల్ : 9676947064**

నేను బస్సెక్కి కిటికీ ప్రక్కన కూర్చున్నప్పుడల్లా...
మా బస్సు వేగానికంటే కూడా
భూత,వర్తమాన,భవిష్యత్ సంఘటనల
ఆలోచనాలోచనలు
మిక్కిలి వేగంగా పరుగెడుతూ ఉంటాయి
కొన్నేమో కళ్ళకు కట్టినట్లు!
తెరమీది సినిమా చూసినట్లు!
ఆనందం, ఆక్రోశం, ఆహ్లాదభరితం కలిగిస్తే
మరికొన్నేమో నన్ను ఉన్నచోటినుండి
ఎక్కడెక్కడికో? మోసుకెళ్తాయి
గాలి గమ్మత్తుగా పలకరిస్తుంది
మస్తిష్కంలో మెదిలేభావాలన్నీ
మంచుకురిసే వేళలో....పాట పాడుకున్నట్లు
పట్టుకుచ్చుల పువ్వొలే
దట్టంగా
నిండారా రంగును పులుముకుంటాయి
వానికినాకు ★కిటికీ ఎప్పుడూ★...
మధ్యలో నిలబడి మౌనంగా మాట్లాడుతూనే ఉంటుంది
నిజంగా ఈ కిటికీ ఎందరి మనుషుల
మౌనభాషకు సాక్షీభూతమో కదా!..

కథ

# "ఎన్ని మరణాలో... అన్ని జననాలు"



- రమాదేవి బాలబోయిన

విసురుగా బెడ్రూం లోకి వచ్చి తలుపేసుకుంది స్వప్నిక. ఆమె మనసు మండిపోతోంది. కోపం ఆనకట్టలు తెగిపోతున్న భావన. ఇన్నాళ్ళుగా కాదు,కాదు ఇన్నేళ్ళుగా తన ఆవేశానికి అడ్డుకట్ట వేసి ఆపిన కట్టుబాట్ల బంధనాలు, సాంప్రదాయాలు, స్వార్థబంధాలు, బంధుత్వాలు అన్నీ అన్నింటినీ తన కళ్ళల్లో కురుస్తున్న క్రోధాగ్నిలో కాల్చేసేయాలన్నంత కసిగా ఉందామెకు.

ఇన్నేళ్ళుగా తన మనసు గాయపడినప్పుడల్లా దుఃఖం కట్టలు తెగేది. రోజుల తరబడి ఏడ్చీఏడ్చీ ఆ కన్నీటిలో బాధ మరో సందర్భంలో రెట్టింపు బాధించేందుకు అప్పటికి కొద్దిగా చల్లారేది. కానీ ఓర్పుకూ, సహనానికీ ఒక హద్దు ఉంటుందని, సహిస్తూ పోతుంటే హింసించే వాళ్ళకు కొదవే ఉండదనీ,ఎదురుతిరగకపోతే అందరికీ లోకువేననీ ఆమెకు అనుభవపూర్వకంగా తెలిసిపోయిందిపుడు.

అందుకే తానూ ఈ ఓర్పనే బానిసత్వాన్ని, మనువాద పితృస్వామ్యపు సంకెళ్ళనీ తెంచుకోవాలనుకుంటోంది. అసలీ సంకెళ్లు తన జీవితాన్ని ఎలా నలిపేసాయో తలుచుకుంటుంటే ఆమె పిడికిళ్లు బిగుసుకుపోసాగాయి. తన జీవితాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నవారు మనసుకు చేసిన గాయాలు ఒక్కొక్కటిగా గుర్తుకురాసాగాయి.

★ ★ ★

ఐదేళ్ళ అందమైన స్వప్నిక అన్నం పళ్ళెం పట్టుకుని "అమ్మా! నేను అన్నం తినను. అన్నయ్యకేమో కూర వేసావు. నాకేమో పచ్చడినా?" చిన్నారి స్వప్నిక తల్లితో వాదులాడసాగింది.

"ఏంటే దీని పొగరు. తల్లివి కాస్త భయం-భక్తీ నేర్పవా దానికి. మగపిల్లాడు కాయాకష్టం చేయాల్సినోడు. వాడితో దానికి పోంతనేంటే. నోర్మూసుకుని పెట్టిందేదో తినమను" నాయనమ్మ గొంతు హబ్బ ఎంత కర్కశంగా పలికిందో. అంతే కసిగా చిన్నారి స్వప్నిక నాయనమ్మపై మాటల దాడి చేసింది.

తనవల్ల అమ్మను తిట్టిందనే ఉక్రోషంతో నాయనమ్మను ఎదిరించి మాట్లాడినందుకు కథలు కథలుగా, విడతలు విడతలుగా కంటికి కనబడ్డవారికెల్లా,ఇంటికొచ్చిన వారికెల్లా తల్లీబిడ్డలను చెడ్డచేసి చెప్పేదామె,అంతే....

ఆ రోజు మొదలు స్వప్నికకు "పెంకిపిల్ల", "మొండిఘటం" బిరుదులుగా వచ్చి చేరాయి.

పసితనపు అమాయకత్వంలో తెలిసీ తెలియక తాను మాట్లాడిన మాటలకు నాయనమ్మతో తిట్లు, చేసేపనులకు తండ్రి పెట్టే చిత్రవధలు తల్లికి బహుమానాలయ్యాయి. అవన్నీ చూసి ఆ చిన్నారి మనసు తనలోకి తానే ముడుచుకుపోతూ జీవం కోల్పోయేది. భయంభయంగా బితుకుబితుకుమంటూ తన ఇంట్లో తానే బానిసగా పడిఉండే అమ్మకు ప్రతిరూపంగా మారసాగింది.

స్వప్నికకు పదేళ్ళప్పుడు జరిగిందది...అవి బతుకమ్మ పండుగరోజులు. పదిరోజులు జరిగే ఆ పండుగంటే ఆడవాళ్ళకు చాలా సంబరం. ముఖ్యంగా ఏ పండుగకు తోలని అత్తగారోళ్ళు కూడా తల్లిగారొచ్చి పిలవగానే వాళ్ళవెంట పుట్టింటి దగ్గర అత్తింటి ప్రతిష్ట కనబడాలన్నట్లు ఖరీదైన బట్టలు, నగలు కొనిచ్చి పంపడం రివాజు. బతుకమ్మ సంబరం ఒకెత్తయితే చిన్ననాటి స్నేహితురాళ్ళకు తన జీవితం ఎంత ఆనందమయంగా ఉందో చూపించి ఆడవాళ్ళు పడే సంబరం ఒకెత్తు. అది దాబూదర్పం చూపించుకోవచ్చని కాదు గానీ, "చిన్నతనం నుండి కలిసి పెరిగిన మేము సంతోషంగా ఉన్నాం,మీరు కూడా ఉండాలి" అని కోరుకోవడం. "నా ప్రాణస్నేహితురాలు సంతోషంగా ఉంది"అనుకొంటూ మళ్ళీ వచ్చే సంవత్సరం దాకా ఆ చెలియకోసం ఎదురుచూడటం గొప్ప అనుభూతి. పదిరోజులు పదినిముషాల్లా గడిపి మరోయేటి దాకా ఆ అనుభూతి నెమరేసుకోవడం ఆడవారికొక బలం.

కానీ స్వప్నిక తల్లికి అలాంటి ఆనందం ఏనాడూ దక్కలేదు. పండక్కెళతానని అడిగినందుకు " ఏమ్... యేడాదికోమారు నువ్వెళ్ళకపోతే అక్కడ చచ్చిపోయే భగ్నప్రేమికుడెవడైనా ఉన్నాడా?"అంటూనో

"కనీసం పిల్లలకైనా కొత్తబట్టలు కుట్టిద్దామండీ" అని అన్నందుకు

"పండక్కి ప్రతీసారీ కొత్తబట్టలు కొనడానికి నువ్వు తెచ్చిన డబ్బులకట్టలేం ఇక్కడ మూలగడంలేదు" అంటూనో తాగీతాగీ కంపు పట్టిన నోటితో, అంతకంటే కంపు కొట్టే మాటలు తండ్రి అంటూంటే వినీవినీ చిన్నారి స్వప్నిక నలిగిపోయి నవ్వడమే మరిచిపోయేది.

పండక్కి ఒక్కగానొక్క కూతురికి బట్టలు కొనివ్వని తండ్రి పరువు నిలిపేందుకు తల్లి తన పెళ్ళి చీరతో లంగా జాకెట్టు కుట్టిస్తే ఎవరైనా గుర్తుపడతారేమోనని ఆ బట్టల్లోకే కూరుకుపోయేంత పీలగా మారి బలహీనంగా పెరగసాగింది.

వయసుకొచ్చిన రెండేళ్ళకు పదోతరగతి పరీక్షలయీ అవగానే

"ఒసేయ్! ఇగో నువ్వు చదివింది సాలుగనీ, పెళ్ళిచూపులు చూసుకునేందుకు మా చుట్టాలు, పిలగాని తరుపువాళ్ళు వస్తున్నారు. పోయి జల్ది తయారుగా" దడదడలాడించిన నాయనమ్మ మాటల తూటాలు ఆ క్షణం మొదలై, చూపులూ ,పెళ్ళి,అంపకాలు,అత్తగారిల్లు చేరడం దాకా బయటివారికి వినబడని నిశ్శబ్దశూలాల పోట్లయ్యాయి.

తనకీ, తల్లికీ భరించక తప్పలేదు. ఆఖరున."తల్లీ! నా మాటలతో నీ మనసు గాయపడుండొచ్చు కానీ, ఆడపిల్లను హద్దుల్లో ఉంచాలనే తపనతో, నీ జీవితం బాగుండాలి,నువ్వు సుఖంగా ఉండాలనేనే నేను కటువుగా ఉన్నాను" అంటూ అంతిమ తీర్పు ఇచ్చింది నాయనమ్మ. అటుతరువాత యేడాదిన్నరలో స్వప్నిక కడుపున పుట్టిన వంశాంకురాన్ని చూసి గానీ ఆమె పరలోక ప్రయాణం కట్టలేదు.

ఆమె ఖాళీ చేసిన దెప్పిపొడుపుల సింహాసనాన్ని స్వప్నిక అత్తగారూ,భర్తగారూ సమానంగా ఆక్రమించేసారు. అప్పటికే స్వప్నిక ఎముకలనంటిన చర్మంలో అక్కడక్కడా శ్వాసిస్తున్న గుర్తుగా నరాల కదలికలు కనబడేటంతంగా బలహీనంగా తయారయ్యింది.

పెళ్ళైయ్యాక అత్తారింటికి, పుట్టింటికి పెద్ద తేడా తెలియలేదు. కాకపోతే పుట్టింట్లో తనకోసం కన్నీరు కార్చే అశక్తురాలైన తల్లి ఉండేది అంతే.

ఇద్దరు పిల్లలు పుట్టాక స్వప్నిక దేహం మీద మోజు తీరిన భర్త ఎన్ని అడ్డదారులు తొక్కినా కిమ్మనకుండా ఉండటానికి చిన్నప్పటి నుండి తల్లి అనుభవంతో నేర్పిన పాఠాన్ని నిత్యం మననం చేసుకుంటూనే అతని దోపిడీకి రోజుకోసారి చచ్చిపోయేది స్వప్నిక.

జీవితంపై విసిగి వేసారిన ఆమె జీవితంలో సరిగ్గా తోడబుట్టిన వాడి పెళ్ళినాడే, ఇంకా ఇంట్లో కొత్తకోడలు అడుగు కూడా పెట్టకుండానే మరో చిచ్చు రేగింది.

"అదిగో,ఆమె పెళ్ళికొడుకు చెల్లెలుట, చూడబోతే టీబీ పేషంటులా ఉంది. ఆ ఇంట్లో ఉంటే మన అమ్మాయికి పుట్టబోయే పిల్లలకు ప్రమాదమే" చుట్టాలావిడెవరో వియ్యపురాలి చెవి కొరికారు. "చూసావా? వొంటి మీద నాలుగు తులాలైనా బంగారం లేదు. మనిషేమో తిండికి మొహం వాచిన దానిలా ఉంది.కొంపదీసి పుట్టింటి చూరు పట్టుకు వేలాడదు కదా...నిజంగానే అలా జరిగితే ఇక ఆ ఇంట్లో మానమ్మాయేం సుఖపడుతుందీ?" అంటూ చిచ్చుపెట్టారు వదినింటివారు. వాళ్ళు పదిమందిలో చేసిన అవమానంతో, స్వప్నికకు 'నేనెందుకు ఇలా రోజూ చావాలి,ఒక్కసారే చస్తే నరకం తప్పిపోతుంది' అని ఆవేశంతో చేసిన ఆత్మహత్యాప్రయత్నం ఆమె దేహాన్ని సగం కాల్చి అందవిహీనంగా మార్చేసి, ఆసుపత్రి పాలు చేసింది.

హాస్పిటల్లో ఉండగానే"పదిమందిలో మా ఇంటి పరువు తీసావు. అంతేగాక నీ భయంకరమైన రూపాన్ని చూస్తే పసిపిల్లలు భయపడతారు" అని అత్తింటి వారు ఇంటికి రావద్దొని చెప్పి ఆసుపత్రిలోనే వదిలేసి వెళ్ళిపోయారు.

పుట్టింటికి వెళితే పెద్ద ఒరిగేదేంలేదనే వాస్తవాన్ని దిగమింగలేకపోయింది. తన గమ్యం ఏమిటో నిర్ధారించుకోలేకపోయింది స్వప్నిక. టిక్కెట్ తీసుకోవడానికి కూడా డబ్బులు లేక ఎలాగో ధైర్యం చేసి కనబడిన రైలు ఎక్కింది. కానీ టిక్కెట్ లేని రైలు ప్రయాణం ఆమెను జైలు పాలు చేసింది.

కోర్టులో హాజరు పరిచిన రోజు "చూడమ్మా, టిక్కెట్ లేకుండా ప్రయాణం చేయడం నువ్వు చేసిన నేరం. మీ వాళ్ళెవరో అడ్రస్ చెప్పు.వాళ్ళకు సమాచారం అందిస్తాం. వాళ్ళు వచ్చి విడిపించి తీసుకుపోయే దాకా నువ్వు జైల్లో ఉండాల్సిందే" అన్నాడు జడ్జి.

"ఆహా, ఈ జడ్జిమెంట్ ఎంత హాయిగా ఉంది. ఇన్నాళ్ళకు నాకు ఇంటినుండి స్వేచ్ఛ లభించింది" అనుకుని

లోలోన సంతోష పడింది స్వప్నిక. జైల్లోనే ఉండిపోవాలని నిశ్చయించుకుని తనకెవరూ లేరని అబద్ధం చెప్పింది.

అణుకువగా ఉండే స్వప్నికను జైలులో తోటి ఖైదీలు ఆదరించారు. ఆమె దీనగాథ విన్న లేడీ జైలర్ "సంయుక్త" స్వప్నికను జైలు నుంచి విడిపించి ప్రేమగా చేరదీసింది. ధైర్యం నూరిపోసి తన కాళ్ళమీద తాను నిలబడగలిగేలా తీర్చిదిద్దింది. వైద్యం చేయించింది. ఆమెలోని తెలివిని గుర్తించి చదివించింది. సొంతంగా ఉద్యోగపోటీ పరీక్ష ఫీజులు కట్టించి రాయించింది. కొన్ని నెలలు గడిచిపోయాయి.

ఒకరోజు హడావిడిగా "స్వప్నికా! నా బంగారు తల్లీ! నీకు ఉద్యోగం వచ్చిందమ్మా. నీ భవిష్యత్తు మారిపోబోతోంది" ఆనందంగా చెబుతున్న జైలర్ సంయుక్త ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. స్వప్నికను కూతురిలా అక్కునచేర్చుకున్న ఆమె గుండె ఆనందంతో ఆగిపోయింది. "అమ్మా, అమ్మా" అంటూ దుఃఖించిన స్వప్నిక తో పాటు తన ఇద్దరు బిడ్డలనూ అనాధలను చేసి అంబరవీధిని చేరింది.

స్వప్నిక ఉద్యోగంలో చేరినరోజే స్వప్నికకు ఒక నోటీసు వచ్చింది.

"తల్లి చనిపోయినందువల్ల నా ఇద్దరు కూతుళ్లు తండ్రిగా నా వద్దనే పెరగాలి. దీనికి భిన్నంగా ఎవరు ప్రవర్తించినా పిల్లలకిడ్నాప్ కేసు పెడతాను" అనేది నోటీసు సారాంశం.

అది చదివిన స్వప్నిక తనకు తెలిసిన లాయర్లను కలిసింది. "లాయరు గారూ! భర్త దుర్మార్గుడని తెలిసే జైలరు మేడం భర్త నుండి విడిపోయారు. కానీ చట్టపరంగా విడాకులు ఇంకా మంజూరు కాలేదు. ఇప్పుడామె లేరు. ఏ దుర్మార్గుడి నుండైతే పిల్లల్ని దూరం పెట్టాలనుకుందో అతనికే చూస్తూ, చూస్తూ ఎలా అప్పగించాలి. మీరే ఎలాగైనా న్యాయం చేయండి" ప్రాధేయపడింది

కానీ లాభం లేకపోయింది."కన్న పిల్లలపై హక్కులు కన్న వారికే తప్ప వేరెవరికీ ఉండవు. దత్తత కూడా తీసుకున్నట్లుగా లేదు కనుక...పిల్లల మైనారిటీ తీరనందున తండ్రికి అప్పగించాల్సిందే" అని తేల్చి చెప్పారు లాయర్లు.

పసిపిల్లలను అలా వదిలేయలేక,

కసాయివాడికి బలి చేయలేక, అంతకుమించి చేసేదేమీలేక పిల్లల కోసం అతని డిమాండ్స్ కి తలొగ్గింది. మనసు చంపుకుని అతనికి భార్యగా మారింది.

అప్పటిదాకా "అక్కా!" అని పిలిచి అకస్మాత్తుగా స్వప్నికకు 'అమ్మ' స్థానాన్నివ్వలేక క్షోభ పడ్డారు పిల్లలిద్దరూ. వారికి భవిష్యత్తు గురించి అన్నీ విడమరిచి చెప్పి వారి బాగోగులు చూసుకుంటు బ్రతుకుదామనుకుంది.

కానీ, పనీపాటా చేయక పరాన్నభుక్కులా మారిన "భర్త అనేవాడి" చిత్రహింసలు భరిస్తూ, ఉద్యోగం నిలుపుకునేందుకు, పురోగతి సాధించేందుకు నానా తంటాలు పడింది స్వప్నిక. క్లర్కుస్థాయినుండి ఆఫీసర్ స్థాయికి ఎదిగింది. దయలేని కాలం తన దారిన తాను పరిగెత్తుతూనే ఉంది. పిల్లలు మేజర్లయ్యారు. అయితే తండ్రి చెప్పుడు మాటలతో వారిలో స్వప్నిక పట్ల రోజురోజుకూ విముఖత ఏర్పడింది. ఒకరకంగా తమ తల్లి చావుకు కారణం,తండ్రి తాగుడు వ్యసనానికి కారణం స్వప్నికనే అనే భావం వారిలో బలపడింది.

ఒకరోజు ఆఫీస్ నుండి తిరిగొచ్చిన స్వప్నికతో "నాకు క్యాంపస్ సెలెక్షన్లో బెంగుళూరు కంపెనీలో జాబ్ వచ్చింది. వచ్చే వారమే జాయిన్ అవమన్నారు. కానీ నేను రేపే వెళ్ళిపోతున్నాను. ఇకపై ఇక్కడికి రాను. నువ్వు గానీ,నువ్వు కొంగున ముడేసుకున్న నీ మొగుడు గానీ నా దగ్గరకు రావద్దు" గోడకు ఫుట్బాల్ తో బడా బడా బాదుతున్నంత కటువుగా గుండెకు మాటలను విసురుతూ చెప్పింది పెద్ద అమ్మాయి.

పక్క గదిలోంచి వచ్చి

"ఇదిగో,విను నేను యంఎల్ఎ కొడుకుని గుళ్ళో పెళ్ళి చేసుకున్నాను...రేపటినుండి ఈ ఇంటికి రాను.నువ్వూ, మా అమ్మ మొగుడుతో కలిసి ఇక్కడే సుఖంగా ఉండు."అని నిర్లక్ష్యంగా తమ పెళ్ళి ఫోటోలు స్వప్నిక మొహాన కొట్టి తన గదిలోకి వెళ్ళిపోయింది చిన్న అమ్మాయి.

స్వప్నిక గుండె ముక్కలుముక్కలైపోతున్న బాధ ,బాధ కన్నా అవమానం,అవమానం కన్నా త్యాగాన్ని గుర్తించని అభాండాలు భరించలేక తలకొట్టుకుంటూ మోకాళ్ళపై కూర్చుని ఏడ్చీ ఏడ్చీ ఆ రాత్రి అంతా కాళరాత్రిలా గడిపింది.

మరునాటి ఉదయం నిశ్శబ్దంగా ఉన్న ఇల్లు. హాల్లో నేలపై పడుకొని ఉండిపోయిన స్వప్నిక. ఇంతలో టక్టక్ మంటూ తలుపు చప్పుడైంది. "అమ్మా! పోస్ట్" ... పోస్ట్ మాన్ కేక వినబడింది. ఒంట్లో సత్తువ లేకపోయినా లేచి వెళ్ళింది. ఏవో రెండు కవర్లు ఇచ్చి సంతకం తీసుకున్నాడతడు.

స్వప్నిక పేరు మీదనే వచ్చాయవి.

తెరిచి చూసిన ఆమె అదిరిపడింది. ఒకటి పదిహేనేళ్ళ తరువాత అకస్మాత్తుగా తాను గుర్తొచ్చినట్లు తన మొదటి భర్త

పంపిన లాయర్ నోటీసు. " తన ఇంట్లో ధనం దొంగిలించి, తనను మోసం చేసి, ఇంట్లోనుండి పారిపోయిందనీ, విడాకులు తీసుకోకుండానే తననుండి వెళ్ళిపోయిన ఏడాదిలోపే మరో వ్యక్తి ని పెళ్ళాడింది" నోటీసులో తనపైన వేసిన అనేక నేరాలకు సాక్ష్యాలుగా చేసిన సాక్షుల సంతకాలను చూసి అదిరిపడింది. అవి తన తండ్రి మరియు తోడబుట్టినోడివి.

రెండవ కవరు తన పైఆఫీసర్ నుండి వచ్చింది. అందులో జైలరు సంయుక్త భర్తా,పిల్లలు కలిసి తనపై పెట్టిన కేసు తాలూకు పేపర్లు మరియు అవి ఆర్నెళ్ళలో పరిష్కరించుకోలేకపోతే శాశ్వతంగా డిస్మిస్ కావాల్సుటుందని పంపిన లెటరు ఉన్నాయి.

★ ★ ★

గతంలోంచి వర్తమానంలోకి వచ్చినా గాయాలసలుపులు తగ్గలేదు స్వప్నికకు. ఎవరితో బాధలు పడిందో, ఎవరికోసం వేదనలసముద్రాన్ని ఈదిందో అర్థం చేసుకోలేని వాళ్ళకోసం పూర్తి జీవితాన్ని ఫణంగా పెట్టిన తనపై తనకు విపరీతమైన జాలి కలిగింది. ఏ పరమార్థమూ లేకుండా బతుకు ముగించకూడదనేమో తనకీ ఎదురుతాకిడి అని అర్థం చేసుకుంది.

తనకు తానే ధైర్యం తెచ్చుకుని సమస్యలను ఎదుర్కొనేందుకు సిద్దమైంది.

★ ★ ★

మూడుసంవత్సరకాలం గడిచింది.

ఎన్నో ఆటంకాలను అధిగమించిన తరువాత తాను ప్రారంభించిన '"సంయుక్త" మహిళాసాధికార సంస్థ' వేదికపై అధ్యక్ష స్థానంలో కూర్చుని ఉంది స్వప్నిక. సభ జరుగుతుండగా ఆమెకు ఒక ఫోన్ కాల్ వచ్చింది. దాని సారాంశం "మేడం మీ జీవితం పై వచ్చిన పుస్తకాన్ని చదివాము. మీరు అనుమతిస్తే మీ జీవితం ఎంతోమందికి ప్రేరణ కావాలనే ఉద్దేశ్యంతో మీకు మా సంస్థ తరుపున "విల్ పవర్డ్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్" అవార్డు రాష్ట్రపతి గారి చేతులమీదుగా ఇప్పిస్తూ మీ సంస్థకు ఐదులక్షలరూపాయలు విరాళంగా ఇద్దామనుకుంటున్నాము" అని.

ఆనందంగా అదే వేదికపై స్వప్నిక బాధిత మహిళాలోకానికి ఆ అవార్డును అంకితమిచ్చేసింది. 'ఆమెకు ఎన్ని మరణాలు సంభవించినా మరింత కొత్తగా జన్మిస్తుంది' అని నిరూపించింది.

కవిత

# ఆమె



- స్వప్న మేకల
ఫోన్ : 9052221870

ఆకాశమంత మనసులో
అనంతమైన ఆలోచనలు విహరిస్తున్న
అంతులేని ప్రేమని అందించాలనే ఆరాటంతో
సుప్రభాత సేవతో మొదలై
కాఫీ కప్పుతో సేవకురాలవుతుంది ..!!
కట్టుకున్న వాడు కట్టుబాట్లతో కట్టడి చేసిన
అత్తింటి వారు కట్నకానుకలు ఇవ్వలేదని
హేళన చేసిన
ఆడపడుచులు సూటి పోటీ మాటలు
సుతి మెత్తగా గిల్లిన
కన్నపిల్లలు రెక్కలొచ్చి ఎగిరిపోయిన
కంటినిండా కునుకులేని రాత్రులెన్ని గడిపిన
ఎవరికీ పట్టని కనుల వ్యథ ..!!
ఎదలో సెగలెన్ని రేగిన
ఎడబాటులో దిక్కుల రాయబారాన్ని మోస్తూ
అప్యాయత రాగాలనే పలికిస్తూ
నడవడకిలో అణుకువనే అడుగులేస్తూ
చీదరించిన మోములపై ఓ నవ్వును విసిరేస్తూ
గుండె గుడిలో బాధల తాళాలతో ఎప్పటికప్పుడు
బంధిస్తుంది ..తనకేమి తెలియనట్టుగా ..!!
కరిగిపోయే జీవితం కర్పూరమయిన
వెలుగు నీడల హారతులే ..
అలసిన మనసుకు ఆశలే లేనట్లు
ఆరాధన భావమే అమ్మ నేర్పిన
తొలి సూత్రమంటూ ..
రోధించిన వేధించిన
శోధించిన ఆమె ..ఆమెనే
ఆ నవ్వులకు వెన్నెల సాటి..
ఆ వెన్నెలకు ఏది రాదు పోటీ ...!!

# నడిమంత్రపు పొద్దు



సరోజన బోయిని

స్త్రీ జీవితం అంటే ఎన్నో వ్యధలతో కూడిన కన్నీటి గాథలే. ఇలా అందరి జీవితాల్లో ఉండక పోవచ్చు. కానీ కొందరి వేదన మాటలతో చెప్పలేనిది. కన్నీళ్లు మాత్రమే ఓదార్చే కష్టాలు వాళ్ళవి. దీనికి కారణం పేదరికం ఒకటి అయితే ఇంకో కారణం నిరక్షరాస్యత ఎక్కువ చదువుకోక పోవడం. సమాజంలో ఆడవాళ్లను అవమానించడం, అణిచివేత ధోరణే ఎక్కువ. ఆడవాళ్లు పెద్దగా చదువుకోక పోవడం వల్ల , సమాజంలో కలిసి తిరుగకపోవడం వల్ల , వాళ్ళ మీద వాళ్ళే నమ్మకాన్ని కోల్పోతున్నారు. ఆదాయ సముపార్జనలో ఇతరులపై ఆధారపడటం . ఆడవాళ్లు అంటే ఇంటికి,వంటకే పరిమితం అన్నట్టు వుండటం. కానీ కాలక్రమేణా వచ్చిన మార్పు స్త్రీలో ఆత్మ స్తైర్యం పెంచి ఒక్క అడుగు ముందుకు వేసేలా చేసినప్పటికీ అడుగడుగునా ఎన్నో అవాంతరాలు ఆడపిల్ల అనే వివక్ష ఇంకా తనని ఆంక్షల వలయం లో బంధించాలనే చూస్తుంది.

తన వ్యక్తిత్వాన్ని చంపుకొని ఈ బానిస బ్రతుకులు ఎన్నాళ్ళు అని ధిక్కార స్వరం తో ప్రశ్నించే గొంతుకలు పెద్ద ఎత్తున లేక సామజిక మార్పును తీసుకరాలేకపోతున్నాయి.

అలాంటి మార్పు తీసుక వచ్చిన ఓ సంఘటనే ఈ చిన్ని కథ.

★ ★ ★

ఇక కథలోకి వస్తే మాది ఒక చిన్న పల్లెటూరు. నేను ఒక క్షేత్ర స్థాయి అంగన్వాడీ ఉద్యోగిని. ఆట, పాటలతో కూడిన విద్యతో పాటు మా బడిలో – గర్భిణీ, బాలింత స్త్రీల సంరక్షణ బాధ్యత. వారికి ఒక పూట పౌష్టికాహారం అందించడంతో పాటు వారికి ఆరోగ్య తనిఖీలు చేయచడం గృహ సందర్శన లో వారు సమతుల ఆహారం తీసుకుంటున్నారా, బిడ్డకు తల్లి పాలే ఇస్తున్నారా , వారి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటున్నారా లేదా అని చూసి వారికి తగిన అవగాహన కలిగించడం. బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం అని చెపూ్త బిడ్డకు ఎప్పుడెప్పుడు వ్యాక్సిన్ పడతాయో దగ్గరుండి వేయించి .., బిడ్డ బరువు,ఎత్తు కొలతలు చూసి బిడ్డ బలంగా ఉందా బలహీనంగా ఉందా వారికి చెపూ్త వారికి తగిన జాగ్రత్తలు చెప్పడం.

వీటన్నిటి తో పాటు మాకు ఇంకా కొన్ని అధనపు బాధ్యతలు కూడ ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా బాల్యవివాహాలను అడ్డుకోవడం. వారికి కౌన్సిలింగ్ చేయడం. ఎవరైనా అనాధ పిల్లలు ఉంటే మా సి.డి.పి.ఓ.మేడం కు సమాచారం అందిస్తే వాళ్ళు ఆ పిల్లలను తీసుకెళ్లి బాలసదన్ కు అప్పజెప్పుతారు.అలాంటి పిల్లలను ఎవరన్నా దత్తత తీసుకుంటా అన్న వాళ్ళకి చట్ట పరంగా దత్తత ఇస్తారు.

ఇగ ఎప్పటి లాగే ఉదయం నేను బడికి వెళ్లిన ఆ రోజు . కొద్ది సేపటికే మా సి.డి.పి.ఓ. మేడం ఫోన్ చేశారు. " అమ్మ మీ అంగన్వాడీ కేంద్రానికి నేను వస్తున్న.మీ పక్క ఊరికి వెళ్ళాలి ఓ కేసు విషయమై."

మా మేడం అలా చెప్పగానే నాకు కొంచెం భయం వేసింది. ఏం కేసు పక్క ఊరి గురించి నన్ను రమ్మంటున్నారు ఏంటా అని. కాని తరువాత గుర్తు వచ్చింది పక్క ఊరి అంగన్వాడీ టీచర్ సెలవులో ఉంది అని . (ప్రసవం కోసం తన తల్లి గారి ఇంటికి వెళ్ళింది). కాబట్టి ఇన్చార్చ్ నాకు ఇచ్చారు . ఇంత వరకు బాగానే వుంది. కానీ ఏం కేసు ఎందుకొరకు మేడం ఇంత హడావిడిగా వస్తున్నారు?ఏదన్నా సీరియస్ విషయమా ? నా బుర్రలో టెన్షన్ కూడిన ఆలోచనలు ఎన్నో..,.

ఏం జరిగింది మేడం అని ఫోన్ లోనే అడుగుదాం అనుకున్న కాని భయమేసి ఊరుకున్న.కొద్ది సేపటి వరకు మా సూపర్ వైజర్ మేడం మరియు సి.డి.పి.ఓ. మేడం వచ్చారు.

"రా అమ్మ ! తొందరగా వచ్చి కార్ ఎక్కు మనం అర్జంట్ గా వెళ్ళాలి " మా మేడం అలా అనగానే వెళ్లి కార్ లో కూర్చున్న.. అడగాలని ఉన్న భయపడుతున్న.అది గ్రహించిన మా మేడం "నీ సందేహం నా అర్థం అయింది అమ్మా.. నీకు ముందే విషయం చెప్పాలి కానీ సమయం లేక అప్పుడు చెప్పలే వెళ్ళే దారిలో చెబుదాం అని ఊరుకున్న."

" ఏం లేదమ్మ ! మీ పక్క ఊరిలో ఒక అమ్మాయి ఆత్మహత్య

చేసుకుంది అని సమాచారం అందింది.ఆ అమ్మాయిది బాల్య వివాహం. మీరు డ్యూటీ చేస్తున్నప్పుడు మీ ఊరి తో పాటు పక్క ఊరిలో ఇలాంటివి జరిగి నప్పుడు తప్పకుండ మాకు సమాచారం అందించాలి. ఆ ఊరిలో అంగన్వాడీ టీచర్ సెలవులో ఉండడం వల్ల అక్కడ బాల్య వివాహం గురించి మాకు సమాచారం అందలేదు. ఒకవేళ ముందే సమాచారం అందుతే వారికి తగిన కౌన్సిలింగ్ ఇచ్చి ఆ పెళ్లి ఆపే వాళ్ళం.ఇప్పుడు ఇంత అనర్థం జరిగి ఉండేది కాదు. నిండు ప్రాణం పొయ్యేది కాదు."

మేడం కొంచెం కోపంగానే చెప్తున్న గానీ ఆ ఆవేధన అర్థం అయ్యింది నాకు. కానీ ఇక్కడ ఎవ్వరి తప్పు లేదు ఆ ఊరిలో అంగన్వాడీ టీచర్ సెలవులో ఉంది కాబట్టి మా మేడం ఎవరిని తప్పు పట్టలే కానీ జరిగిన సంఘటన గురించి తనూ మేము అందరం చాల బాధ పడ్డాం.

మా మేడమే మళ్ళీ ఒకసారి కోపంగానే – " మీరు ఊరిలో తల్లి తండ్రులకు బాల్య వివాహలపై అవగాహన కల్పించాలమ్మ. వాటి వల్ల ఎన్ని అనర్థాలో వివరించాలి.చిన్న తనం లో పెళ్లి చేయడం వల్ల మానసికంగా,శారీకంగా ఆ పిల్లలు పడే బాధను వివరించాలి. చిన్నతనం లో కాన్పు దాని వల్ల ప్రమాదాల గురించి వివరించాలి. రక్త హీనత తో తల్లి ,బిడ్డకు ప్రమాదం కూడ ఉండచ్చు. అదే కాక చిన్నతనం లో తల్లి కావడం మానసిక ఎదుగుదల లేని ఆ అమ్మాయి బిడ్డను ఎలా పెంచగలదు.ఇవన్నీ మీరు వాళ్లకు అవగాహన కలిగించాలి." అని అన్నది .

"అయ్యో! తప్పకుండ మేడం.మేము వాళ్ళకి బాల్య వివాహాలు గురించి అవగాహన సదస్సును నిర్వహిస్తున్నాం.వాళ్లకు ఏదో మీటింగ్ పెట్టి చెప్పనట్టు కాకుండ ఇంట్లో వాళ్ళు ఎలాగైతే చెప్తారో అలాగే వాళ్ళందరిని కూర్చో బెట్టి అన్ని విషయాలు క్షుణ్ణంగా చర్చిస్తున్నాం. " అని కొద్ది సేపు ఆగాను నేను. మా మేడమ్ ఏమైనా అంటుందేమోనని చూసిన. కానీ ఒక జరగకూడని సంఘటన జరిగిపోయింది అనే భాధ ఆమెని వీడటం లేదు. మళ్లీ నేనే – " కానీ మేడం మేము ఎంత ప్రయత్నం చేసినా ఎవరో ఒకరు మా మాటలు పట్టించు కోకుండ ఇలాంటివి చేస్తున్నారు. దానికి కారణం వాళ్లలో వుండే నిరక్షరాస్యత ఒకటైతే ఆడ పిల్ల అంటే బరువు అని భావించే వాళ్ళు కొంత మంది.పేదరికం రోజు,రోజుకి కట్నాలు పెరిగి పోతున్నాయి ఉన్నంతల త్వరగా పెళ్లి చేసి పంపాలి అనే ఆలోచన. ఆడపిల్లకు చదువు ఎందుకు అనే మూర్ఖపు ధోరణి.ఇలాంటివి పల్లెలో ఎక్కువ జరగడానికి కారణం అవుతున్నాయి మేడం."

మేడమ్ తల ఊపుతుంది .

"ఒకవేళ మాకు తెలియకుండ జాగ్రత్త పడి చేసిన అది పెళ్లి రోజు మాకు తెలిసిన ఒక పేద కుటుంబం పెళ్లి కోసం అంత ఖర్చు చేసి,పెళ్లి పీటల మీద అమ్మాయి పెళ్లి ఆగి పోతే ఆ అమ్మాయి జీవితం ఏం కావాలి అని.మా నోరు మూపిస్తున్నారు. అయిన కూడ మా విధి నిర్వాహణ మీకు సమాచారం అందించే లోపే పెళ్లిళ్లు అయిపోతున్నాయి"

మేము ఇలా చర్చించుకుంటానే ఆ ఊరికి రానే అచ్చినం. వాళ్ళ ఇంటి ముందు కార్ ఆగింది.మేము అందరం దిగినం. డ్రైవర్ కార్ తీసుకొని వేరే దగ్గర పార్క్ చేయడానికి వెళ్లిండు.

ఇంటి ముందు టెంట్ వేసి ఉంది.ఇంట్లో నుండి రోదనలు వినిపిస్తున్నాయి. అది ఓ!చిన్న గుడిసె లోపల కోర్చోడానికి కూడ స్థలం లేదు.అక్కడ పక్కన ఉన్న అబ్బాయికి చెప్పిన "మేడం వాళ్ళకి కుర్చీలు తెచ్చి వెయ్యి ఇక్కడ పందిరి కింద కూర్చుంటారు.అలాగే వెళ్లి ఆ అమ్మను బయటకు పిలువు.సి.డి.పి.ఓ.మేడం వచ్చారు అని."

"మీరు నాకు తెలుసు అక్క కానీ గా మేడం ను నేను ఎప్పుడు సూడలే.పెద్ద మేడమా..? " ఆ అబ్బాయి .

"ఆ..అవును! నువ్వెళ్ళి ముందు కుర్చీలుతే." అలాగే అని ఆ అబ్బాయి కుర్చీలు తెచ్చి అందరికి వేసి లోపలికి వెళ్లిండు.

"ఓ!పెద్దవ్వ నీ కోసం ఎవరో పెద్ద మేడం అచ్చిందంట బయటకు రాయే. " అని పిలిసిండు.

మా మేడం " కుర్చీ వద్దమ్మ అందరం తనతో పాటు కిందనే కూర్చుందాం అన్నారు."

"సరే మేడం ! " అని అందరం కిందనే కూర్చున్నాం ఇంతలో ఆ అబ్బాయి మా పెద్దవ్వనే అక్క! పేరు కనుకవ్వ " అని చెప్పి అక్కడే ఉన్న వాళ్ల నాన్న కూడ తీసుకు వచ్చాడు.

ఇంతలో కనుకవ్వ ఏడుసుకుంట గుడిసె బయటికి వచ్చింది. మా మేడంకు నమస్కారం చేసుకుంటూ " నా బిడ్డ నా కుడుపుల గిట్ల సిచ్చు పెడుతాదనుకోలే అమ్మా!నా బిడ్డ కోసం ఎవరెవరో పెద్ద,పెదోళ్ళు అచ్చి మందలిచ్చి పోతండ్రు. ఇగ గొంత మంది మా మీద కేసు అయితది అని బయపెడుతండ్రు. మాకేం దోత్త లేదు..అమ్మా!నా బిడ్డ సచ్చినందుకు ఏడ్సుడో, అచ్చి,పోయేటోళ్ల కోసం ఏడ్సుడో.." అని ఏడుస్తుంది.

మా మేడం మెల్లగా ఆమెను సముదాయిస్తూ – "ఊరుకో

తల్లి! నీ పేరు చెప్పు ముందు“ అని అడిగింది. “నా పేరు కనుకవ్వ“ అని చెప్పింది తను. “చూడు కనుకవ్వ ముందు నువ్వు ఏడ్వకు ఊరుకో“ అని తనని ఓదార్చి, తరువాత మెల్లగా “మేము అడిగిన దానికి సమాదానం చెప్పు అంతే“ అని చెప్పింది.

“ఇపుడు చెప్పు అమ్మా ! నీ బిడ్డ ఎట్లా చనిపోయింది?”

“అత్తగారి ఇంటి కాడికెల్లి మొన్ననే తొలుకచ్చినం రెండు దినాలు అయ్యింది గంతే. అయిల్ల మాతోని మంచిగానే ముచ్చట వెట్టింది.బువ్వ తిని అందరం నిర్ద పోయినం ఏగిలి వారంగా సప్పుడు అయిన వోలె నేను లేసిన”

“నా బిడ్డ.! ఎందుకు లేసినవే అవ్వా“ అంది. “అలికిరి అయిన వోలె లేసిన బిడ్డ అన్నా..“ “నువ్వు నిర్ద పోయే నేను సెంబట్కా పోయత్తా.” అని నా బిడ్డ అన్నవోలే బాగ దూరం పోకు బిడ్డ సీకటి అని మల్ల నేను నిర్ద పోయిన. సాన సేపు అయిన నా బిడ్డ రాకపోయే సరికి ఇంకా అత్తలేదు ఎందని నా సిన్న బిడ్డను లేపిన. పక్కపొంటి ఉన్న మా మరిదిని,యారాలును లేపి ఇంటెనుక పెరట్ల అంత గాలిచ్చినం ఎక్కడ కనవడలేదు. మోటబాయి కాడికి పొయ్యి సూసినం. అది ఎనకటి బాయి.గది ఇప్పుడు మేము వాడుతనే లేము.గా బాయికాడ నా బిడ్డ సెప్పు కనవడ్డ వోలె బాయిల సూసినం. గప్పడికే నా బిడ్డ పానాలు పోయినయ్ అని ఏడ్సుకుంటా చెప్పింది.”

“హ్మ్మ!మరీ నీ బిడ్డ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నట్టు. మీరేమన్నా ఆమెను అన్నారా? అత్తింటి వేధింపులు ఏమన్నా ఉన్నాయా?”

“మేము నా బిడ్డను ఏమ్ అనలేదు అమ్మా! అత్తగారు గూడ మంచిగానే సూసుకున్నారు.నా బిడ్డకు సక్కగా క్యాల్లి లేకపోవు గందుకే గట్ల సేసుకున్నది “ అని సెప్పింది.

“హ్మ్మ! సరే గాని కనుకవ్వా నీ బిడ్డకు పెళ్లి అప్పుడు వయస్సు ఎంత నువ్వు సిన్న పిల్లకు పెళ్లి చేసినవ్ అందుకే ఇట్లా జరిగింది అంటున్నారు గా మీ ఊళ్ళో వాళ్ళు.”

“ఏ..గాల్లకేం ఎరుక నా బిడ్డకు ఈడు అచ్చినంకనే లగ్గం సేసిన.” అని చెప్పగానే పక్కన ఉన్న వాళ్ల మరిది “మీతో ఎవరు చెప్పారు మేడం అది అంత అబద్ధం. మా పిల్లకు ఏండ్లు నిండినాకనే తన ఇష్టం తోనే పెళ్లి చేసినం “ ఆ మనిషి కొంచెం ఇంగ్లీష్ లో మధ్య,మధ్య మాట్లాడుతూ వున్నాడు.” మా మేడం “నువ్వు చదువుకున్నావ బాబు ? “ అని అడిగింది ఇందాక అబ్బాయిని. “ హా ..10 దాక చదువుకున్న.”

వీళ్ళు చెప్పేది అంతా వింటున్న వాళ్ల చిన్న కూతురు ఏడుస్తూ ఒక్కసారిగా గుడిసె లోనుండి బయటకు వచ్చింది.

“మేడం వీళ్ళు చెప్పేది అంత అబద్ధం. నేను చెప్తా అసలు విషయం.” ఆ పిల్ల అట్లా అనగానే వాల్ల తల్లి వారించింది.

“ఓ!పోరి నీకేం తెల్వద్ నువు లోపటికీ పో “ అని. “నేను పోనవ్వ రేపు అక్క లెక్క నా బతుకు కావద్దు. ఈళ్లకు అసలు ఇషయం సెప్తా..నువ్వు వూకో..”

“మేడం మా వొళ్ళు బయపడుతుండ్రు.మీరచ్చే ముందే మేడాలు అత్తండ్రు నువ్వు సిన్న పిల్లకు లగ్గం సేసినవ్ అంటే జైల్ల ఏత్తరు అని బయపెట్టించిండ్రు.గందుకే భయపడి నిజం సెప్త లేదు “

“మా బాపు మా సిన్నప్పుడే సచ్చిపోయిండు.గప్పటి నుండి మా అవ్వనే కూలి పని సేసి మమ్ముల సాదుకుంటుంది. కొన్ని గొర్లు ఉంటే మా సిన్న బాపు కాసుకత్తండు. మా అక్క పదో తరగతి కాగానే మా సుట్టపొల్లు సూసి నీ బిడ్డకు లగ్గం సేత్తవా నా కొడుక్కి సేసుకుంటా అని అడిగిండ్రు కట్నం ఎక్కువ పొయ్యకుంట మాయే మాకు పిల్ల నచ్చింది అన్నరు. మా అవ్వ కట్నం తక్కువ అనంగానే పెళ్లి కి ఒప్పుకుంది. మా బావ, మా అక్కకన్న సాన పెద్ద. సదువు లేదు, నౌకరి లేదు,ఇంత భూమి ,జాగ ఉంది.ఇన్ని టికి గొర్లు ఉన్నాయి గంతే. అవి సూసి మా అవ్వ లగ్గానికి ఒప్పుకుంది. మా అక్క నాకు లగ్గం అద్దు నేను ఇంకా సదువు కుంటా అని ఎంత ఏడిసిన ఇనలే.” “మొగ తోడు లేని సంసారం జెప్పన మీ లగ్గాలు సేత్తే నా బరువు దిగుద్ది బిడ్డా! నీ ఎనుక ఇంకా నీ సెల్లె కూడ వుండే.ఈడు అచ్చిన ఆడి పోరాగాండ్లను ఇంట్ల వెట్టుకొని సదివిపిత్తే రేపు మంచి అయిన సెడు అయిన నలుగురిల నవ్వుల పాలు అయితం బిడ్డా అని బుదరకిచ్చింది.” “ఇగ మా అక్క లగ్గం అయ్యింది మొదలు .అత్తా, ఆడి బిడ్డ పోరు.లగ్గం ల పొసే కట్నం మా అవ్వ మా దగ్గర ఎళ్లక ఇంకా ఇయ్యలే.గది మనసుల పెట్టుకొని గులిపిచ్చుడు.ఇంటెడు సారగం ఒక్కదానితోనే సేపిచ్చుడు. ఇగ మా అక్కను అయితే సదువుకున్న పొల్ల అని సూడకుండ మన్నెం తీసుక పోయిండు మా బావ. గొర్ల మందను తోలుకొని ఊరు,ఊర తిరుగుకుంటా ఎక్కడ మంద వెడితే గక్కడనే ఉండుడు. పొద్దంత గొర్ల ఎంబడి కాలు బట్టకుండ జంగల తిరిగి మాపటేళ్లకు మందకాడికి తోలు కచ్చి గాడనే ఓ!కునుకు తీసుడు. కడుపు నిండ తిండి ఉండది, కంటి నిండ నిద్ర ఉండది. ఏ పొలంల మంద వెడితే గాడనే ఇంత వుడేసుకొని తినుడు.నాతిరి పురుగో, భుషో అని సగం గుబులుకే సచ్చుడాయే. గిప్పడి దాక మేము కైకిలికే

పోలె బడికి పోవుడు ఇంటికి అచ్చుడు గంతే తెలుసు మాకు. గసొంటి దాన్ని గియ్యన్ని సెప్తే సెయ్యలేక పోయింది. పోయిన సారి తొలుకచ్చినప్పుడే. గియ్యన్ని సెప్పుకుంటా ఇగ నన్ను మల్ల తొలకే అవ్వా! అని ఏడిసింది." 'మా అవ్వ పోనంటే ఎట్ల బిడ్డ లగ్గం అయిన పొల్ల ఇంటిమీద ఉంటే పరువుపోతది. ఇడుపుగాయిదం అయిన పొల్లను మల్ల ఎవరు సేసుకోరు.అని బుదరకిచ్చి మల్ల పంపింది. మా బావకు కూడ జెరంత బా బిడ్డను కట్ట పెట్టకయ్య.పొల్ల సిన్నది దానికి బుద్ధి అచ్చినంక అన్ని పనులు సేసుకోక పోతే ఎమ్ జేత్తది. జెరంత ఓపిక పట్టు బిడ్డా. అని సముదాయించింది." "గిక్కడ ఇన్నట్టే తలూపిండు. ఇంటికి పోయినంక మీ వొళ్లకు సెప్తవా అని మత్తు కొట్టిండట.

మా అక్క ఏడుసుకుంట కబురు పంపితే మొన్ననే మా సిన్న బాపు పొయ్యి తోలు కచ్చిండు. ఇగ మా అక్క మనసుల ఏమను కుందో మల్ల ఏదో బుదరకిచ్చి అక్కడికే పంపుతరు అనుకోవచ్చు. గిట్ల సేసుకుంది." ఇంకా ఎంతో వ్యథ చెప్పాలనుకున్నా గానీ దు:ఖం ఆగక ఆపింది ఆ అమ్మాయి.

కొద్ది సేపు అంత నిశ్శబ్దం గుండు సూది పడ్డ చప్పుడు వినిపించేంత. అది వింటున్న మా అందరి కళ్ళు చెమర్చాయి. కొద్దిసేపటికి తేరుకున్న మా మేడం. " హ్మ్మ్.. " అని ఒకసారి గట్టిగా ఊపిరిపీల్చి. "చెప్పు కనుకవ్వ ఇప్పుడు నీ బిడ్డ చెప్పింది అంతా నిజమేనా..? "

"నిజమే తల్లి మొగ దిక్కు లేని సంసారం.ఏదో నా బాధ్యత తీరి పోద్ది అనుకున్న.గిట్ల అయితది అనుకోలే." మా మేడం " గిట్ల బాల్య వివాహం చేస్తే జైలు శిక్ష పడుద్ది అది నీకు తెలుసా? " "నాకు గసొంటియ్ అన్ని ఏం ఎరుక మేడం. ఏదో నాకు ఉన్నంతల జెప్పన పొలగాండ్ల లగ్గాలు సేయాలి అనుకున్న.గంతే.గాళ్ల ఉసురు తీత్తన్న అనుకోలే. పానమోలే సాదుకున్న బిడ్డనే పోగొట్టుకున్న ఇగ నేను ఉంటే ఎంత పోతే ఎంత నాకు ఏ సిచ్చ ఏ సిన సరే."

ఆమె అట్ల అనగానే మా మేడం – " చూడు కనుకవ్వ. సమస్యకు పరిష్కారం శిక్షే కాదు.ముందు మీలో పరివర్తన రావాలి. ఆడ పిల్ల అంటే బరువు అనే ఆలోచన ధోరణి మారాలే. వాళ్ళను బాధ్యతగా చదివిస్తే ఇదిగో మా లాగ మీ బిడ్డలు మేడంలు అవుతారు. కూలి పని చేసుకునే నీకు వీళ్ళ చదువు భారమే. అది మాకు తెలుసు. కానీ ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలు ఉన్నాయిగా.ప్రభుత్వ హాస్టల్ లో ఉంచి ఇక నైనా నీ రెండో బిడ్డను బాగ చదివించు." అని చెప్పి అన్ని రాసుకుంది. రెండో అమ్మాయిని పిలిచి "ఇంతకు నీ పేరు ఏంటి అమ్మా! అని అడిగింది." "నా పేరు సరస్వతి అని చెప్పింది ఆ అమ్మాయి."

మా మేడం " నువ్వు ఎప్పుడు ఇలాగే నిజాయితీగా ధైర్యంగా వుండాలమ్మ.ఆడ పిల్లకు అది అవసరం. సరే మీ అక్క ,బావ పేరు చెప్పు."

"మా అక్క పేరు సంధ్య,బావ పేరు పెంటయ్య." ఆ అమ్మాయికి బాగ చదువుకో అమ్మా అని నీకు ఏదన్నా సహాయం కావాలి అంటే నాకు ఫోన్ చెయ్ అని తన నెంబర్ ఇచ్చి. అక్కడ నుండి అందరు కదిలాము. ఒక ఆడబిడ్డను కోల్పోయిన బరువెక్కిన గుండెతో.

కొద్ది రోజులకు దగ్గరలో వుండే కాలేజ్ లో కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత,మంచి ఆహారపు అలవాట్ల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసామ్.ఆ సదస్సుకు హాజరు అవ్వడానికి మా మేడం కూడ వచ్చారు.మీటింగ్ మొదలు అవ్వబోతుంది.ఇంతలో అక్కడికి ఓ.అమ్మాయి వచ్చి పలకరించింది.

"మేడం అందరూ బాగున్నారా అని." మేము ఆ అమ్మాయిని చూసి ఆచ్చర్య పోయాం. "సరస్వతీ నువ్వా! " అని నేను అడిగా" బాగున్నవా అమ్మా.. ! " అని. "బాగున్నా మేడం."

"మీరు అలా చెప్పి వెళ్లాక మా అవ్వలో సాన మార్పు అచ్చింది. నన్ను మంచిగ సదువుకో బిడ్డా ఎంత కట్టమైన ఇగ నిన్ను సదివించుకుంటా అక్క లెక్క నీ బతుకు బండలు కానియ్య అంది. నేను 10th లో ఫస్ట్ వచ్చాను మేడం నాకు ఇక్కడ ఫ్రీ సీట్ దొరికింది.

"చాల సంతోషం అమ్మా.. నువెళ్లి కూర్చో అని మీటింగ్ పూర్తి చేసామ్." ఒక్కసారి నేను మళ్ళీ వెనక్కి ఆ అమ్మాయి దగ్గరికి వెళ్లి నువ్వు బాగ చదువుకొని ఏం అవుదాం అనుకుంటున్నావ్ అమ్మా.. ? " అని అడిగా.., అప్పుడు ఆ అమ్మాయి " నా లక్ష్యం" I.A.S." అంది.

★ ★ ★

ఇంటికి బయల్దేరాను. సూర్యుడు నడినెత్తి మీదున్నాడు. ఈ ఎండని తట్టుకోని ముందుకు పోవడం మాత్రమే కాదు. ఈ మా నడిమంత్రపు జీవితాలని గెలిచి పొద్దుగూకడం మాత్రమే కాదు. మేం తిరిగి రేపటి పొద్దు పొడుపుని చూస్తామనే నాలో మెరిసిన ఆ ఆశ నాలో తెలియని ఉత్సాహాన్ని నింపి నా అడుగులలో వేగాన్ని పెంచింది.

# ఆంగ్ల రచయిత్రులపై స్పాట్లైట్ - బెర్నాడీన్ ఎవరిస్టో



తిరునగరి నవత

బ్రిటన్ లో గత మూడు దశాబ్దాలుగా ఒక ప్రఖ్యాత రచయిత్రిగా బెర్నాడీన్ ఎవరిస్టో పేరు వినిపిస్తుంది. మిశ్రమ జాతికి చెందిన బెర్నాడీన్ (ఇంగ్లీష్ తల్లి, నైజీరియాన్ తండ్రి) ఊలిచ్, దక్షిణ లండన్ లో ఎనిమిది మంది తోబుట్టువులతో పెరిగారు.

ప్రస్తుతం బ్రునెల్ విశ్వవిద్యాలయంలో "సృజనాత్మక రచన" భోధించే ప్రొఫెసర్ గా పని చేస్తూనే రాయల్ సొసైటీ అఫ్ లిటరేచర్ మరియు రాయల్ సొసైటీ అఫ్ ఆర్ట్స్ సంస్థలలో కీలకమైన పాత్రలని పోషిస్తున్నారు. అంతే కాక Theatre for Black Women అనే నాటక సంస్థని స్థాపించారు, బ్రిటన్‌లో ఇది నల్లజాతి మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొదటి నాటక సంస్థ. ఈవిడ ఆఫ్రికన్ ప్రవాసుల గురించి దాదాపు 10 పుస్తకాలు రచించారు, ఇందులో 8 నవలలు. ఇవేకాకుండా ఎన్నో కథలు, వ్యాసాలు, కవితలు , నాటికలు రాసారు, అనేక సాహిత్య పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

బెర్నాడీన్ రాసిన పలు నవలలకు విమర్శనాత్మకంగా విశిష్ట గుర్తింపు లభించింది. 1997 లో రచించిన "లారా" మిశ్రమజాతికి చెంది, ఏడ తరాలు, మూడు ఖండాల అంతరాలలో వ్యాపించిన ఒక కుటుంబం ఉనికిని తెలియచెప్పడానికి ప్రయత్నిస్తుంది.అట్లానే సూడాన్ వాస్తవ్యులైన తల్లితండ్రులకి పుట్టిన జులైఖ రోమ్ నగర చక్రవర్తితో తనప్రణయ బంధాన్ని



ఎట్లా కొనసాగిస్తుందో తెలిపే "ధ ఎంపరర్స్ బేబ్" ఇంకొక అవార్డు విన్నింగ్ నవలగా పాఠకులకి అందజేసారు. వీరికి లభించిన అవార్డుల జాబిత చాలా పొడవైనది (క్రింది వికీపీడియా లింక్ లో పూర్తి జాబితా లభిస్తుంది). 2009 లో బెర్నాడీన్కి బ్రిటిష్ రాజ్యం ప్రతిష్టాత్మకమైన MBE (మెంబెర్ అఫ్ ది ఆర్డర్ అఫ్ బ్రిటిష్ ఎంపైర్ ) ప్రధానం చేశారు. 2020లో అంతకంటే ప్రతిష్టాత్మకమైన OBE (ఆఫీసర్ అఫ్ ది ఆర్డర్ అఫ్ బ్రిటిష్ ఎంపైర్ ) ప్రధానం చేశారు.

ఈవిడ రాసిన "గర్ల్, వుమన్ అదర్" అనే పుస్తకానికి ఇంగ్లీష్ సాహిత్యం లోనే అతున్నతమైన బుకర్ ప్రైజ్ లభించింది. బుకర్ ప్రైజ్ సాధించిన మొట్టమొదటి నల్ల జాతి మహిళ మరియు మొట్ట మొదటి నల్ల జాతి బ్రిటిష్ వ్యక్తి వీరు. ఈ పుస్తకం పాఠకులకి మునుపెన్నడూ చూడని కోణంలో బ్రిటన్ దేశాన్ని చూపెడుతుంది. గత 17 సంవత్సరాలుగా బ్రిటన్లో ఉంటున్న నాకు కూడా ఇందులోని పాత్రలు వారు ఎదుర్కున్న పరిస్థితులు చాలా కొత్తగా, అనుకోని విధంగా తారసపడ్డాయి. ఉత్తరాన ఉన్న స్కాట్లాండ్ మొదలుకొని, బ్రిటన్ ద్వీపంలోని దక్షిణాది మూలల వరకి ఒక శతాబ్ద కాలంలో నివసించిన పాత్రల కథనాలు, వీరి జీవితాలలో దాగి ఉన్న విపరీతమైన, వింతైన సంఘటనలు మనల్ని అబ్బుర పరుస్తాయి. గర్ల్, వుమన్, అదర్ అని పేరు సూచించినట్టుగా ఒక బాలిక కాని, స్త్రీకాని తమ రోజు వారి జీవితంలో చవి చూసే సమస్యలే కాకుండా, వేరేతర-స్వలింగ సంపర్కులైన లెస్బియన్స్, లింగమార్పిడి చేసుకొన్న ట్రాన్సజెండర్స్, వివాహేతర సంబంధాలు పెట్టుకొన్న స్త్రీలు, చిన్నతనంలోనే లైంగిక దాడులకు గురైన బాలికలు ఇట్లా ఈనాటి పాశ్చాత్య సమాజంలో తమ ఉనికి కోసం పోరాడుతున్న వివిధ కోవలకి చెందిన మహిళలు ఎదుర్కొనే సమస్యలని విషయంగా ఎంచుకొని ఈ (కల్పిత) పాత్రలని చిత్రీకరించడమే కాకుండా ఎంతో మెళకువతో సాలీడు తన గూడు ఎట్లా కట్టుకొంటుదో ఒకరితో ఒకరి కథలని అట్లా జాగ్రత్తగా అల్లారు బెర్నాడీన్.

బ్రిటన్ లో కూడా తమ ఉనికికి గుర్తింపు లేక ఎందరో అల్ప సంఖ్యాక వర్గాలకి చెందిన వాళ్ళు ముఖ్యంగా మహిళలు తమ గొంతు విప్పి పోరాడాల్సి వస్తుంది. ఈ పోరాటానికి బెర్నాడీన్ రాసిన సాహిత్యం ఉపయోగ పడడమే కాకుండా "మోడరన్ బ్రిటన్" కి ఒక కొత్త నిర్వచనాన్ని తీసుకు వచ్చింది.. ఈవిడ జీవితం ముందు తరాల మహిళలకి (ముఖ్యంగా non-native women in Britainకి ) తప్పకుండా స్ఫూర్తి దాయకంగా నిలుస్తుంది.

సమీక్ష

# సందేశాత్మక కథల సమాహారం శైలజామిత్ర 'ఆధునిక పంచ్ తంత్ర కథలు'



- డా. సమ్మెట విజయ
ఫోన్ : 9989820215

శైలజామిత్ర తెలుగు సాహిత్యానికి పరిచయం అక్కర్లేని పేరు. వీరు తమ కవితల ద్వారా, కథల ద్వారా, నవలల ద్వారా, సమీక్షల ద్వారా, మినీ కవితలు, అనువాదాలు, వ్యాసాలు ఇలా ఒక్కటేమిటి అనేకానేక ప్రక్రియల్లో తమదైన ముద్రను వేసుకున్నారు. ఇపుడు కొత్తగా బాలసాహిత్యంలోకి ఈ గ్రంథం ద్వారా తెలుగు పాఠక లోకానికి పరిచయం అయ్యారు. సంస్కృతంలో వెలువడిన పంచ తంత్ర కథలు దాదాపు అన్ని భారతీయ భాషల్లోకి అనువదింపబడిన విషయం ద్వారా పాఠక లోకానికి గుర్తువచ్చే పేరు విష్ణుశర్మ. నేడు ఆధునిక పంచ్ తంత్ర కథల ద్వారా శైలజామిత్ర మనకు ఎదురయ్యారు. రాకుమారులను మార్చడం కోసం చెప్పిన నీతి కథలు విష్ణశర్మవి. కాకుంటే ఆధునికంలో ఆధునికానికి తగినట్లుగా జరుగుతున్న హింసను, దారుణాల్ని, మోసాల్ని, నమ్మకద్రోహాన్ని చిన్నపిల్లలకు తెలియబరుస్తూ పిల్లలలో చైతన్యాన్ని కలిగించాలని శైలజామిత్ర నూతనంగా ప్రయత్నించారు. ఇదే విషయాన్ని ఈ పుస్తకానికి ముందు మాట రచించిన డా. పత్తిపాక మోహన్ గారు తెలుగు సంపాదకులు, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా కార్యక్రమాధికారి తమ స్పందనలో అసలు పంచతంత్రం మూర్ఖులైన రాకుమారుల కోసం రాయబడితే ఈ ఆధునిక పంచ్ తంత్రం మూర్ఖంగా ప్రకృతిని సర్వనాశనం చేస్తూ జీవ జంతుజాలం మనుగడకు ముప్పుగా మానవులు చేస్తున్న అనేక విషయాలను జంతువుల నేపథ్యంలో మనతో చర్చించారన్నారు.

పుస్తకం పై తమ అభిప్రాయం వ్యక్తం చేసిన ప్రముఖ సంపాదకులు గుడిపాటి గారు ఈ కథల్లో నీతిగా ప్రవర్తించడంలో గొప్ప దనాన్ని మంచిగా వ్యవహరించడంలో ఔన్నత్యాన్ని చెప్పిన విధానం బాగుందని ప్రశంసించారు. స్వార్థం విడనాడి పరులకోసం జీవించే సుగుణం అలవడడానికి ఈ కథలు తోడ్పడతాయన్నారు.

కథలలో ఇతివృత్తం జంతువులు ఎదుర్కొనే సమస్యలు మానవులకూ వర్తిస్తాయి. కథాకథనం రమణీయం ఎవరైనా చదివి వినిపిస్తే వినసొంపుగాను మనం స్వయంగా చదివితే ఒక అందమైన పచ్చని అడవిలో రకరకాల జంతువుల మధ్య వనవిహారం చేసి వారితో ముచ్చటించి వాటి సాధకబాధకాల



గురించి తెలుసుకున్న అనుభూతి మనకు తప్పనిసరిగా కలుగుతుంది.

ఆధునిక పంచ్ తంత్ర కథల ముగింపు దాదాపు ఒక చక్కని సందేశాన్ని మనకందిస్తాయి. మొత్తంగా ఈ పుస్తకంలో 16 కథలున్నాయి. ఈ షోడసి కథలు వేటికవే ప్రత్యేకమైనవి. మొదటి కథ చిట్టి చిలకమ్మ నుంచి ఆఖరు కథ చీమల పోరాటం వరకు కథలన్నింటిలో జంతువుల ధ్వని మనకు వినిపిస్తుంది ..ప్రతి ఒక్కరికీ తగినంత శక్తి ఉంది . తనను తాము కాపాడుకునే తెలివి తేటలున్నాయి. వినియోగించుకోండి. నేను ఎక్కువ నేను తక్కువ అనే ఆలోచన వద్దు . కలిసి కట్టుగా పని చేస్తే సాధించలేనిది ఏమీ ఉండదు అనే సందేశం ఒక కథలో చెబితే, ఆదమరచి నిద్రిస్తున్న సమయంలో మానవులు మమ్మల్ని చంపి మా చర్మాలను వొలుచుకు పోతున్నారు. తుపాకీ అనే అస్త్రాన్ని వారి వద్ద ఉంచుకుని దూరం నించి మనల్ని వేటాడుతున్నారనే ఆవేదన వ్యక్తీకరించే జంతువుల కథలు ఇందులో ఉన్నాయి.

మరో కథలో ప్రపంచంలో విశ్వాసం లేని వారు ఎవరైనా ఉన్నారంటే మానవులే డబ్బుకోసం ఇంట్లో వారినే చంపేస్తారు కానీ పక్షులమైన మనం అలా వారి అలవాట్లను పుణికి పుచ్చుకోవడం మంచిదికాదని తెలిపే తీరును ఎంతో ఆలోచనలు రేకెత్తించేలా ఉంది. అలాగే పేరు కోసం సొంత వారినే మోసం చేస్తారని ఒక కథలో అంటే, మరో కథలో అధికారం అనేది రూపాన్ని బట్టి రాదు బుర్రను బట్టి వస్తుందనే పంచ్ లు మనకు కనిపిస్తాయి అంతే కాకుండా ఎవరైనా కూర్చునే కుర్చీని బట్టి అధికారం రాదు. ఆ కుర్చీలో కూర్చునే వారిని బట్టి అధికారం వస్తుందనే విషయాలను పిల్లలకు జంతువుల సందేశాల ద్వారా చెప్పేందుకు శైలజామిత్ర ఎంతో ప్రయత్నించారు. ఇవే కాదు ఇలాంటి సందేశాలు ప్రతి కథలోనూ ఉన్నాయి.

ఈ విషయాలను బాలసాహిత్యంలో కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత శ్రీ చొక్కాపు వెంకట రమణ గారన్నట్లు బాల సాహిత్య రచన మనం ఊహించినంత సులువు కాదు. స్వీకరించే వస్తువు పట్ల తగిన జాగ్రత్త వహించాలి. పిల్లల స్థాయిని చేరేలా ఆ రచన సాగాలి. కథల ద్వారా విద్యార్థులకు లోకనీతిని నైతికతను పెంచేలా ఆ రచనలుండాలి. రచనలో లయాత్మకత, సరళత, చమత్కృతి ఉండాలి. స్వీయ అధ్యయనం చేస్తూ అనుభూతికి లోనవ్వాలి. వీటన్నింటికీ తగిన రూపం ఆధునిక పంచ్ తంత్ర కథల్లో మనకు అగుపిస్తాయి.

నేటి పిల్లలలో పసితనం తక్కువగా గోచరిస్తోంది. చిన్నతనంలోనే పెద్దవారిలా మాట్లాడటం, పెద్దవారిలా వ్యవహరించడం వంటివి మనం గమనిస్తూనే ఉన్నాం. మనకు అంటే యాభై ఏళ్ళ వారికి, అంతకంటే పైబడిన వారికి బాల్యం దాదాపుగా 15 సంవత్సరాలు ఉండేది. కానీ నేడు ఐదు ఏళ్ళు రాకుండానే నేడు పిల్లల్లో పెద్దరికం కనిపిస్తోంది. ఆ విషయాలను తెలుసుకున్నారు కనుక రచయిత్రి శైలజామిత్ర తను రాసిన కథల్లో శైలజామిత్ర కాస్తంత ఘాటుగానే విషయాలను వివరించారు.

రచయిత్రి శైలజామిత్ర మూగజీవులు, పక్షుల పట్ల తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ బాలల కోసం సాహిత్యం అందించాలన్న తపనతో రాసిన కథలు ప్రముఖ రచయిత వల్లీశ్వర్ గారి ప్రోత్సాహంతో ఆధునిక పంచ్ తంత్ర కథలుగ రూపుదిద్దుకుని ఉషోదయ వెలుగు పత్రికలో ప్రచురించబడ్డాయని వివరించారు. ఈ కథల్లోని అంతరార్థం పిల్లలకే కాదు పెద్దలకు కూడా ఉపయోగిస్తాయి. స్వార్థం, అసూయ, అత్యాశ వంటి గుణాలు ఎత్తి చూపుతూ సరిచేసుకోవాలని చెప్పడం అందరికీ వర్తిస్తుందనే చెప్పాలి..

మొత్తంగా వేసవిలో పిల్లలకు ఒక చక్కని జంతువులతో ముచ్చటించేలా పచ్చని అడవిలో సంచరించి వచ్చామనే సంతృప్తిని కలిగించే అద్భుతమైన కథల పుస్తకం వెలువడిరది రచయిత్రి శైలజామిత్ర గారి కలం నుంచి మరిన్ని కథలు బాలలకోసం రావాలని ఎదురుచూసే రచన ఆధునిక పంచ్ తంత్ర కథలు.



# 'మలిదశలో క్రీడలు అందించే ఆనందపు బోనస్ లు'


- సుమతి చురుకంటి

ఫోన్ : 98663 44106

కాలం కాలు కదపకుండా పరుగులు పెడుతూ మన జీవితాలను అనుకోని మలుపులు తిప్పుతుంది. మనమేమి తక్కువ తిన్నామా ప్రతిమలుపులో ఎదురొచ్చిన అవకాశాన్ని వదలకుండా అందిపుచ్చుకుంటాము. ఆ పరంపరలో భాగమే త్రివేంద్రమ్ లో బాట్మెంటన్ టోర్నీలో పాల్గొనడం..

"మాస్టర్స్ షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్" త్రివేంద్రం లో జరుగుతున్నాయని తెలిసి మా మిత్రులమంతా మాపేర్లను రిజిస్టర్ చేయించి, ఫ్లయిట్ బుక్ చేయించి ఆ కామడేషన్ బుక్ చేయించుకుని 17– 5 – 2022 న రాత్రి త్రివేండం చేరుకున్నాం . 18 వుదయం పద్మనాభా స్వామి టెంపుల్ కెళ్ళి వచ్చాం . వుదయం 10 గంటలకే రమ్మన్నారు స్టేడియానికి ( చంద్రశేఖరన్ నాయర్ ) వెళ్ళాము . బాగా వాన పడుతున్నది . తెలంగాణ కౌంటర్ ఎక్కడో తెలియదు . ఎవరినడిగినా చెప్పరు. ఇచ్చిన ఇంచార్జ్ నెంబర్కి కాల్ చేస్తే ఎత్తదు. మొత్తానికి తిరిగి తిరిగి ఒక టేబిల్ దగ్గర ఆగాము . అక్కడ గుడ్డ సంచుల్లో ఏవో వున్నాయి. వాటిపై తెలంగాణ అని వుంది. ఇక అక్కడే కూర్చున్నం. కాసేపటికి మన తెలంగాణ నిర్వాహకులు గారు వచ్చారు. ఒక్కడే ఎన్ని పనులని చేయగలరు? మేము ఏడు మందిమీ అతనికి సహాయం చేసాం





. అక్రిడేషన్ కార్డులు ఇవ్వడం లో ' గుంపులు గుంపులుగా ఏవేవో అడుగుతున్నారు. సార్ మా స్టేట్ కార్డులు ఎక్కడా సార్ మేము అథ్లెటిక్స్ మావి ఎక్కడా .. సార్ మేము ఫలానా ఆటలో 30 మందిమి మావి మాకు ఇవ్వండి అని, మాకు ఓ గంట పట్టింది. ఎనిమిది మందిమి ఏక బిగిన పని చేస్తే . ఓపక్క వాన పడుతుంది . అన్ని స్టేట్స్ మార్చ్ఫాస్ట్ వుంటుందని చెప్పారు. ఈ వాన కాస్త తెరిపి ఇచ్చింది. ఓపెన్ గ్రౌండ్ లో జిల్లాల వారిగా నిలబడాలి . ఆడేటపుడు షూ వేసుకోవచ్చు ఇప్పట్నుంచి ఎందుకని .. తడుస్తాయని .. మనం ఎక్కడో వెనుక వుంటాం ఎవరు చూస్తారులే అని స్లిప్పర్స్ తో వెళ్ళాం . అయితే నిర్వహకులు నన్ను ముందు వరుసలో నిలబెట్టారు. కారణాలున్నాయి. ఒకటి – నేను ఎత్తు తక్కువ గా వుండడం, రెండు – స్పేయిన్లో ఆడి రావడం మూడు – 60 ఏళ్ళు దాటిన దానిని కావడం అయ్యో ! మీడియా కి ముందే వున్నానే.. ఇలా షు లేకుండా ఎలా! అనుకుని పరుగెత్తుకెళుతూ వుంటే తడికి స్లిప్పర్స్ జారుతూ వుండి నడవలేక పోయాను. మెల్లగా వెళ్ళి సాక్స్ వేసుకుందామంటే – వాళ్ళు మాకు ఇచ్చినట్రాక్ సూట్ ప్యాంట్ చాలా టైట్ గా వుంది. కుర్చీలో కూర్చుని కిందికి వంగ లేక .. పాదం పైకి తేలేక నానా అవస్థ పడి వేళ్ళ వరకు సాక్స్ ఎక్కించాను. ఇక ముందుకి పైకి లాగ రావడం లేదు. తడికి స్కిన్ కి అంటుకుని నా వాచిన కాళ్ళకు పైకి రానని మోరా యిస్తున్నవి. ఏం చేయాలి అని క్షణం ఆగిపోయాను. నా అవస్థ చూసి పక్కన వున్న ఆమె సహాయం చేసింది సాక్స్ ఎక్కించడంలో 'మామూలుగా ఎవరి సహాయం అర్థించని నేను ఈ సమయంలో ఎంతో కృతజ్ఞతగా స్వీకరించాను. పరుగున ఉరికి వెళ్ళి ఆయాసంతో నిలబడ్డాను. అలా గంటన్నర రెండు గంటల సమయం చిన్న పిల్లల్లా మమ్మల్ని నిలబెట్టారు. నాతో వచ్చి వెనుక నిలబడిన

మా టీం అంతా వెళ్ళి పోయి దూరంగా కుర్చీల్లో కూర్చున్నారు. మావల్ల కాదు కాళ్ళు నొప్పులని. నన్నూ రమ్మన్నారు నీకసలే కాళ్ళు ప్రాబ్లం అంత సేపు ఎలా వుంటావు వచ్చేయి అన్నారు. నేను రానన్నాను. ఇలాంటి అవకాశం నా లైఫ్ లో మళ్ళీ రాదు ఎంతసేపయినా సరే నేను ఉత్సాహంగానే వున్నాను రానంటే రానని చెప్పాను. మార్చ్ ఫాస్ట్ ఎలా నడవాలో .. ఎలా సెల్యూట్ చేయాలో.. డయాస్ వైపే చేయి ఎత్తి ఎలా చూడాలో ఒక అబ్బాయి చూపించాడు. తెలంగాణ క్రీడల ప్రముఖులు వచ్చి మాలో స్ఫూర్తిని రగిలిస్తూ ఉత్సాహ పరిచి వెళ్ళారు. చిన్నప్పటి రోజుల్లా ఎంతో ఆనందంగా మార్చ్ ఫాస్ట్ చేస్తూ వేదిక దాటి ముగించాము. 200 మంది పైనే తెలంగాణ క్రీడాకారులు పాల్గొన్నా ము. ఈ మార్చ్ ఫాస్ట్ లో తెలంగాణ బెస్ట్ అన్నారు.

రెండవ రోజు ముందు అందర్నీచంద్రశేఖరన్ నాయర్ స్టేడియానికి రమ్మన్నారు. ఇక్కడ కాదు బాడ్మింటన్ కోర్టు జిమ్మ జార్జ్ కోర్టు అన్నారు. అటు వెళ్ళాము క్యాబ్ బుక్ చేసుకుని తీరా వెళితే ఇక్కడ కాదు చంద్ర శేఖరన్ నాయర్ స్టేడియం అన్నారు. మళ్ళీ క్యాబ్‌లో అటు వెళ్ళాము . అక్కడ కాదు టెంజ్ అకాడెమీలో అన్నారు. మళ్ళీ అటు వెళ్ళాము. మేము 8 మందిమి గ్రూపుగా వున్నాము కాబట్టి ఒక టీం స్పిరిట్ తో సాధ్యమైంది . అక్కడ ఒక్కటే బాత్రూం . డ్రస్సింగ్ రూం అంటూ లేదు . రెస్ట్ లాంజ్ లేదు . కింద కూర్చో లేక .. నిలబడ లేక .. ఎన్ని గంటలు ఉండగలం. పైన వర్షం భీభత్సంగా పడుతున్నా ..మాకు లోపల చెమటలతో వళ్ళంతా వరద గోదావరే. చమటకంపు ఇరుకిరుకుగా బ్యాటు బ్యాగులు, కిట్లు సందులేకుండా కూర్చున్న ప్లేయర్స్. కాలు కదప వీలులేదు అడ్డం ఒరగ తావులేదు. దాదాపు వందమంది పైనేవున్న ఆ హాలులో ఎక్కడా ఒక చిన్న ఫాన్ కూడా లేదు. పైన సీలింగ్ లో కొన్ని ఎగ్జాస్ట్ ఫ్యాన్లు వున్నాయి కానీ తగినంత సర్వీస్ చేయలేక చేష్టలుడిగి నిలబడ్డాయి. క్యాంటీన్ లేదు.. కాఫీకి టీ కి కూడా ఎంతో దూరం నడుచు కుంటూ వెళ్ళి రావాల్సిన దుస్థితి. ఆ టైంలో ఆటకై అనౌన్స్ మెంటు. ఫ్రెండ్స్ లో ఎవరిదో ఫోన్ వెంటనే వచ్చేయండి మీదే ఇప్పుడు గేమ్ అంటూ. ఉరుకో పరుగో అంటూ వచ్చి ఆయాసం తో ఆడుతూ రొప్పుతూ బెస్టాఫ్ త్రీ లో వారోటీ వీరోటీ గెలిచి మూడో ఆటకు శక్తిలేక అంతర్గత శక్తిని కూడదీసుకుంటూ 60 వసంతాలు ఏనాడో దాటిన వయసులో ఇవన్నీ నాకవసరమా అనుకుంటే... జీవితంలో నేను ఇవన్నీ సాధించలేను కదా! హమ్మయ్య ఇంకాస్త వుంటే కళ్ళు తిరిగి కాళ్ళు తడబడేవేమో.. చివరికి గెలిచి గోల్డ్ మెడల్ సాధించాం. వుదయం నుండి మా ఆట ఎప్పుడూ ఎప్పుడని ఎంక్వయిరీ చేస్తూ అసహనాన్ని అణచుకుంటూ.. మధ్యాహ్న భోజనాలు లేక నీళ్ళు తాగి తాగి బ్యాగులో ముందు చూపుతో తెచ్చిన కొన్ని (డ్రై ఫ్రూట్స్, అరటి పళ్ళు తో సాయంత్రందాకా పిచ్చిగా కాచుకుని వుండాల్సొచ్చింది ఇలా అందరూ త్రివేండ్రం ఆర్గనైజర్స్ ని తిట్టడమే. ఒకటే గొడవలు పెద్ద వాళ్ళు ఎవరూ లేరు అంతా పిల్లలే ఓపిక గా ఎవరూ చెప్పడం లేదు గోలగోల. నాకు సింగిల్స్ లో సిల్వర్.. మిక్స్డ డబుల్స్ లో గోల్డ్ మెడల్స్ వచ్చాయి. కష్టే ఫలి అన్నారు కదండీ ! ఎంతో ఓపికగా అన్నీ ఓర్చుకుని ప్రసవ వేదన పడి పండంటి బిడ్డను చూసి కష్టం అంతా మరచి పోయినట్లు.. మెడల్స్, సర్టిఫికేట్ లు చూసుకుని మురిసి పోతున్నాం పడిన శ్రమనంతా మరచి పోయి. గోవాలో తర్వాత స్పేయిన్ లో గత నెలలో చండీఘర్ లో ఇప్పుడు త్రివేండ్రం (కేరళ) లో.. 30 ఏళ్ళ ప్రస్థానం మరి ఇలా నా స్థానం సుస్థిరం అయింది క్రీడా లోకంలో.






వ్యాసం

# బుద్ధిని ఉపయోగిస్తే సరి..!!




**నాంపల్లి సుజాత,**

**Phone no: 9848059893**


ఆదిమ మానవుడు తన చుట్టూ ఉన్న పరిసర ప్రకృతిని శాస్త్రీయ దృక్పథం తో అవగాహన చేసుకోలేని నిస్సహాయ స్థితిలో

నున్నపుడు తనకుతానుగా కొన్ని నిబంధనలనూ నియమాలనూ నమ్మకాలనూ విధించుకున్నాడు.అప్పటి సమయానికీ,ఆ సమాజానికి అవి కొంత ఉపయుక్తంగానే అనిపించి వాటిని ఒక తరం నుంచి ఇంకోతరానికి పొల్లుపోకుండానూ అదనంగా మరి కొన్నింటిని కూడా చేర్చి బలీయంగా ఆచరిస్తూ కొనసాగించ బడుతూ వాస్తున్నాయి.

ఆ ఆచార వ్యవహార విశ్వాసాలు సమాజంలో స్థిరపడటానికి, ఓ అలవాటుగా మారాటానికి చాలా సమయమే పట్టింది.

ఇప్పుడు మనతో పాటూ అవీ సమాంతరంగా ప్రయాణిస్తూనే ఉన్నాయి.నేటికీ వీటి పూర్వాపరాలు ఎలా వచ్చాయో ఎందుకు వచ్చాయో తెలియకున్నా తు.చ తప్పక పాటిస్తూ నెత్తిన మోస్తూనే ఉన్నాం.ఇవి మనిషి నరనరానా జీర్ణించుకొని మనలోనే తిష్టవేసి మౌఖికంగానే సంరక్షించ బడుతున్నాయి.

వీటిలోనివే కొన్ని కాలం చెల్లిన ముచ్చట్లను,కాల్పనిక అంశాలనూ పరికిస్తే విస్మయమూ విచారమూ కలుగక మానదు.

ఆనాటి అంధ విశ్వాసాల యుగం నుంచీ క్రమంగా శాస్త్ర సాంకేతిక విజ్ఞాన యుగం వైపు,వెలుగురేఖలని చీలుస్తూ పరుగులతో దూసుకుపోతూనే వున్నాం.నేడెన్నో రంగాల్లో ఊహించ నలవి కాని విజ్ఞానం,పరిణామాలు,

నూతనావిష్కరణలు మరెంతో సాంస్కృతిక సామాజిక ఆర్థిక వికాసం మన కళ్లముందు.

ఒకప్పుడు ఉదయ సాయంత్రాలని మాత్రమే గమనించి,సూర్యుడే భూమిచుట్టూ తిరుగుతున్నాడని భ్రమపడ్డాం. అసలు విషయం తెలిసి అప్ డేట్ అయ్యాం, అవ్వాలి కూడా..!నిన్నటి దాకా సరయ్యిందే అనుకున్నది ఇవ్వాళ కాకపోవచ్చు తప్పేం లేదు.

ఒకప్పటి ప్రాచీన భావనలు ఇప్పటి ఆధునికం లో ఇమడలేక చాదస్తంలా అనిపించనూ వచ్చు.అలాంటి వాటిలోంచే బుద్ధిని ఉపయోగించి..ఏది అవసరమో,మరేది కాదో తేల్చుకొని హేతువాదనా దృష్టితో ఏరుకోవాలి.

మనం నమ్మి ఆచరిస్తున్న కొన్నింటిని పరిశీలిస్తే నవ్వాలో ఏడవాలో తెలీదు

అదీ ఓ అమాయక జీవి బుజ్జిపిల్లి..!

ఎదురైతే చాలు..అపశకునమంటూ ఆడిపోసుకొని హడలిపోతారు.మరి అదే పిల్లిని వేరే ప్రాంతాన శుభశకునమంటూ..

ఎదుట నడిపించుకొని ఆనందిస్తారు, అలాగే కొందరు కాకి ఇంట్లోకి దూరిందంటూ కొన్నాళ్ళు ఆ ఇంటిని వదిలి పెడతారు. వాస్తుకు లేవంటూ,గది గోడలనీ ప్రాణవాయువునిచ్చే చెట్లనీ కొట్టేస్తుంటారు నిర్దాక్షిణ్యంగా..!

పొరపాటున బల్లి తగిలిందంటే ఇక చూడాలి కాశీ గయా తీర్థయాత్రలు.ఆ గొర్రె దాటు మూఢత్వం రోజురోజుకూ పెచ్చరిల్లుతోంది. గ్రహణపు ఛాయాలకి ఏవేవో కథలల్లి సూర్యచంద్రులనే

రాహుకేతువులు మింగారంటూ గరికపోసలతో ఉపశమనాలు..!

ఇలాంటివి కుప్పలు తెప్పలుగా మన సమాజాన.అందుకే బుద్దినుపయోగించి ఎవరికి వారు విశ్లేషించు కోవాలంటాను.

మా తాతా ముత్తాతలు ఇలాగే చేశారు

నేనూ గుడ్డెద్దులా వాటినే పాటిస్తానంటారు మరికొందరు చాందసులు ఎందుకో ఏమిటో ఆలోచించకనే..!

మొన్నటికిమొన్న ఐదోతరగతమ్మాయికి శారీ ఫంక్షన్ అంటూ ఊరంతా డప్పు చాటింపేసి చీరె సారెలు నగలతో ఆ అమ్మాయిని గంగిరెద్దులా అలంకరించి,ఓ నాలుగు యాటలు కోసి గ్రాండ్ గా చేశారు ఫంక్షన్.

ఆమె దేహం లో  సహజంగా జరిగే ఆ మార్పు అందరికీ తెలియ చేయడం అవసరమా.!? ఇక ఉన్నోళ్లని చూసి పేదవాళ్ళూ అప్పులపాలై మరీ అనుకరిస్తూంటారు. ఆ పిల్ల మానసిక స్థితి పట్టించుకోరెవరూ చదువులో వెనుకబాటుకు లోనై ఏదో న్యూనతాభావం లో చిక్కుకొని కుంగిపోయిందా పిల్ల. తరగతిలో కూడా తోటి విద్యార్థులతో ఇబ్బందుల పాలయ్యింది ఎందుకాలోచించరో విజ్ఞులు.

నిన్నటికి నిన్న ముప్పైఏళ్లన్నా నిండని ముగ్గురు పిల్లల తల్లి ఆమె..! సకలసద్గుణాలను అలవర్చుకొని అనారోగ్యం తో ఆమె భర్త కాలం చేస్తే,ఇక చూడాలి వైధవ్యాన్ని బలవంతంగా దగ్గరుండి కట్టబెట్టడం అనేది మనసున్న వాళ్ళకి ఆ దృశ్యం కంట నీరు పెట్టించక మానదు.

చిన్నప్పటినుంచీ పెట్టుకున్న బొట్టూ, గాజులూ, పూలూ.. చెరిపెయ్యడం, తెల్ల చీరొకటి ఆమె ముఖానికి అంటగట్టడం, శుభకార్యాలకు ఆహ్వానించకపోవడం.ముమ్మాటికీ అదో మానసిక హింసే..! 'మూలుగుతున్న నక్క మీద తాటిపండు పడ్డ చెందం'.అదింకా సాంప్రదాయమంటూ హృదయ విదారకంగా కొనసాగించ బడుతూనే ఉంది ఈ ఆధునిక  సభ్య సమాజాన!

అయినా అతనికి వర్తించని ఆ కపటపూరిత ముచ్చట్లని ఆమెకే ఎందుకు అంట కట్టించారో ఊహించవచ్చు. ఇలాంటివి లెక్కలేనన్ని దూరాచారాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

'జెండర్ ఈక్వాలిటీ, లిబర్టీ'

రాజ్యాంగం మనకు ప్రసాదించిన వరమనుకొని మురిసిపోతాం కానీ ఎక్కడా..!? అమలులో కాన రాదు. స్త్రీలయినా పురుషులయినా మొదట మనుషులే.! అది మరచిపోతుంది సమాజం. మానవీయతను మించింది ఇంకేదీ లేదీ ప్రపంచంలో దానిని పరిమళింపనియ్యరో..ఎప్పుడు కళ్ళుతెరుస్తారో ఈ మనుష్యులు.!

కాలాలూ నమ్మకాలూ పరిజ్ఞానమూ మారుతున్నప్పుడు మనం కూడా బుద్ధితో ఆలోచించి దేనిని తిరస్కరించాలి దేనివల్ల స్ఫూర్తిపొంది ముందుకు నడవాలో సొంతంగా ఆలోచించాలి. విచక్షణాజ్ఞానంతో మసలుకొని అవసరమైతే వాటిని సంస్కరించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందంటాను.!

కవిత

# వెలుగు విరులు



- వకుళ వాసు

ఫోన్ : 9989198334

చీకట్లు కమ్మిన గతపు జాడలెంత వెక్కిరించాలని
వెంపర్లాడినా
పున్నమినిండిన జ్ఞాపకాలనే మదివాకిట దొర్లించి....
నింగిలో తారకలతో ముచ్చట్లాడి ఎండిన హృదికి
దాహాన్ని తీర్చ వెన్నెలనీటిని తాగి...
నిన్నటి నీరెండల అనుభవాలను దృష్టి
పథానికిరువైపులా జల్లుతూ...
కాలపురైలుబండిలో ప్రయాణిస్తున్నా వేగుచుక్క సాక్షిగా...
ఏవో తెలియని మధుర గీతాలు మనసును హాయి
లోకాల తేలించగా...
చెదలచీకట్లు కదలబారుతూ బంగరు పుప్పొడి
జల్లులు కురిపించేవేళ...
కన్నులవనంలో సుగంధాల వెలుగు విరులను
పూయించుతూ వాడని పరిమళాలను బతుకంతా నింపుతూ
నిబ్బరమైన మనసుతో నాచూపు రేపటి గెలుపు
గమనం వైపు మరల్చుతూ సాగుతున్న
ప్రణాళికలు పరిచిన తివాచీ పై ...

కథ

# రేపెళ్ళిపోతున్నా!

- యం.ఆర్ . అరుణకుమారి
Phone : 8121523835

"రేపెళ్ళిపోతున్నా! ఇహ మళ్ళీ వస్తానో రాలేనో!" జరీనా బుగులు గా చూసింది .గుండె నిండా కమ్ముకున్న దిగులు మేఘాలు మాటలతో బాటు కన్నీటి చినుకులను టపా టపా రాలుస్తున్నాయి.

"రేపెళ్ళిపోతున్నా" అన్న వీడ్కోలు మాట సరిగ్గా పదేళ్ల క్రితం మొదటిసారి ప్రారంభమైంది జరీనా, శివల మధ్య. వేసవి సెలవులకు పెద్దమ్మ ఇంటికి వచ్చింది జరీనా. ఊర్లో తన ఈడు పిల్లలతో జట్టు కలసిపోయి ఆడుకోవడమే పనైపోయింది! పొద్దున చద్దన్నాలు తిని ఇంటి నుండి బయట పడితే మామిడి తోటలో కోతికొమ్మచ్చి, దాగుడుమూతలు, దొంగ పోలీస్, బిళ్ళాకర్రా, గోళీలు, బొంగరాల ఆటల పరుగులే పరుగులు!

ఇంట్లో నుండి నోట్సు కాగితం చింపి పొట్లం కట్టి తెచ్చుకున్న ఉప్పూ కారం అద్దుకొని పచ్చి మామిడికాయలు కసా పిసా నమలటం ! మగపిల్లలు రాళ్లతోనో, కర్రతోనో కొడితే రాలే సీమ చింతకాయలు ఆడపిల్లలు తమ పరికిణీలు ఒడిలా చేసి పట్టుకోవటం! ఆనక అందరూ కలసి తినటం! చెట్టు కింద కుప్పలుగా రాలిన అల్ల నేరేడు పండ్లు ఏరుకొని తినడం! ఎవరైనా తాటి ముంజలు కొడుతుంటే పొలోమని వెళ్లి ముందు నిల్చోవడం .నిల్చున్న పసిపిల్లలకు వాళ్ళు తలా రెండు ముంజలిస్తే తింటూ ఎగరటం!

మధ్యాహ్నం అన్నం తినాలన్న ధ్యాస లేదు. ఆకలీ ఉండదు. ఎండ పొద్దని ...అన్నం తినాలని ..ఇంట్లో నుంచి పెద్దలు వెతుక్కుంటూ వచ్చి లాక్కువెళ్లడమే గాని ఇంటికెళ్ళాలన్న ఆలోచనే రాదు.

రాత్రి మళ్ళీ భోజనాలయ్యాక కృష్ణమ్మ ఒడ్డుకు చేరి పోవటం ...వెన్నెల కుప్పలు, కబడ్డీ, మేకా పులి, వీరి వీరి గుమ్మడి పండు... ఆటలే ఆటలు! నవ్వులే నవ్వులు! కేరింతలు.. తుళ్ళింతలు! ఆటలో అరటిపండులా చిన్ని చిన్ని గొడవలు.. కాస్త పెద్ద పిల్లలు చేసే రాజీలు! అవి చూస్తూ పెద్దల పిచ్చా పాటీలు.... అన్నీ వినడానికి కృష్ణమ్మ కూడా నిశ్శబ్దంగా కాస్త నెమ్మదిస్తుంది. వింటూ ఆనందిస్తుంది. తన సంతోషాన్ని మలయ సమీరాల వింజామరలు వీస్తుంది.

ఆ ఆనందంలో సెలవులన్నీ ఇట్టే గడిచిపోతాయి. ఇహ బడులు తెరుస్తారు అనగా ఊర్ల నుండి వచ్చిన పిల్లలు ఊర్లోని పిల్లలకు వీడ్కోలు చెప్పుకోవటం ప్రారంభమవుతుంది దిగులు దిగులుగా .ఆ బుగులు మళ్ళీ వచ్చే సెలవులకు ఎదురు చూపులవుతాయి. కొన్నాళ్ళు అసలు ఏమీ తోచదు. నేస్తాల జ్ఞాపకాలు తడి తడిగా మనసును తడుముతూనే ఉంటాయి. చదువుల్లో పడ్డాక గానీ నెమ్మదించవు.

"రేపెళ్ళిపోతున్నా !" అని పదేళ్ళ నాడు అమాయకంగా, దిగులుగా శివ చేతిని పట్టుకొని చెప్పిన చిన్నారి జరీనా.. ప్రతి ఏడు చెప్పినట్లే ఇప్పుడూ చెప్పింది. అయితే దానికి జోడింపుగా అన్న ' మళ్లీ వస్తానో ..రాలేనో ' మాటకు చివ్వున చూశాడు శివ.

"ఏం? ఎందుకని ? ఏదన్నా ఉద్యోగం లో చేరుతున్నావా" హాస్యంగా అడిగాడు .

గాఢంగా నిట్టూర్చింది జరీనా. " అవును. తీరికలేని దొరకని భార్య ఉద్యోగం ."

"ఏమిటీ?" ఆశ్చర్యపోయాడు శివ . "చెప్పనేలేదూ!"

" హుమ్ ! ఎందుకో చెప్ప బుద్ధి కాలేదు!"

"అదేమిటి ? నీ నిఖాకు మేమంతా రావద్దా ?" అమాయకంగా అడిగాడు.

"వద్దు రాలేరు . చాలా దూరం !" జరీనా కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి.

"అది కాదు జరీనా...." శివ మాటలు వినిపించుకోలేదు. అతని చేతి మీద ముద్దు పెట్టుకొని పరుగున వెళ్ళిపోయింది.

అతని ముంజేతి పైన ఆమె పెదవుల తడితో పాటు కన్నీటి చుక్కలు ఉన్నాయి. వెళ్లిపోతున్న జరీనా వేపే నిర్ఘాంత గా చూస్తుండిపోయాడు శివ .

ఆమె కనుమరుగయ్యాక.. ఎడంచేత్తో షర్ట్ గుండీలు తీసి కుడి ముంజేతి పై ఉన్న ఆమె కన్నీటి తడిని గుండెకు రాసుకున్నాడు. అదలా గుండె లోపలికి ఇంకిపోయిందన్న భావంతో కళ్ళు మూసుకున్నాడు.

ఆ కన్నీటి చుక్క అతని గుండెలో పదిలంగా దాచబడింది. అప్పుడప్పుడు వెన్నెల్లో పిల్లల ఆటలు చూస్తున్నప్పుడు జరీనాతో ఆడుకున్న ఆటలు, చెప్పుకున్న ఊసులు అతని పెదవులపై చిరునవ్వు పూయిస్తూ కంట్లో ఆనంద భాష్పం అవుతుంది .ఎడబాటు జ్ఞాపకాల బరువు బుగులైనప్పుడు అస్రుకణమై కంటిని చెమ్మగిల్లిస్తుంది.

పేదరిక కల్పతరువు ధనం! ధనానికి.. కడుపుతీపి, కన్న మమకారం అమ్ముడై పోయింది. దుబాయి సేట్ జమానాలో కి జరీనా ఒక వస్తువులా కొనబడి కనబడకుండా పోయింది. ఏళ్ళు గడిచిపోయాయి. జరీనాతో చెలిమి తన జీవితాన్ని వెలిగించే ఒక మధుర స్మృతి. తోడు రాలేదన్న చిరు చేదు వెలితి!

ఆ రోజు పనిమీద పీర్ల వీధిలో వెళుతుంటే జరీనా పెద్దమ్మ ఇంటి నుండి ఏడుపు వినబడింది .ఆగి లోపలికి వెళ్ళాడు. రషీద్ చాచాకు ఈమధ్య ఆరోగ్యం బాగుండడం లేదని విన్నాడు. వెళ్లి చూద్దాం అనుకుంటునే మర్చి పోతున్నాడు. ఏమైందో అనుకుంటూ గుమ్మం దగ్గర ఆగి "పెద్దమ్మా!" అని పిలిచాడు. జరీనాతో పాటు పిలిచి అలవాటైన పిలుపు.

కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ వచ్చిన పెద్దమ్మ శివను చూసి లోపలికి పిలిచింది .

"రా నాయనా ! కూర్చో!"

మంచం మీద దిగాలుగా కూర్చున్న రషీద్ చాచాను పలకరించాడు ఆరోగ్యం ఎలా ఉందంటూ.

"మాకేం నాయనా! బాగానే ఉన్నాం ! మా జరీనాకే బాగా లేదట. ఇప్పుడే ఫోన్ చేసింది మా చెల్లి." చేతిలో సెల్ ఫోన్ పక్కన పెడుతూ చెప్పింది పెద్దమ్మ.

"డబ్బు కోసం ముసలాడితో పెళ్లి చేసి దాని గొంతు కోశారు. ముసలాడు ఎంతకాలం బతుకుతాడు? వాడు చచ్చాడు. అతను చచ్చాక జరీనాకు సవతులతో, వాళ్ళ పిల్లలతో కష్టాలు ఎక్కువైనాయి. దాని అదృష్టమో, దురదృష్టమో దానికి పిల్లలూ పుట్టలేదు. ఆరోగ్యం బాగా దెబ్బతిందట. భరించలేక తిరిగి వచ్చేసింది. ఇక్కడకు రావాలని ఒకటే ఏడుపట .పెళ్ళయ్యే దాకా ప్రతి ఏడూ ఇక్కడకు వచ్చేది కాదూ! మీరంతా ఆడుకొనేవాళ్ళు!"

తనకు గుర్తు లేదేమోనని చెప్తోంది పెద్దమ్మ. శివ పెదవుల మీదో జీవం లేని నవ్వు. మరచిపోతే కదా గుర్తు చేసుకోవడానికి అన్న తలపు.

"పంపించమన్నాను" పెద్దమ్మ కన్నీళ్ళు తుడుచు కుంటూనే ఉంది.

పిల్లలు లేని పెద్దమ్మకు జరీనా అంటే ప్రాణం. అందుకే ప్రతి సెలవులకు జరీనాను తీసుకు వచ్చేసేది. ఇక్కడే ఉంచేసుకుంటానంటే చెల్లెలు ఒప్పుకునేది కాదు. గంపెడు పిల్లలు. సంసారమాయె! పెద్ద పిల్ల జరీనా లేకపోతే పనులు చేసుకోవడం ఆమెకు కష్టం. వేసవి సెలవుల కైనా పెద్దమ్మ బలవంతంగా తీసుకు వచ్చేది. ఇక్కడ గడిపే ఆ కొన్ని రోజులే జరీనా జీవితంలో మిగిలిన ఆనందాల బాల్య స్మృతులు!

"జరీనా ఎప్పుడొస్తుంది పెద్దమ్మా?" అడిగాడు.

"రేపు పొద్దున వస్తది నాయనా !"

శివ లేచి వచ్చేసాడు. గుండెలో ఉన్న జరీనా కన్నీటి చుక్క కలతగా కదులుతోంది. మరుసటి రోజు కోసం రాత్రంతా కళ్ళల్లో జ్ఞాపకాల సుడులు తిప్పుకుంటూ ఎదురుచూశాడు.

తూర్పు తెల్లవారగానే కృష్ణమ్మ ఒడ్డుకు వచ్చేశాడు. తమది కృష్ణమ్మ రెండు పాయల మధ్య ఉన్న లంక గ్రామం. ఊర్లోకి రావాలంటే పడవలో రావాల్సిందే . కాసేపటికి పెద్దమ్మ, రషీద్ చాచా వచ్చారు. వాళ్ళు లేకపోతే జరీనాను అసలు గుర్తు పట్టలేక పోయేవాడేమో!

నిమ్మపండు రంగు మేనిఛాయతో, నల్లగా మిలమిలలాడే చేప కళ్ళతో, ముద్దమందారంలా బొద్దుగా ఉండే జరీనా... వడలిన ఒంటి రేకు మందారంలా సడలిపోయింది. ఒంట్లో ఏమాత్రం సత్తువ లేదు. పీక్కు పోయిన మొహం, గుంతలు పడ్డ కళ్ళు , శ్రావణ కృష్ణవేణి లాంటి ఒత్తయిన జుట్టు ...రోహిణి కార్తె

లో ఎండిన ఏరులా పలచబడి పోయింది. నివ్వెరపోయి చూస్తూ నుంచున్న శివను చూసి శుష్కహాసం చేసింది జరీనా. ఆమె కళ్ళు కృష్ణమ్మ మీద పడి తళతళ లాడుతున్న బాల భానుడి కిరణాల్లా మెరిసాయి. నడవలేక తూలిపోతున్న జరీనాను అప్రయత్నంగా పట్టుకున్నాడు .పెద్దమ్మ, రషీద్ చాచాలతో మెల్లగా ఇంటికి చేర్చి మంచం పైన పడుకోబెట్టాడు.

చాచా వరండాలో కూర్చున్నాడు. పెద్దమ్మ వంటింట్లోకి నడిచింది టీ తెస్తానంటూ.

“రేపో మాపో వెళ్ళిపోతున్నా ! వెళ్లే లోపు నిన్నో సారి చూడాలని ప్రాణాలుగ్గ పెట్టుకుని వచ్చా!“ జరీనా తృప్తిగా, కళ్ళారా చూస్తూనే ఉంది కన్నార్పకుండా.

“రాత్రికి కృష్ణమ్మ దగ్గరకు వెళదామా?“

గుండె గొంతుకలో అడ్డుపడినట్లు మాట పెదవి దాటడానికి గింజుకొంటోంది. శివ మౌనంగా ఆమెనే చూస్తూ తలూపాడు సరేనన్నట్లుగా.

శివ చేతిని వదలలేదు జరీనా. రెండు చేతులతో బిగించి పట్టుకుని గుండెల మీద పెట్టుకుంది . బలహీనంగా కొట్టుకుంటున్న ఆమె గుండె సడి అతని చేతి గుండా గుండెలోకి చేరి ఏం చెబుతోందో అతనికే తెలియాలి. ఒక రహస్యం ఏదో వాళ్ళ మధ్య ఉన్నట్టు మాటల్లోకి రాని మౌనమే ప్రేమా?!? ‘తన స్వంతం’ అనుకోకుండా ప్రేమించటం ఎంత గొప్ప భావన! ఆ భావ ప్రసారం జరుగుతూందేమో! రెండు ఆత్మల మధ్యగల ప్రేమే ఐక్యము, శాంతి కదా ! ఆ శాంతిని పొందిన నాడు రెండు దేహాల మధ్య మోహం ఊహకు కూడా రాదు.

జరీనా పక్కనే కూర్చుని ప్రశాంతంగా ఉన్న ఆమె మొహంలోకి మొహం పెట్టి చూస్తున్నాడు శివ తదేకంగా!

ఇన్నేళ్లుగా గుండెల్లో భద్రంగా దాచుకున్న జరీనా కన్నీటి తడి కంటిలోకి చేరి నెమ్మదిగా జరీనా నుదిటి పైకి జారింది దిద్దని బొట్టులా!

కవిత

# గాయపడిన గుండె గీతం



- సుమనప్రణవ్

ఈ దుఃఖమెపుడూ నను కొత్త రాగంతో పలుకరిస్తూనే
ఉంటుంది
అహమో ఆశల ఆశానిపాతమో
గుండె లోతులను దుఃఖపుటలలతో ముంచుతూనే ఉంటుంది
ఛిద్రమైన గుండె కలల శ్వాసల చప్పుడో
మూగబోయిన ఆత్మ విశ్వాస వీణా నాదమో
కటిక చీకటిని మోయలేనంటూ
రాతిరి భుజంపై ఒరిగి వెక్కిళ్ళు పెడుతుంది
అప్పటి వరకు నాది నాదనుకొనే భావ లాలసం
ఉన్నట్టుండీ శూన్యమయి ఒంటరితనం రెక్కలు తొడిగి ఆ
దూర అరణ్యాల తోవలోనికి నెట్టేస్తుంది
వసంత పరిమళాలను అద్దుకొంటూ
ఒక్క చిగురాకు కూడా కదలదేం నేస్తమా!
ఈ నా గుండె గొంతుక గద్గద స్వరం నాకు వింతేం కాదు
సుమా!
యుగాల నాటి నుండీ చీకటి మౌనాల కాలదన్ని వేకువలను
పల్లవించిన దిగంతాన్ని కదూ నేను!
ఒక్క కోయిల గీతం కూడా వినిపించదేం మిత్రమా!
కాలిన కలల విత్తులను నేను వచ్చే దారంత చల్లుకొంటూ
వచ్చిన దాన్ని
ఆకాశమంత అమ్మతనం నాకు కొత్తేం కాదు చైత్రమా!
కన్నీటి చారలలో వెన్నెల తరగలను అద్దుకొని రేపటి
ఉషస్సుల కోసం కళ్ళార్పక ఎదురుచూస్తున్న దాన్ని
నీవు నీ ద్వంద్వ నీతితో గాయం చేస్తూపో
నేను నిశ్శబ్దంగా గెలుపు ఊపిరితో అంటు కట్టుకొని
కొత్త వనాలలో వెలుతురు రెమ్మలకు ధైర్యం మొగ్గలేస్తూనే
ఉంటాను..
ఘనీభవించిన కాలం మడుగులలో
రక్తమోడుతున్న మమతల అడుగులతో
మరో ప్రపంచాన్ని సృష్టిస్తూనే ఉంటాను..

కథానిక

# పూలోం కా యాదోం మే......

కంచెర్ల శ్రీనివాస్

పూలు ఆడోళ్లకోసమో, ఆడోళ్ళు పూలకోసమో ఎవరు ఎవరికోసం ఎదురు చూస్తుంటారో కానీ సరిగ్గా సన్నజాజులు మొగ్గలవుతుండే సాయంత్రాల్లో అమ్మాయిలో ఆడోళ్ళో సరాసరి మాఇంటి వెనుకకు నడిచొచ్చేవాళ్ళు.. గ్లాసో, ప్లేటో తీసుకొచ్చిన తీరు చూడగానే మా అమ్మమ్మతోపాటు నాకూ అర్థమయ్యేది వాళ్ళెందుకొచ్చారో.. వాళ్ళొచ్చే టయానికి నేను అమ్మమ్మతో కలిసి రుబ్బురోలుకాడ పిండి రుబ్బుతుండేటోడ్ని.. నిక్కరు, వంటిమీద చొక్కాకూడ లేకపోటాన ఆడోళ్ళను చూసి సిగ్గుపడేటోడ్ని.. ' చల్.. ఈపూల ఎవ్వారం పొద్దునుంటే బాగుణ్ణు, లేదంటే ఈపిండి రుబ్బింగ్ ఏమద్యానం పూటో ఉంటే పోయేది ' అనుకుంటుండేవాడ్ని.. నాకన్నా పెద్దోళ్ళతో ఏపేచీలేదు అసలా సోయేఉండేది కాదు కానీ నాతరగతోళ్ళో, నాఈడోళ్ళో పూలకొచ్చినప్పుడు తెగ ఇబ్బంది పడేటోడ్నబ్బా.. ఎందుకంటే ఆడోళ్ల పనులు చేస్తున్నానని ఎక్కడ కిసుక్కుమంటారో బయట ఆటలప్పుడు ఎక్కడ గేలి చేస్తారో అని..

గిద్దె, లేదా పాతిక లెక్క సన్నజాజులు అమ్మేది.. ఎంత కొసరినా రొండు పూలుకూడా కొసరేసిదికాదు.. అర్దో, రూపాయో పూలడబ్బులు ఉద్దెరలేదు ఏరోజువి ఆరోజే ఇచ్చేయాలి..

' చెట్టుమీద చెయ్యేయకు '.. అమ్మాయిలో, ఆడోళ్ళో ఆ మాటకు హడలిపోయేవాళ్ళు.. పూలు కొనేందుకొచ్చి చెట్టు మీద వాటిని చూసిన ఆనందంలో ఎవరన్న చనువుగా తెంచబోతుంటే అమ్మమ్మగాంగ్రింపు కు జడుసుకునేవాళ్ళు..'బద్దరమ్మాదీనిపేరు గద్దరమ్మా ' అని మనసులో అనుకునేటోళ్ళు.. (ఎంత గద్దరిదో తరువాత చెబుతా) ఎవరు పడితే వాళ్ళు చెట్టుమీద చెయ్యేస్తే మైల తగిలి చెట్టు ఎండిపోతుందని ఆమె అభిప్రాయం.. మేం మంచిగనే ఉన్నాం అని వాళ్ళు సమాధానమిస్తుండేటోళ్ళు కానీ మంచిగుండటం అంటే ఏంటో అప్పుడు నాకు అర్థం కాలేదు..

' కోసియ్ పోరా ' అని అనగానే రుబ్బింగ్ కు బ్రేక్ దొరికిందని ఊపిరి పీల్చుకునేటోడ్ని.. రుబ్బురోలు పక్కనే ఉన్న మా అమ్మ యారాలు కన్నమ్మ అమ్మమ్మ ఇంటికి మాఇంటికి మధ్య పొత్తులో ఉన్న ఉన్న పొడవాటి మట్టి గోడెక్కి ఒకోకొమ్మను ఎత్తి సన్నజాజి గుత్తులు వెతికి కోసేటోడ్ని.. కోసేటప్పుడు పచ్చి మొగ్గలు (ఇంకా తయారు కానివి ) కోస్తే వాళ్లముందే తిట్లు తినాల్సొచ్చేది.. కోసుకొచ్చిన మొగ్గల్ని అయిదైదు చొప్పున లెక్కేసి అమ్మేది.. పండుగలో, శుభకార్యాలు వంటి ప్రత్యేక రోజుల్లో కొందరు రేపు మాకు ఇన్ని పూలు కావాలని ముందురోజే చెప్పిపోయేవారు.. అలా చెప్పినప్పుడు మొగ్గల్ని మద్యాన్నం మూడు, నాలుగింటప్పుడే కోసేవాళ్లం.. ఆ పందిరికింద వెడల్పాటి గాబు గాబును ఆనుకొని అంట్లు తోముకునేందుకు జాలారు ఉండేది కోసినమొగ్గలు తాజా తనం చెడకుండా ఆగాబులోవేసేవాళ్లం అలా వేసిన రోజు ఆగాబులో నీళ్ళకు గుడిలో అయ్యవారు పోసే తీర్థం అంత పవిత్రత చేకూరినట్టు అనిపించేది నాకు..

' ఏం పెట్టుబడి పెట్టట్లేదు శ్రమ పడట్లేదు, కాసిన్ని నీళ్ళుపోస్తే పూసే పూలు కదా.. ఆడోళ్ళకు ఉట్టిగానే ఇచ్చేస్తే ఏం పోయే.. ఈముసల్దానికి ముత్తైదు తనం పెందలాడే పోయింది కదా.. పూలుదానం చేస్తే వచ్చే జన్మకైనా సౌభాగ్యం నిలుస్తుందన్న ధ్యాసేలేదు ' అని అనుకుంటుండేవాడ్ని..

సన్నజాజిని అలా పిలవటం నాకు నచ్చేదికాదు.. దాని పరిమళం ఘనంగానే ఉండేది కనుక దాన్ని 'లావుజాజి ' అనాలి అనుకునేవాడ్ని అప్పట్లోనే.. ఆడోళ్ళు అసూయపడేంత అందంగా నాజూగ్గా ఉంటుంది కనుక బహుశా ఆ పేరొచ్చుంటుందేమో అనుకునేవాడ్ని.. ఆసువాసన, అంత వొయ్యారం, అంత తెల్లదనపు సౌందర్యంకనుకే ఆడోళ్లుఫిదా అవుతారాపూలకు .. పూలు సువాసనేస్తాయేమో కానీ విచ్చినవాటికన్నా విచ్చుకోబోయే మొగ్గలదే అందమంతా..

' చెట్టు పెట్టే చెల్లెలుంది కానీ అల్లుపెట్టే అన్న లేదు అల్లుపెడితే అడిగినన్నియ్యనా ' అంటుంది చెట్టు.. అని సన్నజాజి చెట్టును చూస్తూ అనేది అమ్మమ్మ..

అమ్మమ్మ ఇంటి వెనుక ఆసన్నజాజి తీగఎవరు నాటారో ఎప్పుడు నాటారో తెలీదు కానీ పందిరంతా అల్లుకొని పచ్చగా

ఉండేది.. వేసవి కాలాల్లో అదెక్కువగా పూలు పూసేది.. దాని సృష్టి కర్త బహుశా మాఅమ్మమ్మొ...లేకపోతే మా లాలయ్య తాతో (అమ్మమ్మ అన్న) తెలీదు కానీ.. దానికి పందిరి పెట్టటం , మొదట్లో వెడల్పు పాదు చెయ్యటం , నీళ్ళు పోయటం నేను లాలయ్య తాత చేసేవాళ్లం.. లాలయ్యది అమ్మపాలెం గ్రామం భార్య పిల్లలు లేనోడు కనుక నెలలో రొండు మూడు సార్లు చెల్లెలు (మాఅమ్మమ్మ) దగ్గరికొచ్చేవాడు.. ఆయనకు నలుగురు పెళ్ళాలట వాళ్ళేమయ్యారో తరువాత చెపుతా..

ఏడాదికోసారి లాలయ్యతో సన్నజాజి పందిరి మార్పించేది అమ్మమ్మ.. అందుకోసం ఊరినుంచి కంది కట్టె మోపులు ఎడ్ల బండిపై వేసుకొచ్చేవాడు.. ఆయన, అమ్మమ్మ ఇద్దరూ కలిసి పనిదిరేస్తుంటే నేను వాళ్లకు కట్టలు అందించటం లో కట్లు బిగించటం లో సాయం చేసేవాడిని.. అప్పట్లో మాఊరు (కామంచికల్ నుంచి తోలుకొచ్చిన గేదెను ఇంటివెనుకే కట్టేసేవాళ్లం గేదెను ఉదయం పూట జంగిరిగొడ్లకు విడిచినప్పుడో, సాయంత్రం మరలా ఇంట్లోకొస్తున్నప్పుడు అదో దాని బుజ్జి దూడో కొమ్ములు ఇరికించి తీగెను పాడుచేయకుండా ఆకాసేపు కాపలా కాసేవాళ్ళం..

చెట్టు మొగ్గకొస్తుందనగా ఆకులు దూయటం, కాత పూర్తవుతుండగా వేసిన కాయల్ని తెంచి పారేయటం, ఎండు కొమ్మల్ని తుంపేయటం నాదే డ్యూటీ.. చెట్టు బలం కోసం తన హోటల్ లో వాడిన టీపొడిని ఎరువుగా వెసేది అమ్మమ్మ. ఇంట్లో కిరాయికి ఉన్నోళ్లనీ వాళ్ల వేస్ట్ టీపొడిని చెట్టు మొదట్లో వేయండని ఆజ్ఞాపించేది..

అలా నా సన్నజాజి సేవ చాలాకాలం సాగింది.. ఆతరువాత చాలా కాలానికి మా అత్తగారు వెనుక ఇల్లుకడుతున్నప్పుడు నిర్మాణానికి అడ్డొస్తోందని ఆచెట్టును తొలగిస్తున్నప్పుడు బాధేసింది.. ‘ ఎలాగైనా నన్ను రక్షించు ‘ అని నన్ను ప్రాధేయపడుతున్నట్టు అనిపించింది.. చివరకు నన్ను చూస్తూ చూస్తూనే అది ప్రాణం వదిలింది.. దానిని తొలగిస్తున్నప్పుడు పగిలిన అత్తరుబుడ్డిలా నా బాల్య పరిమళం వ్యాపించింది.. ఆరోజు నేను అక్కడ ఉండకుంతే బావుండేది అనుకున్నా అమ్మమ్మ కూడా తన జ్ఞాపకాల్ని తలపోసుకుంది.. మొగదిక్కు లేని ఇంటికి చెట్టు కొడుకై ఎట్లా అండగా నిలిచిందో తలుచుకొని ఏడ్చింది..

**కవిత**

# తను



**రామానుజం సుజాత**
**మొబైల్ :9014478998**

శ్వాసిస్తున్న ఎదను పిండేస్తూ
మెదడు మొదలు పాదాల చివర్లంటూ....
అణువణువు తడవలు తడవలుగా
తడ తడమంటూ దేహాన్ని కుదిపేస్తూ
ప్రాణం ఋతు ఛక్రమై తిరుగుతూ
పచ్చిగాయాన్ని పిండేస్తూ
ఋతుక్రమం స్రవిస్తుంటే
ప్రకృతి నిభద్దురాలై తను నరకాన్ని చవిచూస్తూ......
భరింపబడని వేదనేదో పంటిబిగువన
కంటినీరవుతుంటే........
ఒళ్లంతా పరిశ్రమై ఉత్పత్తి చేస్తున్న
ఎరుపు ధారలను పురిటి నొప్పుల వేదనల్లో
ఋతుక్రమం స్రవిస్తుంటే
ప్రకృతి బధ్ధురాలై తను
క్షణానికో ఘడియ జన్మిస్తూ......
ఉద్భవిస్తున్న రుధిర ధారలు
నరనరాల్లో ప్రవహిస్తూ.......
సహనాన్ని ఖాళీ చేస్తుంటే
ఆహార్యపు అంచులు దాటాలనే
అసహనాన్ని పిడికిలి చాటున అదుపుచేస్తూ.....
చలిస్తున్నయాతన పంటిబిగువున
భరిస్తూ సృష్టికి ప్రతి సృష్టి పొందిన
తను ఋతుక్రమం స్రవిస్తూ..
స్త్రీ కిది వరమో భాగ్యమో తాను జన్మిస్తూ
జననమిస్తూ.........



# వంటింటి వస్తువులతో మహిళా రూపాలు

**- డా. కందేపి రాణీప్రసాద్**



మహిళా దినోత్సవాలు ప్రపంచమంతా గొప్పగా జరుపుకుంటున్నా, మహిళా సాధికారిత అని నినదిస్తున్నా మహిళల ప్రగతి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉన్నది. మహిళలు దేశాల నేతలున్నా ఆడపిల్ల అనగానే అబార్షన్లు మానటం లేదు. ఆకాశంలో సగం, అవనిలో సగం అని నినాదాల లోనే కానీ అవకాశాలలో వెనక వరసలోనే నిలబెడతారు. సమాజాన్ని మేల్కోలిపే రచనలు చేస్తున్న స్త్రీలు సైతం సమాజంలో ద్వితీయ శ్రేణి పౌరులు గానే గుర్తించబడుతున్నారు. వారి శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఎన్ని చట్టాలు వచ్చినా వారి సమస్యలకు పరిష్కారాలు కనుగోనబడవు. గృహ హింస నిరోధక చట్టమైనా, ఆస్థిలో సమన హక్కు అయినా బలవంతులదే రాజ్యమైనపుడు వాటికీ విలువ ఏది' ఇది ఈ నాటి మహిళల పరిస్థితి.

సిరిసిల్లకు చెందిన ప్రముఖ చిత్రకారిణి డా.. కందేపి రాణీప్రసాద్ మహిళల స్థితిగతుల పై అరవై చిత్రాలను చిత్రీకరించారు.ఈ చిత్రాల నన్నింటినీ అంతర్జాతీయ బాలికల దినోత్సవం నాడు సిరిసిల్ల లోని సృజన్ పిల్లల హాస్పిటల్ లో ప్రదర్శనకు పెట్టారు. కేవలం వంటింటి వస్తువులు, ఆకులూ, పువ్వులు వంటి ప్రకృతి లో దొరికే వాటితోనే మహిళల చిత్రాలను రూపొందించారు.

డా.. కందేపి రాణీప్రసాద్ అక్టోబర్ 19వ తేది 1969నా జన్మించారు. తల్లిదండ్రులు ఆంగలకుదిటిగోవిందమ్మ, సుందరాచార్యులు. ఏమ్. ఏ తెలుగు సాహిత్యము, ఎం.ఎస్సీ జంతు శాస్త్రము చదువుకున్నారు. కాలేజీ విద్యార్థిగా సైతం ఎన్నో బొమ్మల్ని వేసి బహుమతులు గెలుచుకున్నారు. వయోజన విద్య, అడక్పిల్లల అక్షరాస్యత లపై కార్టూన్లు గీసి తను చదివిన వై. ఎ గవర్నమెంట్ వుమెన్స్ కాలేజిలో ఎగ్జిబిషన్ నిర్వహించి లెక్చరర్ల ప్రశంసలు పొందారు.

రాణిప్రసాద్ భర్త డా.. కందేపి ప్రసాద రావు ప్రోత్సాహంతో నాగార్జున విశ్వవిద్యాలయం నుండి పి హెచ్ డి పట్టాను పొందారు. భర్త పిల్లల డాక్టరు కావడంతో రాణిప్రసాద్ పిల్లల హక్కుల పట్ల పిల్లా బాధల పట్ల దృష్టి సారించారు. తల్లిదండ్రుల అత్యశలు, స్కూళ్ళ నిర్వాహకుల పేరాశలకుబాలి అవుతున్న బాల్యాన్ని అక్షర బద్ధం చేస్తున్నారు. బాలలు స్కూల్లో చేస్తున్న వెట్టి చాకిరీ, వాళ్ళు కోల్పోతున్న బాల్యం పట్ల బాలల గొంతుకయై ప్రశ్నిస్తున్నారు. బలల్ యొక్క సమస్యలను గురించి, వారికీ కావాల్సిన ఓదార్పు గురించి, వారు మోస్తున్న అధిక భారం గురించి రాణిప్రసాద్ ఇప్పటి వరకు నలభై అయిదు పుస్తకాలను రచించారు.

రాణిప్రసాద్ తమ పిల్లల హాస్పిటల్ లో భర్తకు సహాయం చేస్తూ పిల్లలను దగ్గర నుండి పరిశీలించటం మొదలుపెట్టారు. పిల్లలతో పటు వచ్చే తల్లులను, అమ్మమ్మలను, నాయనమ్మల జీవితాలను, సంఘర్షణలను గమనించటం మొదలయింది. దాంతో మహిళల చిత్రాలను గీయాలనే తలంపు వచ్చింది. ఆమె స్వహతగా చిత్రకారిణి కావటం వాళ్ళ మామూలుగా పేపర్ పెన్సిల్ గా కాకుండా విభిన్నంగా చేయాలనుకున్నారు. అప్పుడే ఆమెకో ఆలోచన వచ్చింది. స్త్రీలు అంటే వంటింటికి మహారాణులుంటారు. వంటింటి సామానుతోనే మహిళల చిత్రాలనుచేయాలనుకున్నది.మహిళలసమస్యలుమొదలయ్యేది వంటింట్లోనే. అందుకే అక్కడ నుంచే మొదలుపెట్టారు. వంటింట్లోని కంది పప్పు, మినపపప్పు, శనగపప్పు మొదలుకొని

ఎండు మిరపకాయలు వెల్లుల్లి పాయలు తో సహా టి పొడిని, కాఫీ పొడిని వదలకుండా రోజుకో చిత్రం చేయటం మొదలు పెట్టారు. తయారైన చిత్రాలను సోషల్ మీడియాలో పెట్టినపుడు అద్భుతమైన స్పందన రావడంతో మరింత ఉత్సాహంగా కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో సైతం మహిళల్ని చిత్రించడం మొదలు పెట్టారు. పెరట్లో కుండిల్లో ఉన్న చెట్ల ఆకులు, పువ్వులతో సైతం బాలికలు, స్త్రీల చిత్రాల్ని తీర్చిదిద్దారు. పువ్వులకు స్త్రీలకు అవినాభావ సంబంధమున్నది. స్త్రీలు కూడా పువ్వులంత సుకుమారులని, సున్నిత మనస్కులని పురాణ కాలం నుండీ మహాకవులు వర్ణిస్తూ వచ్చారు. కాబట్టి పూలతో బాలికలను చిత్రించడం సబబు అనుకున్న రాణిప్రసాద్ పూలను ఆకులను సైతం వనితల చిత్రాల రూప కల్పనలో వాడుకున్నారు.

రాణిప్రసాద్ అంతకు పూర్వం కూడా మహిళల అక్షరాస్యత శాతం పెరగాలని, అబార్షన్లు, ఎనీమియా వంటి సమస్యల పట్ల స్పందించి బొమ్మలు తయారు చేశారు. ఎలాంటి సామాజిక సమస్య అయినా మహిళల్ని చేరితే పరిష్కారం సులువు అవుతుందని భావిస్తారు రాణిప్రసాద్. అందుకే మహిళలు మెచ్చే ముగ్గులుగా సామాజిక సమస్యల్ని చిత్రీకరించారు రాణిప్రసాద్.


రాణిప్రసాద్ తమ హాస్పిటల్ కు మేనేజింగ్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తూ పిల్లల కోసం ఒక బాలసాహిత్య లైబ్రరీని, ఒక బొమ్మల మిల్కీ మ్యూజియంను పెట్టారు. డాక్టరు పిలిచేదాకా ఉన్న ఖాళీ సమయాన్ని పిల్లలు తల్లులు బొమ్మలు, పుస్తకాలు చూస్తూ విజ్ఞానం పెంచుకుంటారు.

రాణిప్రసాద్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ జిల్లా సాహితీ వేత్త అవార్డును అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం వారు ఉత్తమ రచయిత్రి పురస్కారాన్నిచ్చి గౌరవించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో సుమారు నూట యాభై పురస్కారాలను అందుకున్నారు రాణిప్రసాద్. ప్రతిష్టాత్మక తెలుగు విశ్వవిద్యాలయంలో శ్రీ అంగలకుదిటి సుందరాచారి స్మారక బాలసాహిత్య కీర్తి పురస్కారాన్ని నెలకొల్పారు రాణిప్రసాద్ దంపతులు.



కవిత

# అవకాశవాదులు



- శ్రీదేవి సురేష్ కుసుమంచి
ఫోన్ : 7032760484

వాళ్ళు నీ చుట్టే నీడలా భ్రమణం చేస్తున్నారంటే
ప్రొద్దుతిరుగుడు సహజగుణాన్ని వాళ్ళకి ఆపాదించబోకు..
నిదురలో కూడా...
ఒక్కసారి గ్రహణం పట్టిన
సూర్యుని లా పలకరించి చూడు..
నీలో ఆ దైవం ప్రసాదించిన నవరసాలను ఒంపుచూ...
నిన్నటి వరకూ స్నేహపరిమళాలు
వెదజల్లే పుష్పాలు పూసే ఆ వసంతకాల పెదవులపై
ఒక్కసారిగా శిశిర ఛాయలను అద్దుకుని...
ఎనలేని గ్రీష్మసెగలని కురిపిస్తాయి..,
చలనమున్న జంతుజాలములో
నీ స్థానమున్నదనుకుంటే
ఒక్కసారి గ్రహించు
గుంటనక్కల్లా పొంచివున్న
గుణాలనే కవచకుండలాలుగా
ధరించే అవకాశవాదులని..

కథ

# పెరటి గోడ



- విజయ గోలి

పిన్నిగారూ వర్ధనమ్మ గారి కోడలికి ఆడపిల్ల పుట్టిందంట. పక్కింట్లో పార్వతి పెరటి గోడ దగ్గరకొచ్చి గట్టిగాచెప్పింది .సీతాలికి అంట్ల గిన్నెలు వేస్తున్న రాజేశ్వరి.

అవునా ఆడపిల్లా అయ్యో ఎప్పుడూ అంటూ గోడ వైపు నడిచింది. తేలిక కాన్పేనా సమాధానంచెప్పేలోపే పోనీలే ఏదో ఒక పిల్ల. ఏడాదిన్నర దాటింది పెళ్ళి జరిగి. ఏ నెల కా నెల ఎదురు చూడటమేవర్ధనమ్మ. మంచి రోజు పుట్టిందిలే. శుక్ర వారం శ్రీ మహా లక్ష్మి పుట్టింది.

అమ్మగారు నా పని తెమల్చండి ఇంకా షావుకారి గారింటికి వెళ్లాలి. సీతాలు కేక.

వస్తున్నానుండవే ఒక్క నిమిషం ఆగవు. మళ్ళీ మర్చి పోతానేమొ సుబ్బిని బట్టలు తీసుకు వెళ్లటానికిరమ్మను.

మొన్న తీసుకెళ్లినవి తేనేలేదు కూడాను.

మధ్యాహ్నం మాట్లాడుతా లే పార్వతీ

మీ బాబాయి గారికి ఇష్టమని కంది పచ్చడి చేసాను. ఒక నిమిషం అక్కడే వుండు. వంటింటి వైపు అడుగులేసింది రాజేశ్వరి.

ఇది రోజూ జరిగే విషయమే. ఏదో ఒకటి ఇచ్చి పుచ్చుకుంటూ గంటలు గంటలు ఊరి కబుర్లు మాట్లాడుకుంటూ కాలం దొర్లించటం. తెలిసినంతవరకు అన్ని చర్చలకు ఆ పెరటి గోడ మాత్రమే వేదిక.మధ్య మధ్య లో వీరి మధ్య కూడా చిన్న చిన్న మాట పట్టింపులు రావటం సర్దుకు పోవటం. వీటన్నిటికీ సాక్షి 5 అడుగుల పెరటి గోడ. ఇక్కడి అసలు విషయం అది కాదు.

80 నుండి 100 సంవత్సరాల మధ్యలోకి వెళితే పల్లె టూర్లలో సామాన్యంగా ఆడవాళ్ళ జీవన విధానంఇలాగే వుండేది. ఆరోజుల్లో పల్లెలే ఎక్కువ వుండేవి. ఆవూరే వాళ్ళ ప్రపంచం. ఊళ్లో వున్న 300 గడపలలో ఏమి జరిగినా అది వారికి పెద్ద వార్త. ఒక ఎలిమెంటరీ స్కూలు, 5వతరగతి వరకు. ఒకే ఉపాధ్యాయుడు.ఆతర్వాత 6నుండి SSLC వరకు హై స్కూల్. అది కూడా రెండు మూడు పల్లెటూర్లకి ఒకటి వుండేది. ఇకకాలేజీ అనేది పట్నం లోనే.

అక్కడి వరకు ఆడపిల్లలు చదవటం చాలా తక్కువ. ఎలిమెంటరీ దాటాకే (కొంత మంది ఆఎలిమెంట్రీగడప కూడా తొక్కని వాళ్లే) చదివించాలా అవసరమా అంటూ చర్చలు జరిగేవి. ఇంట్లో కాస్తోకూస్తో చదువు నేపథ్యం వున్న వాళ్లు హై స్కూల్ లో చేర్చే వారు. ఆ తర్వాత కాలేజీల వరకు వెళ్ళే వారు చాలాతక్కువ మంది.

ఆడపిల్లకు చదువెందుకు? మొగుడు రాసిన ఉత్తరం ముక్క చదివితే చాలదూ కొట్టి పడేసిన రోజులు. అలాంటి సమయంలో కూడా చదువు మీద శ్రద్ధ తో పోరాడి గెలిచిన వారు వున్నారు. అప్పటికే చాలామంది విద్యావేత్తలైన మహిళలు, వైద్యులు, సాహితీ వేత్తలు, ముఖ్యంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహిళలు చాలా మంది మహిళా అభ్యుదయం కొరకు పోరాడారు.

అది ఒక సంధి కాలం స్త్రీ కి విద్య అవసరమా అనే చర్చలు విస్తృతంగా జరిగేవి.విద్య మహిళకుఅవసరమనే చైతన్యం అప్పుడప్పుడే మొదలవుతుంది. సతీ సహగమనాలు దాటిన పరిస్థితి. కన్యాశుల్కం కత్తి మెడమీద నొక్కుతూనే వుంది.ఇంకా బాల్య వివాహాల బంధాల్లో నే వున్నాము. చైతన్య పరిచే ఏ మీడియా కూడా లేదు .వార్తాపత్రికలు, ఆకాశ వాణి వున్నా అందరికీ అందు బాటులో లేదు. ఆ రోజులలో అన్నీ ఉమ్మడి కుటుంబాలే.

ఆడపిల్లలు ఇంట్లో అమ్మమ్మ, నానమ్మల సంరక్షణలో ఇల్లు చక్క దిద్దడం నేర్పించేవారు. ఆరోజుల్లో వివాహాలుకూడా మేనరికాలే. వారి సాంప్రదాయాలకు తగ్గట్లుగా చిన్నప్పటినుండే శిక్షణ ఇచ్చుకునే వారు .సినిమా ఒకమాధ్యమమే. కానీ ఆ కథలన్నీ ఆనాటి సామాజిక వ్యవస్థ కు దర్పణం పట్టేవి. ఆ సినిమా కూడాసంవత్సరానికి ఒకటి చూస్తే ఎక్కువ. వివాహమై అత్తవారింటికి వెళ్ళటం తప్ప గడప దాటే ప్రసక్తే లేదు.

ఈ కాలంతో అసలు ఏవిధంగాను పోల్చలేని పరిస్థితి.

సొంతగా ఆలోచించే అవకాశమే లేదు. ఆచరించటం తప్పు. అటువంటి వ్యవస్థ నుండి ఇలాంటిఅద్భుతమైన అభ్యుదయ పథంలోకి ఎలా రాగలిగాము అంటే ఎడతెగని పోరాటమనే చెప్పాలి. ఎంతోమందిసంస్కర్తల కృషి, దీక్ష అనే చెప్పాలి.

ఎందరో మహిళాభ్యుదయ వాదులు శ్రీ రాజా రామ మోహనరాయ్, స్ఫూర్తితో ముందుకొచ్చిన వారెందరోగురజాడ, కందుకూరి, చిలకమర్తి లాంటి సంఘ సంస్కర్తలు మహిళాభ్యుదయం గురించి చైతన్యవంతమైన పోరాటాలు చేసారు. శ్రీమతి సరోజినీ నాయుడు, కస్తూరి బా, తొలి మహిళా సంస్కర్తగా సావిత్రీ రావుపూలే, ఇందిరా గాంధీ.. ఆంధ్ర దేశం నుండి శ్రీమతి దుర్గా బాయ్ దేశముఖ్... ఉన్నవ లక్ష్మీ దేవి, దువ్వూరు సుబ్బమ్మ గారు. మొదలైన మహిళా మణులెందరో మహిళలకు రాజ్యాంగ పరమైన హక్కుల కొరకుపోరాటం చేసారు. ఉన్నత చదువుల కొరకు ప్రత్యేక కళాశాలలు నిర్మించి సమాజం లో స్త్రీ స్వేచ్ఛ కై ఎన్నోపోరాటాలు చేసి స్త్రీ శక్తి ని మేలుకొలిపారు. ఫలితాలను నేటి తరానికి అందించారు. ఈనాడు ఈ సాంకేతికవిద్యా వ్యవస్థలో పురుషులకు ఎందులోను తీసిపోరని నిరూపించు కోగలిగారు. ఆర్థిక స్వేచ్ఛను అవలీలగాఅందుకో గలిగారు.

ఈనాడు కూడా సాధికారత కొరకు పోరాటం చేస్తూనే వున్నాము. స్త్రీల మీద జరుగుతున్న అత్యాచారాలకు అంతులేకుండా వుంది. ఈ ఉపద్రవం నుండి బయట పడాలి అంటే, సంఘటితంగా కలిసి వచ్చిన రోజునతప్పక ఫలిత ముంటుంది. నిస్వార్ధంగా వారు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితమే నేడు సబల గాసమాజంలో తన సమర్ధతను చూపగలుగుతుంది.

వారిని స్ఫూర్తిగా తీసుకొని స్వార్ధ రహితంగా ముందడుగు వేసిన రోజు ఈ అకృత్యాలకు కూడా అడ్డుకట్టవేయగల ధీర నేటి మహిళ.

"పెరటి గోడ నుండి అంచెలంచెలుగా సింహ ద్వారం గడప దాటి తన మహోన్నత శక్తి చాటిన మహిళ" యుద్ధం అలవాటుగా మార్చుకుంది. తన సమస్యకు సమర శరాన్నే ఆయుధంగా మలుచుకుంది.

అందుకే పోటీలో, పోరాటంలో విజయ కేతనాలతో దేశ ప్రగతికి దారి చూపుతుంది. ఆత్మ స్థైర్యంతో ఆకాశంవైపు దూసుకు పోతుంది.

**కవిత**

# ఋణ బంధం



**శాంతి కృష్ణ**
**7416219305**

అందాల హరివిల్లు నీవు
చందనాల కొమ్మవు నీవు
నిశిరాతిరి కౌముది నీవు
వసివాడని కలువవు నీవు...

పెదవులపై హసించే పరిమళం నీవు
కన్నుల్లో వసించే కలువవు నీవు
హృది లోని సందడి నీవు
మది లోని హాయివి నీవు...

మబ్బు నుండి జారిన స్వాతి చినుకువు నీవు
మనసును తాకిన అల్లరి జల్లువు నీవు
ఊహల్లో మెరిసే మెరుపువు నీవు
వాకిట్లో కురిసే హిమ బిందువు నీవు...

వేసవిలో విరబూసే మల్లెల పరిమళం నీవు
మదినంటుకు పోయే తీపి జ్ఞాపకం నీవు
సృష్టికి ప్రతి సృష్టి చేసే బ్రహ్మవు నీవు
పేగు బంధం కోసం ప్రాణ గండం లెక్కించని అమ్మవు నీవు

మహిళా....
మహిలో అద్భుతమైన ఆవిష్కరణవు నీవు
మనిషి తీర్చుకోలేని ఆజన్మ ఋణబంధం నీవు !!
...........

కథ

# సమయానుకూలం



- P.L.N. మంగారత్నం

ఆ సాయత్రం చీకట్లు ముసురుతున్న వేళ ..

ఆఫీసు నుంచి ఇంటికొచ్చిన నాకు క్రింద సెల్లార్లో లగేజీతో ..

కదలడానికి సిద్ధంగా ఉన్న ఆటోకనబడడంతో ..'ఎవరో ఊరు వెళుతున్నారన్న మాట' అనుకుంటుండగానే .. పైనుంచి క్రిందకు దిగిన లిఫ్ట్ లోంచి ఆండాళ్ళు గారు హడావుడిగా బయటికొస్తూ " కాశీ త్రకు వెళుతున్నాం" అంటూ ఉత్సాహం చెప్పేసి వెళ్ళిపోయింది.

అవధానులు గారు అప్పటికే ఆటో దగ్గర, ఆవిడ కోసం ఎదురు చూస్తున్నారు.

అపార్టుమెంటులో అందరూ .. అందరికీ స్నేహితులే. పగలు నేను ఇంట్లో ఉండను కాబట్టి, ఏ విషయమైనా చివరి నిముషంలోనే తెలుస్తుంది.

"ఓ.కే .. బై. క్షేమంగా వెళ్లి లాభంగా రండాంటీ" చెప్పింది అక్కడే ఉన్న వర్ధని.

వాళ్ళు అలా బయలుదేరడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. నాకూ యాత్ర లంటే చాలా ఇష్టం. అయితే ఎక్కడికి వెళ్ళినా ఉద్యోగాన్ని చూసుకుని, పరిగెత్తుకుంటూ వెళ్లి .. పరిగెత్తుకుంటూ వచ్చేయడం అవుతుంది. పోనీ, మరో రెండు రోజులు శెలవు ఎక్కువగా .. పెట్టుకుని తీరికగా చూసొద్దాం అంటే .. రైలు టైమింగ్స్ , వెళ్ళిన పనులకూ పొంతన కుదరక .. కొంత హోటల్ ఖర్చులకూ వెరసి, వెళ్ళామా .. వచ్చేసామా అన్నట్లుంటుంది మా టూరు.

ఏమైనా మాట్లాడదామన్నా వీలు అవలేదు.

అందుకే 'వెళ్లి రండి' అంటూ చెయ్యి ఊపాను.

అంత లగేజీ వేసుకుని వెళుతున్నారంటే .. ఎన్ని రోజులు ఉంటారో. మరి ఇంట్లో అత్తగారో! డెబ్బై ఏళ్ల ముసలమ్మ. ఆమెకు నాలుగేళ్ళుగా .. అన్నీ మంచం మీదే జరుగుతున్నయట. మనిషిని పెట్టి చేయిస్తున్నారు. పని మనిషి మరియమ్మే ఉండి చేస్తుంది. ఎంత కష్టపడితే ఆమెకు .. నెల తిరిగే సరికి 'ఆరువేల' రూపాయలొస్తాయి.

వారం రోజుల క్రిందటే, కూతుళ్ళు ఇద్దరూ .. వాళ్ళ వాళ్ళ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

మరి ముసలమ్మ పరిస్థితి ఏమిటీ?

ఆ ముసలమ్మ గారికి ఇద్దరూ కొడుకులే. అవధానులుగారే పెద్ద. రెండో అబ్బాయి అమెరికాలో ఉంటాడు. అతనే .. అన్నగారికి ఆర్థిక సహాయం చేస్తూ ఉంటాడని అనుకోవడం.

లిఫ్టులో పైకి వస్తూంటే ఇదే ఆలోచన.

ఇంట్లోకి అడుగుపెడుతూ చెప్పాను "అవధానులుగారు కాశీ యాత్రకు వెళుతున్నారు" అని.

"ఎప్పుడు" అన్నారాయన.

"ఇప్పుడే. మాట్లాడడానికి వీలుపడలేదు"

"వాళ్ళు ఇంతకుముందే ప్రయాణం పెట్టుకున్నారు. సమైక్యాంధ్ర గొడవల్లో. అప్పుడు రైళ్ళు తిరగలేదని మానేసారు"

"అవును. నిజమే. మళ్ళీ ప్రయాణం పెట్టుకోడానికి రెండేళ్ళు పట్టిందన్న మాట. అంతా బాగానేవుంది. కానీ, ఇంట్లో

ముసలమ్మ .. అదే అవధానులగారి తల్లి .. ఉండిపోయింది. పోనీ, బంధువుల ఇంట్లో పెట్టారు అనుకుందాం .. అన్నా వాళ్లకి ఎవరూ లేరే ఇక్కడ" మనసులోని సంశయాన్ని బయటపెట్టాను, హేండు బేగ్గు తీసి అలమరలో పెడుతూ.

"వాళ్ళ గొడవ నీకెందుకు? నీ పనేదో నువ్వు చూసుకోక" ఆయనకు ఎదుటివాళ్ళ గురించి .. ఏది చెప్పినా విసుగ్గానే ఉంటుంది. రిటైరు అయ్యి మూడేళ్ళుగా ఇంట్లో కూర్చున్నారు. టి.వీ. తప్ప మరో వ్యాపకం లేదు. ఖాళీగా ఉండే వాడి 'బుర్ర డెవిల్స్ కార్ఖానా' లాంటిదని నాన్నగారు చెబుతూ ఉంటారు. ఆయన బుర్రలో చాలా దెయ్యాలున్నాయి. ఎడ్డెం అంటే తెడ్డెం అంటారు.

"అంతే లెండి. చూసుకోక ఏం చేస్తాను. అసలు ఎప్పుడైనా .. మనం కాశీ యాత్రకు వెళుతామా. ఉద్యోగంలో ఉండగా తీరిక దొరకదు. రిటైరు అయ్యాక ఓపిక చాలదు " అన్నా ఆయన మాటలు తిప్పికొడుతూ.

అప్పుడైనా ఆయన మనసు కరిగి 'అలాగే వెళదాం. వాళ్ళు వచ్చిన తరువాత .. ప్రయాణ వివరాలు కనుక్కో' అంటారన్న గుడ్డి ఆశ.

★ ★ ★

రెండు రోజుల తరువాత ...

ఆఫీసుకి వెళ్ళడం కోసం మెట్లు దిగి వస్తుంటే, అవధానుల గారి గుమ్మం దగ్గరకు వచ్చేసరికి .. సిగ్నల్స్ కోసం అన్నట్లు వీధి వాకిట్లోకి వచ్చి నిలబడి, మరియమ్మ ఫోన్లో మాట్లాడుతుంది.

"ఇక్కడ అంతా బాగానేవుంది బాబుగారూ.. అమ్మగారు బాగానే ఉన్నారు. స్నానం చేయించి .. ఇప్పుడే కాఫీ ఇచ్చాను. ఇక వంట చెయ్యాలి. ఒకసారి ఫోన్ ఇవ్వనా .. బాబుగారూ .. అమ్మగారితో మాట్లాడతారా" అంటూ గట్టిగా మాట్లాడుతుంది..

అంటే, ముసలమ్మకి కాపలాగానూ అన్నిటికీ ఈమెనే పెట్టారన్న మాట.

ఆండాళ్ళమ్మ గారికి ప్రతిదీ అంటూ .. సొంటే. అపార్టుమెంటులో.. సెల్లార్లో ఫంక్షన్లు ఏమైనా జరిగితే చాలు .. అన్నిటికీ ఆమె ముందుండి పనులు అందిపుచ్చుకుని, మాలాంటి వాళ్ళని కాస్త దూరం పెడుతుంది. మాంసాహారులని

మరి మరియమ్మ ఎవరు? వాళ్ళకు ఏ విధంగా దగ్గర. కావాలనుకుంటే ఎవ్వరినైనా కలుపుకోగలరన్న మాట. ఎటు చూసినా వాళ్ళ కత్తికి రెండువైపులా పదునే. నాలుగునెలల క్రిందట జరిగిన విషయం లీలగా మెదిలింది నా మదిలో.

★ ★ ★

అది కార్తీకమాసం .. వనభోజనాలు ..

ఉసిరిచెట్టు క్రింద సహపంక్తి భోజనాలు. అదో సంప్రదాయం..

అందులో భాగంగానే మా అపార్టుమెంటులో చివరి ఆదివారం మరెక్కడికో వెళ్ళకుండా ఇంటిలోనే భోజన కార్యక్రమం ఏర్పాటు చేసారు. కారణం .. అపార్టుమెంటులో నాటిన ఉసిరిచెట్టు .. పది సంవత్సరాల తరువాత ఈ ఏడాదే కాపుకు రావడం.

అపార్టుమెంటులో అన్ని వర్ణాల వాళ్ళు ఉన్నారు. ఎక్కువగా బ్రాహ్మణులు.

అసలు ఇంటి స్థలం ఇచ్చింది కూడా బ్రాహ్మణులే కావడంతో .. సర్వజనఆమోదంగా విందులు అన్నీ శాఖాహార భోజనాలే.

ఆదివారం కూరగాయల భోజనం చెయ్యాలంటే చాలా మంది ఇబ్బంది పడతారు. మరో రోజైతే ఉద్యోగస్తులకు వీలుకాదు. కాబట్టి తప్పదు .. నలుగురితో నారాయణ .. కులంతో గోవింద.

విందులు .. వినోదాలకి ఎవ్వరూ వ్యతిరేకులు కాదు, కాబట్టి అందరూ ఉత్సాహంగా పాల్గొనేవారు.. ముఖ్యంగా

ఆడవాళ్ళు .. ఆ రోజుకి వంట పని తప్పుతుందని.

'కుంతీ మాధవ స్వామి కళ్యాణం' నిమిత్తం ఈ ఆదివారం .. మన అపార్టుమెంటు సేల్లారులోనే వనభోజన కార్యక్రమం . అందరూ రావలసిందని'పిలుపులు వెళ్ళాయి.

చందా ఏమీ అడగలేదు. ఏదో విధంగా మేనేజ్ చేస్తే .. ఈ నెలలోనే డిసెంబర్ ముప్పై ఒకటి ఉంది .. కొత్త సంవత్సర ఆహ్వానానికి .. ఎలాగూ ' కేక్' కటింగు .. ఫంక్షన్ ఉంటుంది కాబట్టి .. అంతా కలిపి ఒకేసారి తీసుకోవచ్చని, ప్లాన్.

ఆదివారం వంట పని లేదు లీజర్ గానే ఉండవచ్చు అనుకున్నా, నా ఇంట్లో పని తెమిలేసరికే టైము పన్నెండు అయ్యింది.

"క్రింద వంటలు చేస్తున్నారు .. అపుడే కందాబచ్చలి .. చేసేసారు. బూరెలు కూడా వేస్తున్నారు. ఓ సారి పోయి చూసి రా వచ్చు కదా!" అన్నారాయన అప్పుడే క్రిందనుంచి వస్తూ నేనేదో ఇంట్లో తీరికగా కూర్చున్నట్లు.

నేనూ అలాగే అనుకున్నా .. పనులన్నీ తెముల్చుకునే సరికి .. ఓపిక లేకుండా పోయింది.

రోజూ ఆఫీసు అంటూ బయటికి పోవడంతో .. శెలవు రోజు శరీరం విశ్రాంతిని కోరుకుంటుంది. అలా అని .. సరిగ్గా భోజనాల టైముకే క్రిందకి దిగితే ఏమనుకుంటారో! అన్న సందేహం పీడించి బయలుదేరాను.

వంటకి ఎలాగూ వంట బ్రాహ్మలు ఉంటారు. ఎప్పటి నుంచో వాళ్ళే వచ్చి చేస్తారు రావులపాలెం నుంచి వచ్చి. అవే వంటకాలు .. అవే రుచులు అయినా ఎప్పటి కొత్తదనం అప్పటిదే.

క్రిందకి వెళ్లేసరికి అప్పటికే చాలా మందే వచ్చి ఉన్నారు సుబ్బలక్ష్మిగారూ, మీనాక్షిగారు, వనజ, అనిత. కృష్ణగారు, సత్యనారాయణగారు ఇంకా .. ఇంకా చాలా మంది.

సెల్లార్ ముందు షామియానా వేసి, కుర్చీలు .. బల్లలు వేసి సిద్ధం చేసారు. అందరూ కొత్త బట్టలు కట్టుకుని, పండుగ వాతావరణాన్ని తలపించేలా హడావుడి గా చేస్తున్నారు.. వండిన వంటకాలన్నీ ఓ ప్రక్కగా పేర్చబడి ఉన్నాయి.

నన్ను చూస్తూనే ఆండాళ్ళు గారు " మీ వారిని కూడా పిలిచేయ్యండి. వంటలు పూర్తి అయ్యాయి. అందరూ వస్తే వడ్డించేస్తాం " అన్నది.

ఆమె వైపు ఆశ్చర్యగా చూస్తూ " అప్పుడేనా! ఇంకా పన్నెండున్నర అవలేదు. అప్పుడే భోజనాలా. అయినా ఇందాకే టిఫెను పంపించారు కదా! ఇప్పుడే ఏం తినేస్తాం" అన్నా.

అక్కడే ఉండి ఏదైనా పని చేద్దాం అన్నా 'మడి .. చాదస్తం' అనుకునే వాళ్ళ మద్య ఏం చేస్తాములే అని పైకి వచ్చేసాను

★ ★ ★

గంట తరువాత ..వెళితే భోజనాలు వడ్డించేస్తున్నారు.

గేటుకి దగ్గరలో ఉన్న ఉసిరిచెట్టుకి పూజ చేసినట్లున్నారు. చెట్టు మొదట్లో పసుపు, కుంకుమలు చల్లి , నైవేద్యం పెట్టబడి ఉంది.

బహుశా శాస్త్రిగారి దంపతులు కళ్యాణం చేసిఉంటారు. అన్ని పండుగాల్లోనూ వాళ్ళే ముందుంటారు. మొదటి పంక్తిలోనే భోజనాలకు కూర్చున్నారు.

చాలా విస్తరు వడ్డించేసి ఉంటే .. నన్నూ కూర్చోమంటే, వెంటనే కూర్చున్నాను. వడ్డించేసినవి .. ఎక్కడ చల్లరిపోతాయో నని. నాకసలే వేడిగా తినే అలవాటు.

భోజనంచేస్తున్నంతసేపూ..గోవిందనామస్మరణలతోనూ .. జోకులూ .. చమత్కారాలతో జరిగిపోయింది. బంతి మీదనుంచి లేస్తుంటే, శాస్త్రిగారు అన్నారు అందర్నీ ఉద్దేశించి " బోజనాలు చేసిన వాళ్ళు వెళ్ళిపోతే కాదండోయ్! తరువాత వాళ్లకి వడ్డించాలి" అని.

నిజమే. అప్పుడే ఇంటికి వెళ్ళిపోయి ఏం చేస్తాను. ' కాసేపు వుండి వడ్డించాలి' అనుకున్నా.

మళ్ళీ మరో విడత విస్తర్లు వేస్తుంటే, అక్కడే ఉన్న ఆండాళ్ళుగారితో 'మీరూ కూర్చోండి .. మేం వడ్డిస్తాం' అంటూ వంటకాలున్న ఓ బేసిన్ అందుకునే ప్రయత్నం చేశాను.

"మీరెందుకు ... వడ్డించడానికి ... మేం ఉన్నాంలే .. వెళ్లి కూర్చోండి" అంటూ ఖాళీగా ఉన్న కుర్చీల వైపు చెయ్యి చూపించిందావిడ. ఆ మాట కాస్త కటువుగా, వాడిగా నాకు మరోలా అర్ధమయ్యింది.

మీరేందుకు ..నాన్ బ్రహ్మిన్స్ .. మేమున్నాములే చూసుకోవడానికి' అన్న గుడార్థం ధ్వనించింది.

అయినా నాకు కాస్త చెయ్యి నొప్పి. నేను తెలిసిన అందరికీ .. ఆ సంగతి తెలుసు. అందుకే, ఆవిడ అలా అని ఉంటుందిలే .. అని సరిపెట్టేసుకున్నాను. ఆవిడ చెప్పినట్లే అక్కడే కూర్చుని .. ప్రక్కనున్న వాళ్లతో కబుర్లలో పడ్డాను.

నాలుగునెలల క్రిందట అద్దెకు వచ్చిన ఆచారిగారి భార్య ..అన్నీ తానై చక్కబెడుతుంటే .. పదేళ్లుగా ఉన్న .. స్వంత ఇంటిదాన్ని అస్తిత్వాన్ని కోల్పోయాననిపించింది .

ఆండాళ్ళుగారి భర్త " దేవుడికి చందా వ్రాసే వాళ్ళుంటే వ్రాయండి .. బాబూ" అంటూ ఓ నోటుబుక్కు ముందు పెట్టుకుని కూర్చున్నారు. ముందు కలెక్షను లేకపోవడంతో .. భోజనం చేసిన ప్రతివాళ్ళు ఎంతో .. కొంత వ్రాస్తున్నారు.

సరదాగా .. సంతోషంగా సాగిపోతున్న క్షణాల్లో ..

ఉన్నట్టుంది .. గట్టిగా, కేకలు వినిపించాయి. మొదట్లో .. ఏ తాతగారో పిల్లల మీద కేకలేస్తున్నారని అనుకున్నాం. కానీ, ఆనందంలో .. అపశ్రుతి. అందరి దృష్టి అటువైపు మళ్ళింది.

నాకు ఎదురైన అనుభవమే. అది ఇంతింతై .. వటుడింతై అన్నట్లు .. అది అంతటకూ ప్రాకింది. .నాన్ బ్రహ్మిన్స్ ఎవరో వడ్డించడానికి వెళితే .. అదే మాట అన్నారట.

అంతే. పంక్తిలో చివర్న కూర్చున్న వెంకటరావుగారు పట్టుకున్నారు.

"ఈ రోజు నాన్ బ్రహ్మిన్స్ వడ్డించ కూడదన్నారు. రేపటిరోజున మీరు వేరుగా .. మేము వేరుగా కూర్చోవాలని అంటారు. లేదంటే మీరు భోజనాలు చేసిన తరువాతే .. మేము చెయ్యాలని అంటారు.. మనసులో ఇలాంటి ఆలోచనలు .. ఉంచుకుని ఇలా విందు భోజనాలకి పిలిచి మమ్మల్ని అవమానించడమెందుకు? వదిలేస్తే మా మానాన్న మేం పోయేవాళ్ళం గదా " అంటూ కోపం తెచ్చుకున్నారు.

అతను బయటపడ్డారు. నేను కక్కలేక దిగమింగాను.

ఎవ్వరూ ప్రతిఘటించకపోతే అది చేతకానితనమే అవుతుంది.

అతను అ భోజనంగానే విస్తరి ముందు లేచిపోయారు.

ఇన్ని సంవత్సరాలూ లేని వైషమ్యాలు ఇప్పుడు దేనికీ. ఎన్నో వినాయకచవుతులు, ఎన్నెన్నో ఫంక్షన్స్ కలిసి చేసుకున్నాం. ఇపుడు ఈ ముసలం ఎందుకు పుట్టిందో .. ఎవరి వల్ల పుట్టిందో తెలియక పోయినా మూలకారణం ఆండాళ్ళు గారని .. నాలాంటివాళ్ళ అనుమానం. ఆమె మాటే చెల్లాలి అపార్టుమెంటులో.

ఇంట్లో ఉసిరిచెట్టు కాపు కాయడమేమిటి ..కొందరి మనసులు గాయపడడం ఏమిటి?

అత్తగారిని తమ వాళ్ళు కాని మనిషిపై వదిలేసినప్పుడు అవేమీ గుర్తుకు రాలేదా. అన్నీ గుర్తుకొస్తే కాశీ యాత్ర చెయ్యలేదేమో! కొన్ని కావాలనుకుంటే ..కొన్ని వదులుకోవాలట.

ఆవిడ కాశీలో తొమ్మిది రాత్రుల నిద్ర చెయ్యాలనుకుంది. అందుకే వాళ్ళ పద్దతులైన 'అంటూ .. మడి'ని పదేహేను రోజుల పాటు ప్రక్కన పెట్టింది. ఏదైనా మనం అనుకోవడం లోనే ఉంటుంది.

మంచైనా .. చెడైనా.

కవిత

# అన్నదాత సుఖీభవ



**కవిత నాగులవంచ**
**చరవాణి :- 9550374327**

ఎటు చూసినా కష్టాలు
కష్టాలతోడి కడగండ్లు
కడగండ్లు కాక ఏం ఉన్నాయి
ఉండోలేకనో అప్పుచేసి
వరి పంటకు వడ్లు తెచ్చి
తెచ్చిన వడ్లను నారుమళ్లు గాచేసి
నారుమడిని కలుపుతీసి
కలుపుతీసిన మడికి
మందువేసి నీళ్ళుపెట్టి
ఎరువుల ధరలు పెరిగినా
వరునుడు దయతలవక పోయినా
ప్రకృతి కోపించినా
కోపంతెలియని యోగి
పగలనక ,రాత్రనక
ఎండనక ,వాననక
విరామమెరుగక
నిరంతరాయంగా
కష్టపడి పనిచేయడం ఒక్కటే
తెలిసిన రైతన్న
నిస్వార్థానికి నిలువుటద్దం
తను తింటున్నాడా అన్నం
నలుగురికి పెట్టడమే తప్ప
తప్పుడు ఆలోచనలే రావు
అప్పుల ఊబిలో చిక్కుకున్న
ఆత్మహత్యే శరణం అంటాడు
ఎవరిని నిందించని మనిషి
అవసరమైనప్పుడు ఉరమని మేఘం
వడ్లారబోసినప్పుడు ఉరిమినా
మిల్లుకు వెళ్ళాల్సిన ధాన్యం
మురికి కాలువలలో కలిసినా
తన అదృష్టాన్ని నిందించుకుంటాడు
అన్నం పెట్టిన వాన్ని సుఖీభవ అంటాం
పండించిన వాన్ని ఏమంటున్నాం
ఆశీర్వదిస్తున్నామా
కష్టాల కడలిలోకి నెట్టేస్తున్నాం.
ఎవరైనా రైతు గోసను పట్టించుకుంటారా.
బంగలాలు మిద్దేలు బంగారం
ఏది వద్దు
పంటకు మద్దతు ధర
ధాన్యాన్ని ప్రభుత్వమే కొనడం
రైతు ఋణం పథకాలు
అన్నదాత సుఖీభవ అనే
చల్లటి మాట.

కవిత

# క్షమించండి



వల్లాల విజయలక్ష్మి(టీచర్)
ఫోన్ : 9247397209/8247018930

పగలంతా ఎగిరి ఎగిరి అలసిన
రెక్కలను సేదతీర్చుకోవటానికి
మీరు వాలే కొమ్మలేమయ్యాయో?..
తెలియక  హృదయవిదారకంగా
అనంత ఆకాశం కింద కిచకిచమంటున్న
పిచ్చుకలారా ★క్షమించండి!★

మీ నిలువ నీడను కాపాడలేని
నా దోషానికి శపించకండి
మీరు అందరికీ వినపడేలా
దీనంగా అరుస్తున్నారు
నేను ఎవరికీ కనపడకుండా
మౌనంగా రోదిస్తున్నాను!

ఎదురింటి మేడ నుండి
పక్కింట్ల మీద నుండి
మా గూడు మీదకు
చకచకా దూకుతూ
నవ్వించే వింత చేష్టల
కోతమ్మలూ! ★క్షమించండి★
మీరు కూర్చునే కొమ్మలు లేవు
మీరూగే ఆకు ఊయల్లు మరుగయ్యాయి
తరచుగా మా చెట్టుపైకి విచ్చేస్తూ
తెగ నవ్వి(స్తూ)కవ్వించిన మీరు
ఉగ్రరూపులై కోపించకండి!

మా ఇంటి చిరునామాగా నిలిచిన
పచ్చనివృక్షమా కూలితివా?
నరులస్వార్థంతో కూల్చబడితివా?
మా ఇంటి దర్పంగా తోచిన
చల్లనినీడను మాయం చేసితివే!
నువ్వు తల ఎత్తుకునే కొలది
నీ వేర్లు భూమిలోకి చొచ్చుకెళ్ళి
పక్కవాళ్ళతో పంచాయితీలవుతున్నయి!
నీ లాభాల గురించి మాట్లాడి మాట్లాడి
పోట్లాడినంత పని చేస్తూ
నీ పచ్చదనాన్ని మనసారా ప్రేమిస్తూ
నీ స్వచ్ఛ వాయువులను పీలుస్తూ
నీ నీడను నేటివరకే పొడిగించగలిగా
నీ ప్రాణాన్ని నేటివరకే నిలుపగలిగా!

నేనెంత అశక్తురాలను!
రంపపుపొడిగా మిగిలిన
నిన్ను చూసి కరిగి కన్నీరయ్యానే గానీ
నిన్ను కాపాడుకోలేకపోయాను
నేనేం చేసేది చెప్పు!?నీదే తప్పు.
నువ్విచ్చే ప్రాణవాయువు కంటే
నీ వల్ల కలిగే ఆర్థికనష్టాన్నే గమనించే
మధ్యతరగతి జనావాసాల మధ్య
నువ్వలా.. నిండుగా ఎదగటం
వందలజీవులకు ఆవాసమవ్వటం
ఓ చల్లని తల్లీ! నీ తప్పేగా మరీ!
ఈ ఇంటిని కొన్నందుకు
దొరికిన ఉచిత “కానుకా!”
“మా’నవ”న్యాయం చూశావా ★కానుగా!?★
మనఃపూర్వకంగా నన్ను క్షమించు!
ఎవరూ నిన్ను కించిత్తు కదల్చలేని
నా ‘పచ్చని జ్ఞాపకాలలోనే’ జీవించు!

కవిత

# కూడికను



- నస్రీన్ ఖాన్

ఇదిగో..!
నడుస్తున్నానిలా
పెనుచీకటి నుంచి
వెలుతురు తెరలవైపుకు
అలుపెరుగని యోధలా
సవరించిన వెన్నుతో
నిశ్చల దృష్టితో
నాకై వేచి చూసే
అదృశ్య రెక్కల గమ్యం వైపుకు
ఒక్కటొక్కటిగా సాగే
అడుగుల జాతర

దశాబ్దాల క్రితం మొదలైన నడక
మస్తిష్కపొరల్లో
పెనుగులాడే ఊహాసౌధం
కంటికంటని నిద్దురై
చైతన్యరాజ్ఞుల కొలిమిలో
రాటుదేలిన శూలమై
వెంటాడుతుండగా
ఒంటరిని కానంటూ దర్శనమిచ్చిన
వందల జతల పాదాలు
లక్ష్యం వైపుకు సాగుతూ

శ్రీనాథ పుంగవుడు అందలమెక్కించిన
తమలపాకు పాదాలు కావవి
ఎగుడు దిగుడు దారుల్లో
దుమ్మూ ధూళితో కొట్టుకుపోయిన మొరటు పాదాలు
రాయీరప్పల తాకిడికి
దోస పచ్చలైన పాదాలు
పూల చాటున దాగిన
దొంగముల్లు దిగిన పాదాలు
పొదల మాటున నక్కిన
విషనాగుల కాలకూటాన్ని మోసే శ్రామిక పాదాలు

దారి పొడుగూతా చెవులను సోకుతూ
శబ్దాలంకార నేపథ్యం
కొలతల వర్ణనలు
కుల వర్గ వర్ణ దూషణలు
వెకిలి చేష్టలు
జంతువులున్న అడవుల్లో కాదు
సభ్యత సంచరించే మనుషులున్న అరణ్యాలు
అమ్మ కడుపున
అసహజ వికసితమై
పొల్లు గింజైపోతే
జాలి పడుతూ ముందుకు సాగే పరిణతి సొంతమిపుడు

కాలం కసాయి కత్తి అయి వెన్నుపోటు పొడుస్తున్నా
సభ్యతా వధ్యశిలపై
దిక్కులు పిక్కటిల్లే ఆక్రందనలు నావే అయినా
తడబడుతూనైనా నడుస్తూనే ఉన్నాను ఉంటాను
ఎందుకంటే
కత్తి దూసినదీ, వధ్యశిలపై బలి పశువును చేసినదీ
రేయింబవళ్ళ ఆర్తనాదాల మధ్య నాలోంచి వచ్చినవాడే
ఏనాటికైనా చేవగింజను తయారు చేయక పోతానా అనే
ఆశతో
ప్రేమామృత పంటే నాటుతున్నాను
ఎందుకంటే
నేను
అందరినీ కలిపేదానను
సమాజం చెప్పినట్టు 'ప్లస్' ను
కూడికను
'మైనస్' ను కాదు
తీసివేతనసలే కాను

కవిత

# సృష్టి కర్తకు మరో రూపం.



ఆచంట సుధా కళ్యాణి

నవరసాలతో వెల్లివిరిసే నిత్య చైతన్యం తాను .
సృష్టికర్త శక్తి యుక్తుల కలబోతకు రూపం తాను!

ఏ బంధానికయినా మూలం మగువే .
కుటుంబాలు అల్లుకునే  అనుబంధాల దండలో
ప్రతి కుసుమం చెదరని తన చిరునవ్వే !!

భాధ్యతలు నెరవేర్చేటప్పుడు ఆకాశంలో సగం తాను .
బంధాలను నిలబెట్టుటలో సర్వం తాను.
ఆమె ఉనికి లేని నాడు బంధాలన్నీ బీటలు పట్టేను  !!

సనాతన కాలాన కూడా శక్తికి మారు పేరు మహిళ .
ఆత్మ నిర్భరతకు కనిపించే చిహ్నం తన మనుగడ .
సహన శీలతతో ఇంటా బయటా అదే నిలకడ !!

ఆమె తరగని ప్రేమ నిధితో ఓలలాడించినా
తన వారి శ్రేయస్సుకై కరిగి కన్నీటిగా మారినా
దుర్బల కానేకాదు కుటుంబాన్ని కాచే కంటిరెప్ప తాను !

అలుపెరుగని భాధ్యతల కిరీటమే తనకి ఆభరణం .
సాధికారతను తన హక్కుగా గుర్తించుట ఎంతో అవసరం !!


# బాల బహుళ

## పీటర్ తెలివి



ఇంగ్లీష్ మూలం: సాన్వి.

అనువాదం: నిరుపమ.



Peter's Smartness

Ones apon a time. There was a village. In the village was a smart boy named Peter. He was famous as he is very smart. Peter is very well known and he can solve any problem. There was also a forest near the village. In the forest, there lived a agressive bull. One day a guy named sam was looking for firewood. He sliped on a stone and the stone went flying towards the forest. The stone hit the same bull. The bull got mad and started to run at the village. Sam saw this and warned everyone. They all got surprise. Even Peter saw this and started thinking. He then got an idea. He called M.r Tom who was so strong. Then M.r Tom punched the bull and the bull never harmed people ever again. Ones again Peter saved the village.

{The end}

ఒక ఊరిలో ఒక చిన్న పిల్లవాడు ఉండేవాడు. అతని పేరు పీటర్. అతను తెలివైన అబ్బాయి. గ్రామానికి సమీపంలో చిన్న అడవి ఉండేది. ఆ అడవిలో ఒక పెద్ద ఎద్దు నివసించేది. ఎద్దు పెద్దది, బలంగా ఉండటమే కాదు చాలా చెడ్డది. ఒకరోజు ఎద్దు పిచ్చి పట్టినట్టు ఊర్లోకి పరుగెత్తింది. పీటర్ ఎద్దును చూసి చాలా భయపడ్డాడు. కానీ పీటర్ తనను, తన చుట్టూ ఉన్న ప్రజలను రక్షించుకోవాలి అనుకున్నాడు. వెంటనే జాన్‌ని పిలిచాడు. జాన్ పీటర్ మామ అతను పెద్ద కండలతో చాలా బలమైన వ్యక్తి. జాన్ వచ్చి ఎద్దుతో పోరాడాడు మరియు ఎద్దు తలపై గట్టిగా కొట్టాడు. ఎద్దు భయంతో తిరిగి అడవికి పరుగెత్తింది. జాన్ ప్రజలను మరియు పీటర్‌ను రక్షించాడు. సమయానికి జాన్‌కి ఫోన్ చేసినందుకు గ్రామస్థులు పీటర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కథలో నీతి:-మనం కష్టాల్లో ఉన్నప్పుడు త్వరగా నిర్ణయం తీసుకునేలా తెలివిగా, ధైర్యంగా ఉండాలి.






'సంఘటిత' ఆవిష్కరణలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్, ప్రెస్ అకాడమీ చైర్మన్ చేతుల మీదుగా మెమెంటో అందుకుంటున్న శ్రేష్టసాయి

# కొత్త పుస్తకాలు




మల్లెసాల (శతాధిక చేతివృత్తి కథల)
సంపాదకులు: జ్వలిత
జెడిపబ్లికేషన్స్ ప్రచురణ,
పేజీలు:1072 వెల: రూ. 1200/-
ప్రతులకు: జ్వలిత సాహితీ వనం, బాలాజీనగర్, కూకట్‌పల్లి,
హైదరాబాద్-72. మొబైల్:9989198943
jwalitha2000@gmail.com
Amazon.in లో కూడా లభ్యం




సంఘటిత
(స్త్రీవాద కవితా సంకలనం)2010-2021
సంపాదకులు: జ్వలిత
జెడిపబ్లికేషన్స్ ప్రచురణ,
పేజీలు:300 ధర: రూ. 300/-
ప్రతులకు: జ్వలిత సాహితీ వనం, బాలాజీనగర్, కూకట్‌పల్లి,
హైదరాబాద్-72. మొబైల్:9989198943
jwalitha2000@gmail.com
Amazon.in లో కూడా లభ్యం




పిడికిటి ఇసుక ,
తిరునగరి దేవకీదేవి (కథలు)
వెల: 150/-
ఫ్లాట్ నెం.205, డ్యూక్స్ గెలాక్సీ
రోడ్ నం.13, బంజారా హిల్స్,
హైదరాబాద్ - 34
మొబైల్: 9949636515




హిజాబ్ (కవిత్వం)-
వెల: 50/-
నేలపూరి రత్నాజీ, చాగల్లు - 534342.
మొబైల్: 891998753.
ప్రచురణ: బహుజన రచయితల వేదిక.



హైదరాబాద్ రవీంద్ర భారతిలో 'మల్లెసాల'ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్ గారు, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణగారు తదితర ప్రముఖులు.(15-05-2022)



ఖమ్మంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో మల్లెసాల ఆవిష్కరిస్తున్న డా. సీతారామ్, తెలంగాణ సాహితి రాష్ట్ర కన్వీనర్ కటుకోజ్వల ఆనందాచారిగారు, తెరసం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరంగారు తదితరులు (29-05-2022)



హైదరాబాద్ రవీంద్ర భారతిలో 'సంఘటితను'ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ మహిళాభివృద్ధి సంస్థ చైర్మన్ ఆకుల లలితగారు, గోగుశ్యామల, తెలంగాణ అకాడమీ తొలి కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డిగారు, ప్రస్తుత అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్ గారు, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణగారు, సంగిశెట్టి శ్రీనివాస్ గారు, తిరునగరి దేవకి మేడం, బి.ఎస్ రాములుగారు, నాళేశ్వరం శంకర్ గారు తదితర ప్రముఖులు.



'సంఘటిత స్త్రీవాద కవిత్వం (2010-2011) సంకలనానికి కవితలందించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అందుకున్న కవయిత్రులు



'సంఘటితకు' తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అందుకుంటూ

Printed at JD Publications, Hyderabad

Price : 100/-